మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 106 • పేజీలు:12+16 • వెల: రూ.5 శుక్రవారం • 16-3-2018 www.manamnews.com /manamnews

రూ.1,74,453,84,00,000

తెలంగాణ బడ్జెట్ విశ్వరూపం

- వృద్ధిరేటులో దేశంలోనే అగ్రగామి
- తలసరి ఆదాయం 13.4% వృద్ధి
- రెవెన్యూ మిగులు రూ. 5520 కోట్లు
- జీడీపీ వృద్ధిరేటు 10.2%గా అంచనా
- ఉత్పత్తి రంగం వృద్ధిరేటు 7.6%
- రాష్ట్ర ఏర్పాటు తర్వాతే పురోగతి
- తెలంగాణ మార్గం.. అనుసరణీయం
- బంగారు తెలంగాణ ధ్యేయంగా బడ్జెట్
- ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ వెల్లడి





"చీకటి నుంచి వెలుగులోకి, అపనమ్మకం నుంచి ఆత్మ విశ్వాసంలోకి, అణగారిన స్థితి నుంచి అభ్యున్నతిలోకి, వలస బతుకుల నుంచి వ్యవసాయ ప్రగతి వైపు రాష్ట్ర ప్రజలను నడిపిస్తున్నం"

- ఈటల రాజేందర్, ఆర్థికమంత్రి

హైదరాబాద్, మార్చి 15 (మనం ప్రతినిధి):

తెలంగాణ ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పొరుగు రాష్ట్రం ఏపీ కంటే సుమారు 17 వేల కోట్లు తక్కువైనా.. మొత్తం రూ. 1,74,453.84 కోట్లతో బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రెవెన్యూ వ్యయం రూ. 1,25,454.70 కోట్లుగాను, రెవెన్యూ మిగులు రూ. 5520.41 కోట్లుగా చూపారు. ద్రవ్యలోటు రూ.29077.07 కోట్లు. కేంద్రపన్నుల వాటాగా రూ. 19,207.43 **మిగతా 6లో..**

మొత్తం బడ్జెట్- రూ.1,74,453.84 కోట్లు	
రెవెన్యూ వ్యయం	రూ.1,25,454.70 కోట్లు
క్యాపిటల్ వ్యయం	రూ.33,369.10 కోట్లు
రెవెన్యూ మిగులు	రూ.5520.41 కోట్లు
ద్రవ్యలోటు	రూ.29077.07 కోట్లు
రాష్ట్ర సొంత ఆదాయం	రూ.73,751.88 కోట్లు
కేంద్రం నుంచి వచ్చే నిధులు	రూ.29,041.88 కోట్లు

లోగుట్టు పెరుమాళ్ళకెరుక



ఇదీలోకం!



ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి సా.6.18 తదుపరి త్రయోదశి; నక్షత్రం: శతభిషం సా.6.42 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా.1.22-3.02; దుర్ముహూర్తం: ఉ.8.50-9.38, మ.12.49-1.37; రాహుకాలం: ఉ.10.56-12.25; అమృతఘడియలు: ఉ.11.05-12.47; శుభసమయం: మ.1.38-3.00.

సూర్యోదయం: 6.27,
సూర్యాస్తమయం: 6.23


వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు రెండూ తగ్గుతాయి. రాత్రిపూట గంటకు 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 30 డిగ్రీలు
కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు
గాలిలో తేమ: 77 శాతం



చంద్రుగొండలోని తౌఫిక్ నానమ్మ ఇల్లు; చిన్ననాటి తౌఫిక్



భద్రాద్రిలో ఉలికిపాటు

ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద నీడ

- **కశ్మీర్ ఎన్‌కౌంటర్‌లో తౌఫిక్ హతం**
- **అతడిది మణుగూరు అని ప్రచారం**
- **కుటుంబంతో అనుబంధం శూన్యం**
- **సంబంధం లేదు.. పొమ్మన్న నానమ్మ**

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 15 (మనం బ్యూరో):

ఎక్కడో జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్‌లో ఎన్‌కౌంటర్.. అక్కడ ముగ్గురు ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు మరణించారు.. దీంతో మనకు **మిగతా 6లో..**

దమ్ముంటే నాపై పోటీ చెయ్

కేసీఆర్‌కు కోమటిరెడ్డి సవాల్.. నేనోడితే రాజకీయ సన్యాసం చేస్తా

- మీ కుటుంబం దానికి సిద్ధమేనా?
- నిలదీస్తామనే వేటు: కోమటిరెడ్డి
- కల్వకుంట్ల కుటుంబాన్ని తరిమికొట్టాలి
- కార్యకర్తలకు సంపత్ కుమార్ పిలుపు
- దీక్ష విరమించిన ఇరువురు నేతలు
- నిమ్మరసం ఇచ్చిన కోదండ రామ్

హైదరాబాద్, మార్చి 15 (మనం ప్రతినిధి):

దమ్ముంటే తనపై పోటీకి సిద్ధం కావాలని సీఎం కేసీఆర్‌కు బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాల్ విసిరారు. 'నీకు ధైర్యం లేకుంటే నీ కొడుకుతో పాటు నీ కుటుంబంలో ఎవరినైనా పోటీలోకి దింపొచ్చు. పోటీలో నేను ఓడితే రాజకీయాల నుంచి **మిగతా 6లో..**





పాక్‌లో హ్యాపీ.. భారత్‌లో అన్‌హ్యాపీ!

చైనా.. నేపాల్.. భూటాన్.. బంగ్లా.. పొరుగుదేశాలన్నీ మనకంటే నయం

- సంతోషంలో ఫిన్లాండ్‌దే అగ్రస్థానం
- ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 15:

భారతీయులు రోజురోజుకూ బాధలలో మునిగిపోతుంటే, పొరుగునున్న పాకిస్థాన్ వాళ్లు మాత్రం చాలా సంతోషంగా ఉంటున్నారట. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితి ప్రతియేటా విడుదల చేసే 'ప్రపంచంలో సంతోషకరమైన దేశాల జాబితా'లో తెలిపారు. 2016 కంటే 2017 సంవత్సరంలో భారత్ ఈ సూచికలో నాలుగు ర్యాంకులు **మిగతా 6లో..**

మందుపాతరలు.. కేరాఫ్ హిడ్మా!

భద్రతా దళాలకు మోస్ట్ వాంటెడ్.. అతడి తలకు వెల రూ.70 లక్షలు

- దండకారణ్యం మొత్తం కొట్టిన పిండి
- ప్రతి మందుపాతర వెనుక అతడే?
- జవాన్ల మృతి ఘటనకూ సూత్రధారి
- ఆదివాసీలతో సొంతంగా నెట్‌వర్క్
- 50 కి.మీ. పరిధిలో వాళ్ల కాపలా
- పోలీసులకు కొరుకుడుపడని వ్యక్తి
- తొమ్మిదేళ్ల వయసులోనే ఉద్యమంలోకి
- ఇంటెలిజెన్స్ వర్గాల వద్ద పక్కా సమాచారం

పెద్దపల్లి క్రైం, మార్చి 15 (మనం న్యూస్):



దండకారణ్యం ప్రాంతంలో సాయుధ బలగాలకు పెద్దమొత్తంలో నష్టం కలిగిస్తున్న ఐఈడీ మందుపాతర పేలుళ్ల వెనక ఉన్న మాస్టర్ మైండ్‌ను గుర్తించారు. భద్రతాదళాలకు మోస్ట్‌వాంటెడ్ అయిన అతడు.. మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడు మడావి హిడ్మా. నేపాల్ నుంచి కర్ణాటక వరకు మావోయిస్టులు ప్రకటించిన రెడ్‌కారిడార్ ప్రాంతమే దండకారణ్యం. అక్కడ పేలుతున్న ప్రతి మందుపాతర వెనుక ఉన్నది ఒకే **మిగతా 6లో..**

ఇది ఎన్నికల బడ్జెట్ కాదు

- తండ్రి స్థాయిలో ఆదుకునే బడ్జెట్
- సంక్షేమానికే మొదటి ప్రాధాన్యం
- అన్ని రంగాలకూ పెద్దపీట వేశాం
- అప్పులు ఊరికే చేయట్లేదు
- తెచ్చినవన్నీ ప్రాజెక్టులపై ఖర్చు
- పెన్షన్లకే రూ.5,366 కోట్లు ఇచ్చాం
- బడ్జెట్ అనంతరం మీడియాతో ఈటల

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): అందరూ అనుకుంటున్నట్లుగా ఇది ఎన్నికల బడ్జెట్ కాదని, తండ్రిస్థాయిలో ఒక కుటుంబాన్ని ఆదుకునేలా బడ్జెట్‌ను రూపొందించామని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని, ఆసరా లేని వృద్ధులకు ప్రభుత్వం పెద్ద దిక్కులా నిలబడిందని అన్నారు. అప్పులు ఊరికే చేయట్లేదని, తెచ్చిన అప్పులన్నీ ప్రాజెక్టుల నిర్మాణంపై వెచ్చిస్తున్నామని అన్నారు. గురువారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. 2014కు ముందు కేంద్రానికి కన్నా తక్కువగా రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు ఉండేదని మంత్రి పేర్కొన్నారు. అప్పట్లో కేంద్ర జీఎస్‌డీపీ 5.9 శాతంగా ఉంటే ఉమ్మడి రాష్ట్రంలో 4.2 శాతంగా ఉందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో 6.6 శాతంగా ఉంటే రాష్ట్రంలో 10.2 శాతంగా ఉందని అన్నారు. బడ్జెట్‌లో అన్నివర్గాల సంక్షేమంతోపాటు సాగుకు అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. గత బడ్జెట్‌లో సాగుకు రూ.25 వేల కోట్లు కేటాయిస్తే.. రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈసారి వ్యవసాయ, అనుబంధ రంగాలకు 26 శాతం అదనంగా నిధులు కేటాయించామన్నారు. ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా, సీఎం కేసీఆర్ పర్యవేక్షణ లోనే బడ్జెట్ రూపొందించామన్నారు. అంతేగానీ.. ఓట్లు.. సీట్ల దృష్టితో రూపొందించలేదని చెప్పారు. గత నాలుగేళ్లగా ప్రభుత్వం ప్రవేశ పెట్టన బడ్జెట్‌లన్నీ ప్రజల ఆమోదం పొందాయని చెప్పారు. పెన్షన్లకు ఉమ్మడి రాష్ట్రంలో 890 కోట్లి స్తే..తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 5,366 కోట్లు ఇస్తున్నామని తెలిపారు. అప్పులు చేశామని ప్రతి పక్షాలు ఆరోపించడం తగదని, అప్పులు చేయకుండా ఏ రాష్ట్రం కూడా అభివృద్ధి చెందదని అన్నారు.



బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఈటల


ఇది.. అందరి బడ్జెట్

సమతుల్యత పాటించారు: సీఎం కేసీఆర్



హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): అసెంబ్లీలో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాల అభివృద్ధి, సంక్షేమానికి ఉపయోగపడేలా ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ అభిప్రాయపడ్డారు. పూర్తి సమతుల్యంతో బడ్జెట్‌ను ప్రతిపాదించారని అభినందించారు. ఆదాయ వనరులు, తెలంగాణ అవసరాలు, ప్రభుత్వ లక్ష్యాలకు మధ్య పూర్తి సమన్వయం కుదిరుస్తూ బడ్జెట్ రూపొందించినట్లు సీఎం తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు సమర్థంగా అమలు చేసే విధంగా వార్షిక ఆర్థిక ప్రణాళిక రూపొందించిన ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను, ఆర్థిక శాఖ ముఖ్యకార్యద ర్శి రామకృష్ణారావు, ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డిని ముఖ్యమంత్రి అభినందించారు. వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, పంట పెట్టుబడి మద్దతు పథకం, విద్యుత్ సబ్సిడీలకు ఎక్కువ నిధులు సమకూర్చడం వల్ల తెలంగాణలో వ్యవసాయ రంగాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తున్న కార్యక్రమాలు విజయంతంగా ముందుకు సాగుతాయని చెప్పారు.

కాకి లెక్కల బడ్జెట్: లక్ష్మణ్



హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా అబద్దాల చిట్టా అని, ఖర్చులకు, కేటాయింపులకు పొంతన లేదని, దూరదృష్టి లేని బడ్జెట్ అని బీజేపీ ఎమ్మెల్యే లక్ష్మణ్ అన్నారు. ఎన్నికల కోసం ప్రజలను మభ్య పెట్టే విధంగా బడ్జెట్ ఉందన్నారు. కాకి లెక్కలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆక్షేపించారు. బడ్జెట్‌పై గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్లో ఎలాంటి జీవం, సారం లేదన్నారు. ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు భిన్నంగా బడ్జెట్ రూపకల్పన చేశారని ఆయన దుయ్యబట్టారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల మీద అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిందని, రాష్ట్రం ఏర్పడిన సమయంలో 70 వేల కోట్ల అప్పుంటే, ఇప్పుడు 1.75 లక్షల కోట్లకు అప్పులు పెరిగాయన్నారు. సగటు ఆదాయం విషయంలో రాష్ట్రం 13 స్థానంలో ఉన్నామన్నా విషయాన్ని మరిచిపోయి, సర్కారు ప్రగల్భాలకు పోతుందన్నారు. ఎంబీసీలకు ఇంతవరకు ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని విమర్శించారు. నాలుగేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించింది ఎంత, ఖర్చు చేసింది ఎంతో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీల సంక్షేమానికి ఐదేళ్లలో 50 వేల కోట్లని , ప్రతి ఏటా 10 వేల కోట్లని చెప్పిన కేసీఆర్, నాలుగేళ్ల కాలంలో ఎంత కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు.

అంకెల గారడీ..మాయ మాటలు

- బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం: కృష్ణయ్య
- బరువెక్కువ..చమురు తక్కువ: సండ్ర



హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బీసీ సంఘం నేత, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య అన్నారు. 45 ఏండ్లుగా కొనసాగుతున్న బీసీ కార్పొరేషన్‌కు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. గురువారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాదితో పోలిస్తే బీసీలకు కేటాయింపుల్లో ఆశించిన స్థాయిలో పెంపు లేదన్నారు. 2017 డిసెంబరులో బీసీ ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఆర్భాటం చేసిన కేసీఆర్, ఆ సమావేశాల్లో తీర్మానించిన వాటికి రూపాయి కూడా కేటాయించలేదన్నారు. గతేడాది ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించిన ప్రభుత్వం, అందులోనుంచి ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదని తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే ఎంబీసీ కులాలలను గుర్తించలేదని నిర్లక్షంగా సమాధానం చెబుతున్నారని మండిపడ్డారు. ఈ బడ్జెట్‌లోనూ ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించారని, కేసీఆర్ ఏ కులాన్ని ఎంబీసీగా గుర్తించి ఖర్చు చేసినా స్వాగతిస్తామన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌ను రూ.20 వేల కోట్లు కేటాయించాలని, ఆ మేరకు బడ్జెట్‌ను సవరించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. 119 రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చిన ప్రభుత్వం, బడ్జెట్‌లో వాటి ప్రస్తావనే తేకుండా మభ్యపెడుతున్నారని విమర్శించారు. పెట్టుబడి పథకానికి చట్టబద్ధత కల్పించకపోవడంతో రైతులు ప్రభుత్వాన్ని నమ్మడం లేదన్నారు.

పేరు గొప్ప.. ఊరు దిబ్బ

- బడ్జెట్‌పై సీపీఐ నేత చాడ విమర్శ

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): 2018-19గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చూస్తుంటే పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. ప్రతిపాదించిన 1లక్ష 74వేల కోట్ల బడ్జెట్‌లో రూ.29వేల కోట్ల ద్రవ్యలోటుగా చూపిన ప్రభుత్వ తీరు చూస్తుంటే.. కేటాయింపులు భారీగా చూపి, నామమాత్రంగా నిధులు విడుదల చేయడం ప్రభుత్వ తంతుగా మారిందన్నారు. ఈ ఏడాది బడ్జెట్ మొత్తం కేటాయించినా, నాలుగేండ్లలో ప్రభుత్వం చేసిన అప్పులు తీరవని అన్నారు. ఈ ఏడాది మరో 33,200 కోట్లు అప్పులు చేయడానికి ప్రభుత్వం అధికారికంగా ప్రతిపాదనలు చేసిందన్నారు. రైతు రుణమాఫీకి కేటాయింపులు లేకపోవడం దారుణమన్నారు. కేవలం 1500కోట్లు కేటాయించి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం పథకాలకు సరిపడా నిధులు కేటాయించలేదన్నారు. మొత్తంగా ప్రజల చెవుల్లో కేసీఆర్ మరోసారి పువ్వులు పెట్టారని చాడ ఎద్దేవా చేశారు.

విద్యారంగానికి మొండిచేయి: టీపీటీఎఫ్

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులు విద్యా రంగాన్ని నిరాశపరిచాయని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు అన్నారు. బడ్జెట్ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య అందిస్తామని వాగ్ధానం చేసిన ప్రభుత్వం ఐదేండ్లుగా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 13 శాతం కేటాయించారని, ఈ బడ్జెట్‌లో మాత్రం 9.29 శాతానికి మాత్రమే పరిమితమైందన్నారు. అరకొర బడ్జెట్‌తో ఉచిత, నాణ్యమైన విద్య ఏలా వస్తుందో సీఎం కేసీఆర్‌కే తెలవాలన్నారు. కొఠారీ కమిషన్ ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలని చెప్పినా.. ప్రభుత్వాలు నిధులు కేటాయించడంలేదని చెప్పారు. ఫలితంగా తెలంగాణాలో అక్షరాస్యత శాతం 66 శాతంగానే ఉంటోందని తెలిపారు.

పీజీ టు కేజీకి నిధులేవి: టీఎస్‌యూటీఎఫ్

హైదరాబాద్, మార్చి 15 (మనం ప్రతినిధి):నాలుగేండ్లుగా కేజీ టూ పీజీ ఉచిత విద్యను అమలు చేస్తామని ఊదరగొట్టిన రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ అంశాన్నే ప్రస్తావించలేదని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.రాములు, చావా రవి తెలిపారు. పాఠశాల విద్యకు రూ.10,830కోట్లు కేటాయించడం ప్రభుత్వానికి విద్యపట్ల ఉన్న నిరాసక్తతను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నా రు. మొత్తం బడ్జెట్‌లో 6.2 శాతంగా, గత బడ్జెట్‌తో పోలిస్తే 0.6 శాతం తక్కువగా ఉందని వివరించారు.

ప్రజాస్వామ్యానికి విఘాతం

- కేసీఆర్ తీరు దారుణం: కోదండరాం
- ప్రధాన ప్రతిపక్షం లేకుండా బడ్జెట్టా?
- కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి కేసీఆర్‌కు లేదు: ఉత్తమ్
- సీఎం కేసీఆర్ పచ్చి దగాకోరు: డీకే అరుణ

హైదరాబాద్, మార్చి 15 (మనం ప్రతినిధి): అసెంబ్లీలో సీఎం కేసీఆర్ వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలించేలా ఉందని టీజేఏసీ చైర్మన్ కోదండరాం విమర్శించారు. నిరసన తెలిపిన ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయడం దారుణమన్నారు. తమ సభ్యత్వాల రద్దును నిరసిస్తూ దీక్ష చేస్తున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌కు కోదండరాం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంద ర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ సభ్యులపై చర్య తీసుకునే సమయంలో కనీసం వారి అభిప్రాయాన్ని తీసుకోకపోవటం విచారకరమన్నారు. ఎథెక్స్ కమిటీ లేదు...ఏకపక్షంగా ఇద్దరు సభ్యులపై వేటు వేయటం కేసీఆర్ నిరంకుశత్వానికి నిదర్శనంగా మారిందన్నారు. పార్లమెంటులో టీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలుపుతున్నారని, ఏపీ సభ్యులు తీవ్ర ఆందోళన చేస్తున్నారని అన్నారు. వారిపై పార్లమెంటులో ఇదే విధంగా చర్య తీసుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని సూచించారు. ప్రభుత్వం సహజ విలువలకు ప్రాధాన్యత ఇవ్వకపోవటం అన్యాయమన్నారు. సభ్యులపై తీసుకున్న చర్యలను శాసనసభ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాసే సమయంలో పార్టీలకతీతంగా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆయనతో పాటు టీజేఏసీ నాయకులు పురుషోత్తం, రమేష్, వెంకటరెడ్డి దీక్షకు సంఘీభావం తెలిపారు.



కోమటి రెడ్డి, సంపత్‌ల దీక్షకు మద్దతుగా కూర్చున్న జేఏసీ చైర్మన్ కోదండ, ఉత్తమ్ తదితరులు

ప్రధాన ప్రతిపక్షం లేకుండా బడ్జెట్టా: ఉత్తమ్

శాసనసభలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క విమర్శించారు. దీక్ష విరమణ సభలో ఆయన ప్రసంగించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, రైతులకు గిట్టుబాటు ధర, రైతుల ఆత్మహత్యలు వంటి అంశాలపై ఎక్కడ నిలదీస్తారోనని టీఆర్ఎస్ ప్రభుత్వానికి భయం పట్టుకుందని ఆరోపించారు. ఇందులో భాగంగానే ప్రతిపక్షం లేకుండా ముందస్తు కుట్ర పూర్వకంగా కాంగ్రెస్ వారిపై వేటు వేశారన్నారు. జనాలకు నీళ్లివటం కాదు...తమ జేబులు నింపుకోవాటానికే మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలని ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి కేసీఆర్‌కు లేదన్నారు. బడ్జెట్ ఆదో అంకెల గారడి అని విమర్శించారు. కేసీఆర్‌కు మాయమాటలతో ప్రజలను మోసం చేయటం అలవాటేనని అన్నారు. సీఎం కేసీఆర్ రాజరిక పాలనకు అంతమే కాంగ్రెస్ కార్యకర్తల పంతం కావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. కేసీఆర్ పచ్చి దగా కోరు అని విమర్శించారు. కాంగ్రెస్ సభ్యులపై వేటు వేసి సీఎం కేసీఆర్ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. క్రిమినల్ కేసుల్లో ఉన్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశాన్ని సభ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమాల ఖిల్లా అలంపూర్, గద్వాల్లో కేసీఆర్ కాలు పెడితే రాళ్లతో తరుముతారని అన్నారు.

83 వేల ఉద్యోగాల భర్తీకి ఉత్తర్వులు

- వైద్య పరీక్షలకు ప్రత్యేక పథకం
- రహదారులకు భారీగా నిధులు

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 1,10,012 పోస్టుల ఖాళీలను గుర్తించినట్టు ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అందులో 83,048 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని, 27,588 ఉద్యోగాలను భర్తీ చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రోడ్లు, భవనాల శాఖకు రూ.5575 కోట్లు కేటాయించారు. ఇది గతేడాది కేటాయించిన దానికం టే 10.76శాతం అదనంగా ఉంది. గతేడాది రహదారులు, భవనాల అభివృద్ధికి రూ.5033 కోట్లు కేటాయించింది. రోగాలు రాకుండా ముందుగానే అరికట్టేందుకు వీలుగా రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అందరికీ కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలు ఇస్తామని మంత్రి ఈటల ప్రకటించారు. ఇందుకోసం ఒక పథకాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు.

ఇది రైతు బడ్జెట్: జగదీష్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): ఇదీ రైతు బడ్జెట్.. తెలంగాణ బడ్జెట్ యావత్ భారత దేశానికే తలమానికం కాబోతోందని మంత్రి జగదీష్ రెడ్డి కొనియాడారు. అన్ని రాష్ట్రాలు భవిష్యత్‌లో వ్యవసాయ ఆధారిత బడ్జెట్‌ను ప్రవేశ పెట్టేందుకు తెలంగాణ బడ్జెట్ దోహద పడుతోందన్నారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాత మనస్తత్వానికి ఈ బడ్జెట్‌లో అద్దం పడుతోందన్నారు. ఇప్పటి వరకు వ్యవసాయం గురించి మాట్లాడిన వారే తప్ప... రైతాంగాన్ని వారి కష్టాలను ఎవ్వరు కూడా పట్టించుకున్న పాపానా పోలేదన్నారు.

మా సభ్యత్వాల రద్దు చెల్లదు

- హైకోర్టులో కోమటిరెడ్డి, సంపత్ పిటిషన్

హైదరాబాద్, మార్చి 15 (మనం లీగల్ ప్రతినిధి): తమ శాసన సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎ.సంపత్‌కుమార్‌లు హైకోర్టును ఆశ్రయించారు. నల్లగొండ, ఆలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఖాళీ అయ్యాయంటూ అసెంబ్లీ కార్యదర్శి నోటిఫికేషన్ జారీ చేయడాన్ని ఇద్దరు నేతలు తమ వ్యాజ్యాల్లో సవాల్ చేశారు. ఈ కేసును వెంటనే విచారణ జరపాలని కోర్టును అభ్యర్థించారు. అయితే.. కేసును శుక్రవారం విచారణ చేస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివశంకరరావు ప్రకటించారు. ఈ కేసులో తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి, రాష్ట్ర న్యాయ,శాసనవ్యవహారాల శాఖ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల కార్యదర్శులను ప్రతివాదులుగా చేశారు. 'మేం సభలో హుందాగా వ్యవహరించలేదని రెండు రోజుల్లో మాకు ఎలాంటి విషయం చెప్పలేదు. మా వాదన కూడా వినలేదు. సంజాయిషీ తీసుకోకుండానే నిర్ణయం తీసుకున్నారు. గవర్నర్ ప్రసంగాన్ని ఇతరపార్టీ సభ్యులు వ్యతిరేకించి వాకౌట్ చేశారు. ఇలా చేయడం హుందాతనం అవుతుందా? అలా అయితే తాము నిరసన చెప్పడం కూడా సబబే అవుతుంది. గవర్నర్ ప్రసంగ సమయంలో అధికారపార్టీ సభ్యులు సీఎం కేసీఆర్‌ను కొనియాడుతూ బల్లలు చరచడం హుందాతనం అవుతుందా? హుందాతనంపై తమపై వేటు వేసే నిర్ణయం తీసుకోవడం సరైనదే ఐతే ఆ విధంగా చేసిన వారిపై చర్య తీసుకోకపోవడం పక్షపాతమే అవుతుంది'' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ''నిజంగానే గాయపడితే గవర్నర్‌కు వీడ్కోలు చెప్పేప్పుడు స్వామిగౌడ్ గవర్నర్ వెంట ఎలావెళ్లారు? గాయపడితే గవర్నర్‌తో ఎలా మాట్లాడారు? గవర్నర్‌కు వీడ్కోలు చెప్పిన తర్వాత స్వామిగౌడ్ కంటికి దెబ్బ తగిలిందని చెప్పి ఆస్పత్రిలో చేరడం.. కంటికి కట్టుకట్టుకోవడం విడ్డూరంగా ఉంది. హెడ్‌ఫోన్ తగిలితే ఆ మేరకు అసెంబ్లీ వీడియో పుటేజీని బహిర్గతం చేయాలి. వీడియో పుటేజీని హైకోర్టు తెప్పించుకోవాలి. వాస్తవాల్ని పరిశీలించి ఏది హుందానో.. ఏది హుందా కాదో తేల్చాలి. ఈలోగా తమ సభ్యత్వాన్నిరద్దు చేసిన నిర్ణయం అమలు కాకుండా స్టే ఉత్తర్వులు ఇవ్వాలి. రెండు అసెంబ్లీ సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఇచ్చిన నోటిఫికేషన్ నిలుపుదల చేయాలి. రెండు అసెంబ్లీ ఖాళీ అయినట్లుగా ప్రకటించకుండా కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలి'' అని వ్యాజ్యంలో హైకోర్టును కోరారు. చట్ట వ్యతిరేకంగా నోటిఫై చేశారు కాబట్టి దానిని నిలిపివేయాలని, ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని రిట్‌లో హైకోర్టును కోరారు. తాము తప్పు చేయలేదని, అసెంబ్లీ వీడియో పుటేజీని పరిశీలిస్తే తమపై అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయం సరైనదికాదని తేలుతుందని అన్నారు.



ఈసీకి ఫిర్యాదు చేసిన తర్వాత మీడియాతో కాంగ్రెస్ నేతలు

టీఆర్ఎస్ తీరుపై ఈసీకి ఫిర్యాదు: మర్రి

కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల పట్ల తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో అప్రజాస్వామికంగా వ్యవహరించిందని ఈసీని కలిసి ఫిర్యాదు చేసినట్లు మర్రి శశిధర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కోమటి రెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌ల సభ్యత్వం రద్దు అక్రమమని పేర్కొన్నారు. వారిపై తీసుకున్న చర్య చట్ట, రాజ్యాంగ విరుద్ధమని, సభ్యత్వం రద్దు చేసే అధికారం స్పీకర్‌కు లేదని వివరించారు. సభ్యులపై తీసుకునే చర్యలేవైనా కాండక్ట్ ఆఫ్ బిజినెస్ రూల్‌కు లోబడి ఉండాలని తెలిపారు.

బడ్జెట్‌లో బీసీలకు పెద్దపీట

- సీఎం కేసీఆర్ బీసీల పెన్నిధి: జోగు

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసిందని బీసీ సంక్షేమం, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి జోగు రామన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కేసీఆర్ బీసీల పక్షపాతి అని, స్వరాష్ట్రంలో బీసీలకు స్వర్ణయుగం వచ్చిందని పేర్కొన్నారు. ఎంబీలకు రూ.వెయ్యి కోట్లు, రజక, నాయీ బ్రాహ్మణులకు రూ.450 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారని వివరించారు.

సబ్బండ వర్ణాల సంక్షేమ బడ్జెట్: కర్నె

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): సబ్బండ వర్ణాల సంక్షేమానికి పెద్దపీట వేసేలా బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయని టీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకూ భిన్నంగా తెలంగాణ దూసుకు పోతున్న తీరుకు 2018-19 బడ్జెట్ నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని చివరి వ్యక్తికీ సంక్షేమ ఫలాలు చేరేలా బడ్జెట్ రూపకల్పనచేసిన ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌కు రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్రం ఏర్పడక మునుపు 5.4 శాతం ఉన్న వృద్ధి రేటు, సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలతో 10.4(ప్రభుత్వ అంచనా)కు చేరిందన్నారు. రైతుల అభివృద్ధే ధ్యేయంగా వ్యవసాయానికి రూ.15,780 కోట్లు కేటాయించామని తెలిపారు.

ఇది ఎన్నికల బడ్జెట్

- సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసపూరితంగా ఉందని, ఇది పూర్తిగా ఎన్నికల బడ్జెట్ అని సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌ల్యాగ్ పోస్టులపై బడ్జెట్‌లో ఊసే లేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. గత బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులను పూర్తిగా మోసం చేసిందన్నారు. ఆదివాసుల చట్టాన్ని అటకెక్కించారన్నారు.

ప్రజలు కోరినట్లు బడ్జెట్ లేదు: టీడీపీ

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన చివరి బడ్జెట్ కూడా ప్రజల ఆలోచనలకు, ఆశయాలకు అనుగుణంగా లేదని టీటీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలోని టీడీఎల్పీలో రావుల మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి, ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు మధ్యన రూ.71,600 కోట్లు వ్యత్యాసం ఉందని, ఇంత డబ్బును ఎక్కడి నుంచి తీసుకొస్తా రో సీఎం వెల్లడించాలని రావుల డిమాండ్ చేశారు. ఏటా బడ్జెట్‌ను పెంచి చూపిస్తూ, ఆదాయం రాకపోవడంతో ఆయా శాఖలకు బడ్జెట్‌లో కోత పెడుతున్నారని విమర్శించారు. నాలుగేండ్ల పాలనలో 12745 ఎకరాల భూమిని మాత్రమే దళితులకు పంపిణీ చేసిన ప్రభుత్వం, దళితులందరికీ మూడెకరాలు ఇవ్వాలంటే ఇంకెన్నే ళ్లు పడుతుందని ప్రశ్నించారు. మిషన్ భగీరథ కార్పొరేషన్ ద్వారా ఇప్పటికే రూ.వేల కోట్లలో అప్పులు చేసిన ప్రభుత్వం, బడ్జెట్‌లో కేవలం రూ.18 వందల కోట్లు మాత్రమే ఆ కార్పొరేషన్ కేటాయించిందన్నారు.

బడ్జెట్‌లో సాగుకు పెద్దపీట

- గణనీయంగా పెరిగిన రాష్ట్ర వృద్ధిరేటు
- ఎమ్మెల్సీలు పాతూరి, పల్లా, నారదాసు, బోడకుంటి, పురాణం..

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి పెద్దపీట వేశారని శాసనమండలి సభ్యులు పాతూరి సుధాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నారాదాసు లక్ష్మణ్‌రావు, బోడకుంటి వెంకటేశ్వర్లు, పురాణం సతీష్ అన్నారు. మండలిలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నః భూతో నః భవిష్యత్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని తెలిపారు. జాతీయ వృద్ధి రేటు కన్నా రాష్ట్ర వృద్ధి రేటు ఎక్కువగా ఉందని ఈ బడ్జెట్‌తో నిరూపితమయిందన్నారు. ప్రతీయేడు బడ్జెట్ కేటాయింపులు అంచెలంచెలుగా పెరిగిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయం ఎంతో కునారిల్లిందని, వ్యవసాయం దండగా అనే స్థాయికి పాలకులు తీసుకువచ్చారని విమర్శించారు. కేసీఆర్ ఎంతో కృషి చేసి వ్యవసాయాన్ని పండుగగా మార్చడానికి రూ. 15 వేల కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. కోటి ఎకరాలను మాగాణిగా చేసేందుకు రూ. 25 వేల కోట్లు కేటాయించారని తెలిపారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... మరే రాష్ట్రాల్లో ఈ విధమైన బడ్జెట్ కేటాయింపులు లేవని ప్రశంసించారు. 2016-17, 2017-18 బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 95 శాతం ఖర్చు చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా ఈ విధంగా జరుగలేదన్నారు. ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ. 1.74 లక్షల కోట్లను పూర్తిస్థాయిలో ఖర్చు చేస్తామని పేర్కొన్నారు. బోడకుంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఈ బడ్జెట్ జనరంజక బడ్జెట్‌గా పేర్కొన్నారు. అన్నీ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశామని తెలిపారు.నారాదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ... రాష్ట్రానికి, దేశానికి ఆధారమే వ్యవసాయ రంగమని అందుకే వ్యవసాయానికి భారీ కేటాయింపులు చేశారని పేర్కొన్నారు. ఈ విధమైన బడ్జెట్‌తో బంగారు తెలంగాణ సాకారమవుతుందన్నారు. దీనిని ప్రగతిశీల బడ్జెట్‌గా వ్యవహరించవచ్చన్నారు. పురాణం సతీష్ మాట్లాడుతూ... ఇది సామాన్యుని బడ్జెట్ అన్నారు. ఏ రాష్ట్రంలోనూ దేవాదాయ శాఖకు బడ్జెట్ కేటాయించలేదని, తెలంగాణ బడ్జెట్‌లో మాత్రమే రూ.72 కోట్లు కేటాయించారని అభినందించారు.

చెప్పేది బారెడు చేసేది జానెడు

- ప్రభుత్వం అప్పులపై ఆధారపడింది
- బీజేపీ నేత, ఎమ్మెల్యే కిషన్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 15 (మనం ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మేడిపండులా ఉందని, చెప్పేది చారెడు, చేసేది జానెడు అని బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద గురువారం ఆయన బడ్జెట్ గురించి మాట్లాడారు. నాలుగేళ్ల పాలనలో టీఆర్ఎస్ 25,588 ఉద్యోగాలు భర్తీ చేసిందని, లక్షకు పైగా భర్తీలు చేపడుతామన్న కేసీఆర్.. బడ్జెట్ లెక్కల ప్రకారం మిగిలిన 85 వేల ఉద్యోగాలు భర్తీ పూర్తి చేయాలంటే మరో 14 ఏళ్లు పడుతుందని ఎద్దేవా చేశారు. 2017 చివరికల్లా హైదరాబాద్‌లో లక్ష , గ్రామీణ ప్రాంతాల్లో మరో లక్ష డబుల్ బెడ్ ఇళ్లు కడతానని, అవి పూర్తిచేయకపోతే ఓట్లు అడగనని కేసీఆర్ గతంలో చెప్పారని, వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. మూత పడిన పరిశ్రమలకు ఒక్క నయాపైసా కూడా కేటాయించలేదన్నారు. రైతు రుణమాఫీల ప్రస్తావన లేదన్నారు. హరితహారానికి నిధులు కేటాయించలేదన్నారు. ఇప్పటికే అమలులో ఉన్న పథకాలతో పాటు కొత్త పథకాలు అమలు కావాలంటే 3 లక్షల కోట్లు అప్పు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర సర్కారు అప్పులపై ఆధారపడి పనిచేస్తోందన్నారు. ప్రభుత్వానికి ఉన్న 35 వేల కోట్ల బకాయిలపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదని విమర్శించారు. ఉద్యోగులకు, విలేకరులకు వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ఆరోగ్య పరీక్షలు చేయిస్తామని కేసీఆర్ చెప్పారని, పథకం ప్రారంభం కాకముందే దానిని ఆరోగ్య శ్రీలో కలిపారన్నారు. హెల్త్‌కార్డ్‌లకు మొండిచెయ్యి చూపిందన్నారు. జీఎస్టీ, నోట్ల రద్దు వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గలేదని, పెరిగిందన్నారు. పెట్రోల్, డీజిల్‌లపై వ్యాట్, సేల్స్ ట్యాక్స్ ఎత్తేసి, జీఎస్టీలో కలిపితే, లీటరు పెట్రోల్‌పై రూ.30ల వరకు తగ్గుతుందన్నారు. కోట్లాది మందికి లాభం చేకూర్చే ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాల్సిన అవసరముందన్నారు.



ఈటల రాజేందర్‌కు మిఠాయి తినిపిస్తున్న ఆయన కుమార్తెలు





ఆర్థిక మంత్రి ఈటలను అభినందిస్తున్న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

సంక్షేమానికి పెద్ద పీట

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): ఉత్పాదక రంగంతో పాటు సంక్షేమరంగానికి ఈ సారి బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి ముఖంలో సంతోషం అనే నినాదంతో సంక్షేమ పథకాలను చేపట్టినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం వారి జనాభా నిష్పత్తి అనుగుణంగా ప్రత్యేక ప్రగతి నిధిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ నిధికి కేటాయించిన నిధులు అదే ఆర్థిక సంవత్సరంలో ఖర్చు కాకుంటే వాటిని మరుసటి సంవత్సరానికి బదిలీ చేస్తారు. ఈసారి ఎస్సీల ప్రగతి నిధికి రూ.16,453 కోట్లు, ఎస్టీల ప్రగతి నిధికి రూ.9,693 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో ఎస్సీల జనాభా 15.45 శాతం ఉంది. ఎస్సీ విద్యార్థులకు ఇప్పటి వరకు రూ.1459 కోట్లు స్కాలర్ షిప్‌ల రూపంలో ఇచ్చామని ఆర్థిక మంత్రి తెలిపారు. కల్యాణ లక్ష్మి పథకం కింద ఇప్పటివరకు 71,770 మంది మహిళలకు 436 కోట్ల 86 లక్షలు ఇచ్చామన్నారు. షెడ్యూల్డు కులాల శాఖకు ఈ సారి బడ్జెట్‌లో 12,709 కోట్లు కేటాయించారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలకు 1450 కోట్లు కేటాయించారు. షాదీ ముబారక్ కింద ఇప్పటి వరకు 78,003 మంది లబ్ది పొందారు. ఇప్పటి వరకు ఈ పథకానికి 1625 కోట్లు ఖర్చు చేశారు.

రాష్ట్రంలో 32 లక్షల 87 వేల మంది ఎస్టీలు ఉన్నారు. వీరిలో 32 షెడ్యూల్డ్ తెగలు ఉన్నాయి. ఆర్థిక అభివృద్ధి పథకం కింద వచ్చే ఆర్థిక సంవత్సరంలో 20 వేల మందికి సహాయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భూమి అభివృద్ధి పథకం కింద ఐదు వేల మందికి లబ్ధి చేకూర్చుతామని బడ్జెట్‌లో హామీ ఇచ్చారు. షెడ్యూల్డ్ తెగల శాఖకు బడ్జెట్‌లో 8,063 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో ఉన్న 35,700 అంగన్ వాడి కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ,ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు పోషక ఆహారాన్ని అందిస్తున్నారు. దీని కోసం ఆరోగ్యలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకానికి బడ్జెట్‌లో 298 కోట్లు కేటాయించారు. మహిళ శిశు సంక్షేమానికి 1799 కోట్లు కేటాయించారు.

ఆసరా పింఛన్లు

వృద్ధులు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, నేత కార్మికులు, ఎయిడ్స్ వ్యాధి బారినపడిన వారికి, బీడి కార్మికులకు, ఒంటరి మహిళలకు నెలకు వెయ్యి రూపాయలు, వృద్ధ కళాకారులకు, వికలాంగులకు, నెలకు 1500 పింఛన్లు అందిస్తున్నారు. రాష్ట్రంలో 41,78,291 మంది ఆసరా పింఛన్లు తీసుకుంటున్నారు. ఆసరా పెన్షన్ల కోసం 5,300 కోట్లు కేటాయించారు.

మూడు ఎకరాల భూ పంపిణీ

దళితులకు మూడు ఎకరాల భూ పంపిణీ నిరంతరం సాగే ప్రక్రియని, భూమి లభ్యతను బట్టి కొనుగోలు చేసి అర్హులకు పంపిణీ చేస్తామని ఆర్థిక మంత్రి చెప్పారు. ఇప్పటి వరకు 4,939 మంది దళితులకు 12,745 ఎకరాల భూమిని పంపిణీ చేశామన్నారు. మూడు ఎకరాల భూపంపిణీ కోసం ఈ సారి బడ్జెట్‌లో 1469 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

ఎంబీసీ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు

గత సంవత్సరం లాగే ఈసారి కూడా ఎంబీసీ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించారు. కొన్ని సమస్యల కారణంగా గతేడాది కేటాయించిన నిధులు ఖర్చు చేయలేదని, ఈ సారి మొదటి మూడు నెలల్లోనే పథకాలు రూపకల్పన చేసి నిధులు ఖర్చు చేస్తామని ఈటల చెప్పారు. సంచార జాతులన్నీ ఎంబీసీ కిందకు వస్తాయన్నారు. ఇక బీసీల్లో సేవ చేసే కులాలు, ఉత్పాదక కులాలు ఉన్నాయని, ఇప్పటి వరకు ఉత్పాదక కులాలకు ఆర్థిక సాయం చేస్తున్నామని, ఈ సారి సేవా కులాలను ఆదుకుంటామన్నారు. రజకుల ఫెడరేషన్‌కు రెండు వందల కోట్లు, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌కు 250 కోట్లు కేటాయించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధికి 5,920 కోట్లు కేటాయించారు.



సాగుకు పునరుజ్జీవం

- బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు
- యాంత్రీకరణకు రూ.522 కోట్లు
- పెట్టుబడి పథకానికి 12 వేల కోట్లు
- త్వరలో ధరణి వెబ్‌సైట్ ఆవిష్కరణ



హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): ఉమ్మడి రాష్ట్ర పాలన కాలంలో తెలంగాణ ప్రాంతంలో పూర్తిగా సంక్షోభంలోకి వెళ్లిన వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం పునరుజ్జీవం కల్పించిందని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. శాసనసభలో గురువారం బడ్జెట్ ప్రసంగంలో వ్యవసాయరంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరిచేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా వ్యవసాయరంగ అభివృద్ధికి బడ్జెట్‌లో విశేష ప్రాధాన్యం కల్పించింది. పెట్టుబడి కోసం అప్పులు చేసే అవసరం లేకుండా అందించనున్న పెట్టుబడి సాయం పథకానికి రూ.12 వేల కోట్లు కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ రికార్డులను ప్రక్షాళనచేసి, మార్పులు చేర్పులతో ధరణి వెబ్‌సైట్‌ను తీసుకురానుంది. అందులో భాగంగానే రాష్ట్రంలోని 10,823 గ్రామాల్లోని 72,13,111 ఖాతాలను(రికార్డులు) వంద రోజుల్లో పరిశీలించి మార్పులు చేర్పులు చేసినట్టు మంత్రి ఈటల పేర్కొన్నారు. వీటితో పాటుగా తెలంగాణాలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ సులభతరం చేయాలనే ఉద్దేశంతో రిజిస్ట్రేషన్ ఆఫీసులేని మండలాల్లో తహసీల్దార్లకు ఆ బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. దీని ఫలితంగా ఏకాలంలో భూములు రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ రికార్డుల్లో మార్పులు జరుగుతాయని వివరించారు.

రైతు సమితుల్లో 1.61 లక్షల సభ్యులు

రైతులు పండించిన పంటకు మద్దతు ధర సాధించడంతో పాటు వారి మధ్య పరస్పర సహకార భావం పెంపొందించడం, వ్యవసాయ రంగ సమస్యలను పరిష్కరించుకునేలా చైతన్య పరచడం వంటి లక్ష్యాలతో రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసినట్టు ఆర్థిక మంత్రి రాజేందర్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.61 లక్షల మంది సభ్యులతో రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేశామని, గ్రామ స్థాయిలో 15 మంది సభ్యులు, మండల, జిల్లా స్థాయిలో 24 మంది సభ్యులు, రాష్ట్ర స్థాయిలో 42 మంది సభ్యులు ఉంటారు. రైతులు పరస్పరం చర్చించుకోవడానికి ఐదువేల ఎకరాలను ఒక క్లస్టర్‌గా చేసి రైతు వేదికను ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కో క్లస్టర్‌కు ఒక వ్యవసాయ విస్తరణ అధికారి ఉంటారని తెలిపారు.

రైతు బీమా పథకానికి రూ.500 కోట్లు

రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన సందర్భాల్లో వారి కుటుంబాల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఆదుకునేందుకు రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టామని మంత్రి ఈటల తెలిపారు. ఈ పథకం కింద రైతులందరికీ రూ.5 లక్షల బీమా పథకాన్ని కల్పించనున్నామని, రైతు బీమా పథకం కోసం బడ్జెట్‌లో రూ.500 కోట్లను కేటాయిస్తున్నామని ప్రకటించారు.

వ్యవసాయ యాంత్రీకరణకు రూ.522 కోట్లు

వ్యవసాయంలో శ్రమ, వ్యయాన్ని తగ్గించడంతో పాటు రైతులకు సమయాన్ని ఆదా చేసేందుకు యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నట్టు ఆర్థిక మంత్రి చెప్పారు. దీనివల్ల పెట్టుబడి తగ్గే అవకాశం ఉండడంతో యంత్రాల వినియోగం కోసం సబ్సిడీపై యంత్ర పరికాలు, యంత్రాలను అందిస్తున్నట్టు తెలిపారు. 50 శాతం నుంచి 95 శాతం సబ్సిడీతో రైతులకు ఇప్పటివరకు 13,934 ట్రాక్టర్లు, 31,274 యంత్ర పరికరాలు, 4,71,000 టార్పాలిన్లు, 26,179 స్ప్రేయర్లను పంపిణీ చేసినట్టు వివరించారు.నాట్లు వేసే యంత్రాలను సబ్సిడీపై అందిస్తామన్నారు. యాంత్రీకరణకు 522 కోట్లుక కేటాయించారు.

మరో 29 లక్షల ఎకరాలు..

తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణం పంటలు సాగయ్యే బిందు, తుంపర సేద్యం ప్రక్రియ తెలంగాణాలో ఆశాజనకంగా ఉందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో 14 లక్షల ఎకరాల్లో బిందు, తుంపర సేద్యం సాగుతుందని, మరో 29 లక్షల ఎకరాలను మైక్రో ఇరిగేషన్ కిందకు తేవాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. మైక్రో ఇరిగేషన్ పరికరాల కొనుగోలుకు ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, చిన్న, సన్నకారు, బీసీ రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీని అందిస్తున్నట్టు తెలిపారు. గతంలో రైతుకు గరిష్టంగా రెండున్నర ఎకరాలకు రూ.లక్షకు మించకుండా సబ్సిడీ ఇచ్చేవారని, ప్రస్తుతం పన్నెండున్నర ఎకరాల వరకు రూ.6.25 లక్షల వరకు సబ్సిడీ ఇస్తున్నామన్నారు. మైక్రో ఇరిగేషన్‌కోసం127 కోట్లు కేటాయించారు ఉమ్మడి రాష్ట్రంలో 129 ఎకరాలకు పాలీహౌజ్ పరిమితమైందని, 50 శాతం సబ్సిడీ కింద ఒక్కో రైతు అర ఎకరం మాత్రమే వేసుకోవాలనే నిబంధన ఉండేదన్నారు.రాష్ట్ర ఏర్పాటు నుంచి 1150 ఎకరాలకు పాలీహౌజ్ విస్తీర్ణం పెరిగిందన్నారు.

మైనార్టీల సంక్షేమం

మైనార్టీల సంక్షేమం కోసం గతేడాది 1200 కోట్లు కేటాయించగా, ఈ సారి రెండు వేల కోట్లు కేటాయించారు. మైనార్టీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 206 గురు కులాలకు 735 కోట్లు కేటాయించారు. ముస్లిం అనాథ పిల్లలకు ఆశ్రయం ఇస్తున్న అనీస్ ఉల్ గుర్బాకు 4300 చదరపు గజాల స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణానికి 20 కోట్లు కేటాయించారు.

బ్రహ్మణులు, జర్నలిస్టులకు

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా వంద కోట్లు కేటాయించారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గత సంవత్సరం సంక్షేమ నిధికి 130 కోట్లు ఇచ్చామన్నారు.


ఏ రంగానికి ఎంతెంత?

ఎస్సీ ప్రగతి	రూ.16,453 కోట్లు
ఎస్టీ ప్రగతి	రూ.9,693 కోట్లు
ఎస్టీల సంక్షేమం	రూ.8,063 కోట్లు
దళితుల మూడెకరాల భూపంపిణీ	రూ.1469 కోట్లు
నీటి పారుదల	రూ.25,000 కోట్లు
వ్యవసాయం, మార్కెటింగ్ శాఖలు	రూ.15,780 కోట్లు
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	రూ.15,563 కోట్లు
పంటల పెట్టుబడి మద్దతు	రూ.12,000 కోట్లు
పాఠశాల విద్యాశాఖ	రూ.10,830 కోట్లు
వైద్య, ఆరోగ్య శాఖ	రూ.7375 కోట్లు
మునిసిపల్ శాఖ	రూ.7251 కోట్లు
బీసీల సంక్షేమం	రూ.5920 కోట్లు
హోం శాఖ	రూ.5790 కోట్లు
రోడ్లు, భవనాలు	రూ.5575 కోట్లు
విద్యుత్ రంగం	రూ.5,650 కోట్లు
ఆసరా పింఛన్	రూ.5300 కోట్లు
పౌరసరఫరాల శాఖ	రూ.2946 కోట్లు
డబుల్ బెడ్‌రూం ఇండ్లు	రూ.2643 కోట్లు
మైనార్టీల సంక్షేమం	రూ.2500 కోట్లు
ఉన్నత విద్య	రూ.2448 కోట్లు
గురుకులాలు	రూ.2,283 కోట్లు
మిషన్ భగీరథ	రూ.1801 కోట్లు
మహిళా సంక్షేమం	రూ.1799 కోట్లు
గ్రామీణ, స్థానిక సంస్థలు	రూ.1500 కోట్లు
కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్	రూ.1450 కోట్లు
పరిశ్రమల శాఖ	రూ.1286 కోట్లు
చేనేత, జౌళి	రూ.1200 కోట్లు
ఎంబీసీ కార్పొరేషన్	రూ.1000 కోట్లు
పట్టణాభివృద్ధి	రూ.1000 కోట్లు
అమ్మ ఒడి పథకం	రూ.561 కోట్లు
వ్యవసాయ యాంత్రీకరణ	రూ.522 కోట్లు
రైతు బీమా పథకం	రూ.500 కోట్లు
వరంగల్ కార్పొరేషన్	రూ.300 కోట్లు
ఆరోగ్య లక్ష్మి పథకం	రూ.298 కోట్లు
ఐటీ శాఖ	రూ.289 కోట్లు
యాదాద్రి దేవస్థానం అభివృద్ధి	రూ.250 కోట్లు
నాయీబ్రాహ్మణ ఫెడరేషన్	రూ.250 కోట్లు
రజక ఫెడరేషన్	రూ.200 కోట్లు
కోల్డ్‌స్టోరేజీ, లింకేజీ	రూ.132 కోట్లు
బిందు తుంపర సేద్యం	రూ.127 కోట్లు
పాలీహౌస్, గ్రీన్‌హౌస్	రూ.120 కోట్లు
పౌల్ట్రీ రంగం	రూ.109 కోట్లు
వేములవాడ ఆలయ అభివృద్ధి	రూ.100 కోట్లు
భద్రాద్రి ఆలయ అభివృద్ధి	రూ.100 కోట్లు
బ్రాహ్మణ సంక్షేమం	రూ.100 కోట్లు
జర్నలిస్టుల సంక్షేమం	రూ.75 కోట్లు
అర్చకుల వేతనాలు	రూ.72 కోట్లు
సాంస్కృతిక శాఖ	రూ.58 కోట్లు
బాసర ఆలయ అభివృద్ధి	రూ.50 కోట్లు
ధర్మపురి ఆలయ అభివృద్ధి	రూ.50 కోట్లు

విద్యకు 13,278 కోట్లు


- పాఠశాల విద్యకు 10,830 కోట్లు
- ఉన్నత విద్యకు 2,448 కోట్లు

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో 8792 మంది ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారని మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. సమాజ అభివృద్ధిలో కీలకంగా ఉండే పిల్లలకు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యాలయాలను తీర్చిదిద్దుతుం దన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 41,337 పాఠశాలల్లో 58,66,786 మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని మంత్రి చెప్పారు. సర్వశిక్షా అభియాన్ కింద గత మూడేండ్లలో పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం 44,588 పనులను చేపట్టి 38,182 పనులను పూర్తి చేసినట్టు తెలిపారు. 391 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో మెరుగైన వసతుల కోసం రూ.92.30 కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూల్స్ ప్రహరీల నిర్మాణానికి రూ.78 కోట్లు వ్యయం చేస్తున్నామని తెలిపారు. మధ్యాహ్న భోజనం పథకం కింద సన్నబియ్యం, వారానికి మూడు గుడ్లు, అరటిపండు అందిస్తున్నామని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 25.48 లక్షల మంది పిల్లలకు అదనంగా విద్యను అందిస్తున్నామన్నారు. పాఠశాల విద్యకు రూ.10,830 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.



ఉన్నత విద్యకు 2,448 కోట్లు

రాష్ట్రంలోని 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో వసతులు మెరుగు పరిచేందుకు రూ.259 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. వీటి పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల భృతిని రెండు విడుతలుగా పెంచామని, సాంకేతిక విద్యలో కొత్తగా 11 పాలిటెక్నిక్ కాలేజీలను ప్రారంభించామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 131 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో మౌలిక వసతులకోసం రూ.247 కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు.



కోటి ఎకరాల మాగాణం

నీటి పారుదలకు 25వేల కోట్లు

హైదరాబాద్, మార్చి 15 (మనం ప్రతినిధి) : తెలంగాణలో కోటి ఎకరాలకు నీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిందని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గోదావరి, కృష్ణ నదులపై 23 మేజర్, 13 మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. శాసనసభలో బడ్జెట్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న పాలమూరు ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని, పాత పాలమూరు జిల్లాలో ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. ఈ ఏడాది వర్షాకాలం పంట నాటికి 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. పాలమూరు, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లోని బీడుభూములకు సాగునీరు అందించేందుకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నామన్నారు. రికార్డు సమయంలో భక్త రామదాసు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేశామన్నారు. ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గోదావరి నదిపై తలపెట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణం పురోగతిలో ఉందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్‌తో పాటు నల్లగొండ జిల్లాకు వరప్రదాయినిగా భావిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కొద్ది నెలల వ్యవధిలోనే వాటర్ పంపింగ్ పాక్షికంగా ప్రారంభించబోతున్నామన్నారు. కాళేశ్వరం కింద దాదాపు 36.75 లక్షల ఎకరాలకు నీరు అందించడానికి పనులు జరుగుతున్నాయన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ కొనసాగుతోందని, మొదటి మూడు దశల్లో అధిక శాతం నీటి నిల్వసామర్థ్యం కలిగిన ప్రధానమైన చెరువుల పునరుద్ధరణ పూర్తయ్యిందన్నారు. ఈ ఎడాది నీటిపారుదల రంగానికి 25వేల కోట్లు ప్రతిపాదిస్తున్నామన్నారు.

మిషన్ భగీరథ

మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధి చేసిన నదీ జలాలను నల్లాల ద్వారా ప్రతీ ఇంటికి ప్రతీ రోజు అందిస్తామన్నారు. మార్చి నెలాఖరు వరకు నదీ జలాలు అన్ని గ్రామాలకు చేరుకుంటాయని, పైపులైన్ల నిర్మాణం పూర్తికాగానే ఇంటింటికి నీరు వస్తుందన్నారు. మిషన్ భగీరథకు బడ్జెట్‌లో రూ.1801 కోట్లు ప్రతిపాదిస్తున్నామన్నారు.


ఎన్నారై శాఖకు వంద కోట్ల నిధులు

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): చరిత్రలో ఎన్నడూ లేనంతగా తెలంగాణ ఎన్నారై శాఖకు భారీగా నిధుల కేటాయించారని మంత్రి కేటీఆర్ తెలిపారు. బడ్జెట్లో ఎన్నారై శాఖకు రూ.100 కోట్ల నిధులు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గల్ఫ్ తెలంగాణ వాసుల కష్టాలు తీర్చేందుకు బడ్జెట్ ఉపయోగపడుతుందని కేటీఆర్ తెలిపారు.

హైదరాబాద్‌కు మెట్రో రైలు తలమానికం

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): హైదరాబాద్ నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్‌కు తలమానికంగా మెట్రోరైలును నిర్మించినట్టు తెలిపారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రహదారి వ్యవస్థను మారుస్తున్నామన్నారు. వరంగల్‌లో మౌలిక వసతుల కల్పనకు ఈ సారి కూడా 300 కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ. 7,251 కోట్లు ప్రతిపాదిస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

పరిశ్రమలకు చేయూత



హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీఎస్ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయన్నారు. ఇప్పటికే 6,206 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని వీటిద్వారా రూ. 1,18 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఈ పరిశ్రమల ద్వారా 4.47 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. నేతలన్నలను ఆదుకోవడానికే లక్ష రూపాయల వరకున్న రుణాలకు ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. దీంతోపాటు పవర్ లూమ్ పరిశ్రమను ఆదుకోవడానికి వస్త్రాల ఉత్పత్తికి అవసరమయ్యే నూలు, రసాయనాల మీద 50 శాతం అందిస్తున్నామన్నారు. సబ్సిడీపై విద్యుత్ సరాఫరా చేస్తున్నామని తెలిపారు. కార్మికులకు నెలకు కనీసం 15 నుంచి 20 వేల వేతనం ఇచ్చేట్టుగా యాజమాన్యాలను ఒప్పించిందన్నారు. మరమగ్గాల ఆధునీకరణకు పూర్తిస్థాయి సబ్సిడీ అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వరంగల్ ప్రతిష్టను పెంచేందుకు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే ఐదేండ్లలో 9 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కు ద్వారా 60,000 నుంచి 80,000 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ బడ్జెట్‌లో చేనేత, టెక్స్‌టైల్ రంగానికి రూ. 1200 కోట్లు ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఫార్మారంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో 250 ఎకరా విస్తీర్ణంలో మెడికల్ డివైజస్ పార్కును ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 'ఐటీ'

- ద్వితీయశ్రేణి నగరాలో ఐటీ హబ్‌లు

హైదరాబాద్, మార్చి 15 (మనం ప్రతినిధి): సమాచార సాంకేతిక విజ్ఞానానికి పట్టుగొమ్మగా తెలంగాణ ప్రసిద్ధి పొందిందని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. శాసనసభలో గురువారం తన బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ఐటీ కంపెనీలను విస్తరిస్తామని చెప్పారు. ''తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఐటీ విధానంతో గూగుల్, డెలాయిట్, ఫేస్‌బుక్, కాగ్నిజెంట్, ఒరాకిల్, ఆపిల్ వంటి దిగ్గజ సంస్థలు హైదరాబాద్ నుంచి పని చేస్తున్నాయన్నారు.టీ హబ్ ద్వారా దాదాపు 200 స్టార్టప్ కంపెనీలు ప్రేరణ పొందాయి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటి ద్వితీయశ్రేణి నగరాల్లో ఐటీ హబ్ విస్తరణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వరంగల్‌లో ఐటీ సెజ్ ఏర్పాటుకు 45 ఎకరాలను కేటాయించడమే కాక, స్టార్టప్‌ల కోసం భవన నిర్మాణం చేపట్టాం. జిల్లా కేంద్రాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో ఐటీ సంస్థల స్థాపనను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ప్రస్తుత బడ్జెట్‌లో ఐటీ రంగానికి 289కోట్లు కేటాయిస్తున్నాం. వి-హబ్‌కు ప్రారంభ పెట్టుబడిగా 15 కోట్లు కేటాయించారు. ఐటీ ఎగుమతుల్లో రాష్ట్రం వరుసగా మూడేళ్ల పాటు జాతీయ సగటును మించి వృద్ధి సాధించిందని ఈటల అన్నారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

శుక్రవారం, మార్చి 16


ప్రతికూల పవనాలు

ఉత్తరప్రదేశ్ (యూపీ), బిహార్ ఉప ఎన్నికల్లో బీజేపీకి చుక్కెదురైంది. ప్రజల్లో అధికార వ్యతిరేక ప్రతికూల పవనాలు వీస్తున్న కారణంగా యూపీలో కంచుకోటల్లాంటి గోరఖ్‌పూర్, ఫుల్పూర్ లోక్‌సభ నియోజకవర్గాల్లోను, బిహార్‌లోని అరారియా నియోజకవర్గంలో బీజేపీ చిత్తుగా ఓడిపోయింది. 2019లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బుధవారం ఉప ఎన్నికల ఫలితాలు బీజేపీకి గట్టి షాక్ ఇచ్చాయి. ఈశాన్య రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించడం చూసి మురిసిపోతున్న బీజేపీకి ఈ ఫలితాలు మింగుడు పడడం లేదు. ప్రాంతీయ ఉపజాతీయ పార్టీలతో కలసి త్రిపురలో 25 ఏళ్ళపాటు అధికారంలో కొనసాగిన మార్క్సిస్టు పార్టీని ఓడించడమే కాకుండా, నాగాలాండ్, మేఘాలయల్లో బీజేపీ సారథ్యంలో సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పరచిన భావోద్వేగం ఉపశమించక మునుపే యూపీ, బీహార్‌లలో బీజేపీకి చేదు అనుభవం కలిగింది. ఓబీసీ, దళిత, ముస్లిం ఓట్లు సంఘటితం కావడం మూలాన సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి ప్రవీణ్ నిషాద్ గోరఖ్‌పూర్‌లో దాదాపు 22 వేల మెజారిటీతో విజయం సాధించారు. 1989 నుంచి నిరాటంకంగా వరుసగా ఐదుసార్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎన్నికైన నియోజవర్గం అలా చేజారిపోవడం బీజేపీ నాయకత్వంలో నిరాశ నింపింది. అదే సమయంలో యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య బీజేపీ తరపున మొట్టమొదటసారి గెలిచిన ఫుల్ఫూర్ నియోజకవర్గంలో సమాజ్‌వాద్ పార్టీ అభ్యర్థి నాగేంద్ర ప్రతాప్ సింగ్ సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన కౌశలేంద్ర సింగ్‌పై 59,460 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందడం విశేషం. అదేవిధంగా బిహార్‌లోని అరారియా నియోజకవర్గంలో రాష్ట్రీయ జనతా దళ్ అభ్యర్థి సర్ఫరాజ్ ఆలం తన సమీప బీజేపీ-జేడీ(యూ) కూటమి తరపున నిలబడిన బీజేపీ అభ్యర్థి ప్రదీప్ కుమార్ సింగ్‌పై 60వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందడం బీజేపీపై ప్రజల్లో నెలకొన్న అధికార వ్యతిరేకతకు అద్దం పడుతోంది. సాధారణంగా ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులే గెలుపొందడం కద్దు. అలాంటిది ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోవడం ప్రభుత్వ వ్యతిరేకత బాగా పెరిగిన వైనాన్ని తెలియజేస్తుంది. ఎస్పీ-బీఎస్పీ పొత్తులోని బలాన్ని తక్కువగా అంచనావేయడం వల్లనే తాము ఓటమి పాలైనట్లు బీజేపీ సమీక్షిస్తున్నప్పటికీ, అంతకంటే ముఖ్యంగా ప్రజల్లో అధికారపార్టీ పాలనపై వ్యతిరేకత పెంపొందిందనే గుణపాఠాన్ని ఆ పార్టీ నిర్లక్ష్యం చేస్తున్నట్లుంది.

సంక్షుభిత రాజకీయ సమయాల్లో ఒక ఏడాది కాలం సుదీర్ఘమైనదే. దాదాపు ఏడాది క్రితం బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి యూపీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 403 సీట్లలో 325 సీట్లను కైవసం చేసుకుని అధికారంలోకి వచ్చింది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 80 సీట్లలో 71 సీట్లను సాధించిన విజయానికి కొనసాగింపుగా శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగించింది. దేశంలోనే అత్యధిక జనాభా గల యూపీలో 2014 సార్వత్రిక ఎన్నికల విజయంగానీ, 2017లో శాసనసభలో గెలుపొందిన ఉదంతంగానీ దేశంలోనే బీజేపీ అత్యంత శక్తిమంతమైన రాజకీయపక్షంగా నిలిచిందనడానికి సజీవ సంకేతాలు. ఈ నేపథ్యంలో బుధవారం తీర్పు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఏళ్ళ తరబడి పరస్పరం పోటీపడుతున్న సమాజ్‌వాది పార్టీ, బీఎస్పీలు ఈ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా కలసి పనిచేయడం ఆ కూటమికి బాగా లాభించింది. ఓటింగ్‌లో మెజారిటీలను బట్టి చూస్తే ఈ ఎన్నికల్లో బీజేపీ ఓటర్లు గణనీయమైన స్థాయిలో ప్రతిపక్ష శిబిరానికి తరలి వెళ్లినట్లు అర్థమవుతోంది. ఈ పరిణామం అధికార పక్షంపై వ్యతిరేకత గణనీయమైన స్థాయిలో అభివృద్ధి చెందినట్లు సూచిస్తోంది. నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ పన్ను విధానాల కారణంగా చిన్నచిన్న వ్యాపారస్తులు, వ్యవసాయదారులు, వలస కార్మికులు తదితర సామాన్య ప్రజానీకం జీవితాలు అతలాకుతలమయ్యాయి. మార్కెట్ కార్యకలాపాలు మందగించడంతో ప్రజల జీవన ప్రమాణాలు బాగా క్షీణించిపోయాయి. దానికి తోడు ద్రవ్యోల్బణం పెరగడంతో నిత్యావసరాల ధరలు సామాన్యునికి అందుబాటులో లేకుండా పోయాయి. వ్యవసాయరంగంలో సంక్షోభం రైతుల ఆత్మహత్యలకు కారణమైతే, పారిశ్రామికరంగంలోని సంక్షోభం సామాన్యుల బతుకులు దుర్భరంగా మారేలా చేసింది. ప్రజాజీవితంలో నెలకొన్న ఉదాసీన, అసంతృప్తులు మహారాష్ట్ర రైతాంగం లాంగ్‌మార్చ్ రూపంలోను, దేశవ్యాప్తంగా వివిధ సెక్షన్ల ప్రజలు తమ సమస్యలపై ఉద్యమించే రూపంలోను వ్యక్తమవుతున్నాయి. సామాజిక ఆర్థిక రంగాలలో నెలకొన్న కల్లోల పరిస్థితులు ఎన్నికల సమయాల్లో అధికార పక్ష వ్యతిరేక పవనాల రూపంలో వ్యక్తమవుతాయి. సరిగ్గా ఇలాంటి ప్రజావ్యతిరేక పవనాలు బుధవారంనాటి ఎన్నికల ఫలితాలలో వ్యక్తమైనాయి. ఈ నేపథ్యంలో బీజేపీ 2019 సార్వత్రిక ఎన్నికల్లో గెలవడమనేది 2014లో వలె ఏమంత సునాయాసంగా సాగే వ్యవహారం కానేకాదని అర్థమవుతోంది.



మంచిమాట




ఘనకార్యాలు చేయాలంటే మొదట కావాలసింది ఆత్మవిశ్వాసమే

- శామ్యూల్ జాన్సన్

అంతరాలు పెంచుతున్న అభివృద్ధి

గణాంకాలు 2018 ప్రకారం, అత్యంత వేగంగా అభివృద్ధి పెంచుతున్న, ప్రపంచంలోని పది అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మనదేశం మొట్టమొదటి స్థానంలో నిలుస్తోంది. ఐఎమ్ఎఫ్ అంచనాల ప్రకారం, 2015లో మనదేశ జీడీపీ 7.4%గా నమోదైంది. ఇది ప్రపంచంలోనే ఏడవ అతి పెద్ద పెరుగుదల. గత దశాబ్దకాలంగా మనదేశ జీడీపీ 7 శాతానికి అటూఇటూగా నమోదువుతూ వస్తోంది. ఇంతటి గొప్ప ఆర్థికాభివృద్ధి కనబరుస్తున్న మనదేశంలో నిరుద్యోగం కూడా అత్యంత వేగంగా పెరుగుతోంది. జీడీపీ (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్) అంటే దేశ స్థూల ఉత్పత్తి మార్కెట్ విలువ. ఒక ఆర్థిక వ్యవస్థ ఉత్పత్తి చేసే వస్తు, అందించే సేవల నికర మార్కెట్ విలువను జీడీపీగా లెక్కకడతారు. ఏ దేశంలోనైనా అది ఉత్పత్తి చేసే వస్తువులను అక్కడి ప్రజలే ఎక్కువగా వినియోగిస్తారు. వినియోగం పెరిగితే జీడీపీ పెరుగుతుంది. ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయి. అంతమాత్రాన ఆ దేశం అభివృద్ధి చెందిందని చెప్పలేం. అలా కనుక లెక్కకడితే మనకన్నా పేద దేశాలైన ఇథియోపియా, లిబియా వంటివాటి జీడీపీ మన కన్నా ఎక్కువ. మనకన్నా నిదానంగా వృద్ధిని చూపిస్తున్న అమెరికా, చైనా, జర్మనీ వంటి దేశాలు ఆర్థికంగా బలోపేతులౌతున్నాయి. 2017-18లో 6.5% వృద్ధిని కనబరచిన చైనా, తన ఆర్థిక వ్యవస్థకు 1.181 బి॥డాలర్ల అదనపు నిధులను, అదనంగా సమకూర్చుకోగలిగింది. అమెరికా 838 బిలియన్ డాలర్లు, జర్మనీ 283 బి.డాలర్లు సమకూర్చుకున్నాయి. కానీ మనదేశం మాత్రం కేవలం 215 బి. డాలర్లు అదనంగా సమకూర్చుకోగలిగింది. నిజమైన అభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాలపై ఆధారపడి వుంటుంది. ఈ లెక్కన చూసుకుంటే ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలతో పోల్చుకుంటే మనదేశం వాటి దరిదాపుల్లోకి కూడా రాదనేది నమ్మలేని నిజం. మనదేశ తలసరి జీడీపితో పోల్చుకుంటే అమెరికా జీడీపీ 32 రెట్లు అధికం. చైనా తలసరి జీడీపీ మన కన్నా ఐదురెట్లు అధికం. మనదేశ తలసరి జీడీపీ అగ్రరాజ్యాల సరసన చేరాలంటే రెండంకెల వృద్ధిని కనబర్చాలి. ఒకపక్క ఆర్థికాభివృద్ధిలో మన దేశం దూసుకుపోతోందని ఉపన్యాసాలిచ్చే వారికి పెరుగుతున్న నిరుద్యోగిత కానరాకపోవటం, ఆర్థికాంశాలపై వారి అవగాహనారాహిత్యాన్ని తెలియజేస్తోంది. కాగితాల మీద అంకెలు చూపి అదే నిజమైన అభివృద్ధని మభ్య పెట్టాలని చూస్తున్నారు. గత నాలుగేళ్ళుగా రోజుకు 550 ఉద్యోగాలు కనుమరుగౌతున్నాయి. అదే సమయంలో రోజూ 35,000 మంది కొత్తగా కొలువుల కోసం పుట్టుకొస్తున్నారు. 18-25 మధ్యనున్న యువతలో 51 మిలియన్ల మంది నిరుద్యోగులున్నారు. ప్రపంచంలోనే ఎక్కువమంది కుబేరులున్న దేశాలలో మనదేశం మూడవ స్థానంలో వుంది. అయినా 80 మంది రోజుకు పది డాలర్ల కన్నా తక్కువ సంపాదిస్తున్నారు. 200 మి. మంది కేవలం రోజుకు రెండు డాలర్లే సంపాదిస్తున్నారు. ఈ గణాంకాలు చూస్తుంటే మనదేశ



> విభిన్న వర్గాలు, అంతరాలు, తారతమ్యాలున్న భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో కఠినమైన నియమాలు, నిబంధనలతో రాత్రికి రాత్రి వ్యవస్థను మార్చాలనుకోవటం అవివేకం.

ఆర్థికాభివృద్ధి కుబేరుల్ని అపర కుబేరులుగా చెయ్యటానికి దోహదపడేదిగా వుందే తప్ప, పేదవారికి ఏమాత్రం ఉపయోగకరంగా లేదనేది వాస్తవం. ప్రపంచ ఆర్థిక సమాఖ్య విడుదల చేసిన అభివృద్ధి సూచికల్లో మనదేశం 77 దేశాలకుగాను 62వ స్థానంలో వుంది. మన పొరుగునున్న దేశాలైన శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ వంటివి మనకన్నా ముందంజలో వున్నాయి. మానవ అభివృద్ధిలో సైతం 188 దేశాలకు 130వ స్థానంలో మనదేశం వెనుకబడి వుంది. దేశంలోని 55% సంపద కేవలం ఒక్కశాతంగా వున్న ధనికుల దగ్గర వుంది. 2016 లెక్కల ప్రకారం మనదేశంలో 101 మంది బిలియనీర్లు, 2 లక్షల మంది మిలియనీర్లు, 1,37,100 మంది కోటీశ్వరులున్నారు. ప్రతి ఏడాది వీరి సంఖ్య 30% పెరుగుతోంది. ఇంకొక పక్క బీద వాడు బీదవాడిగానే మిగిలిపోతున్నాడు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వర్గాలు క్రమేణా కనుమరుగై కేవలం వారే మిగులుతారు. జాతీయ ఆర్థిక పరిశోధనా మండలి అంచనా ప్రకారం 78 మి॥ మధ్య తరగతి ప్రజలు మనదేశ ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నారు. 1991 నుంచి కోటీశ్వరులకు, కూటికి లేని వారికి అంతరాలు పెరుగుతూ వస్తున్నా, ఈ దశాబ్ది కాలంలో ఈ అంతరాలు ప్రజాసామ్యానికి ముప్పువాటిల్లేటట్లు పెరగటం ఆందోళన కలిగించే అంశం. 2015 ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి సాధించిన ఆంగస్ డేటన్ తన పరిశోధనలో, ప్రపంచ వ్యాప్తంగా ధనవంతులు రాజకీయ అధికారాలను హస్తగతం చేసుకుని, పేదల వాటా అందకుండా చేస్తున్నారని స్పష్టం చేశారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణే 'స్మార్ట్ నగరాభివృద్ధి' అంటూ కోటీశ్వరులు నివసించే నగరాల మీద కోట్లు కుమ్మరిస్తున్నారు. లక్షల మధ్యతరగతి ప్రజలు కడుతున్న ఆదాయ పన్నును ఒక్కరాత్రిలో కోటీశ్వరుడు దోచుకుని విదేశాలకు ఎగిరి పోతుంటే దిక్కులు చూస్తోంది ప్రభుత్వం. ఈ డబ్బుతో ఎంతో మంది పేద కుటుంబాలను బాగుచేయవచ్చు. కేవలం వాణిజ్య, వ్యాపార కార్యకలపాలు, సెన్సెక్సు స్టాక్ మార్కెట్లపై దృష్టి పెడుతున్నారు కాని, వ్యవసాయం, ఆరోగ్యం, విద్య వంటి మౌలిక రంగాలపై ఏ ప్రభుత్వం దృష్టి సారించట్లేదు. ఏదో బిచ్చం వేస్తున్నట్లు, ఆరోగ్యానికి జీడీపీలో 3 శాతం, విద్యకు 2 శాతం నిధులు కేటాయిస్తున్నారు. దీనిని బట్టే తెలుసుకోవచ్చు ప్రజల ప్రాణాలకు ప్రభుత్వాలు ఎంత విలువనిస్తున్నాయే. దేశానికి అన్నంపెట్టే వ్యవసాయ రంగం నేడు అస్తవ్యస్త విధానాలతో, తప్పుడు మద్దతు ధరలతో కునారిల్లుతోంది. మనదేశంలోని సామాజిక, ఆర్థిక అంశాలు ఎంతో క్లిష్టమైనవి. వీటిని రాత్రికి రాత్రి ఎవరూ మార్చలేరు. 'ఆధార్' వంటి పథకాలు అమలు పరిచేటప్పుడు ఎంతో సంయమనం, సహనం, సమయం అవసరమౌతాయి. కాని ఆగమేఘాల మీద 'ఆధార్'ను అన్ని ఆర్థిక అంశాలకు ముడిపెట్టటం వల్ల, ఇప్పటికే ఎంతోమంది పేదలు నిత్యావసర వస్తువుల పంపిణీ, ఉపాధి కూలీ పథకాలు వంటి వాటికి దూరమయ్యారు. ఈ కారణం తోనే చివరకు పేదకుటుంబాల చిన్నారులు మధ్యాహ్న భోజన పథకానికి సైతం దూరమయ్యారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి సంస్కరణలు కూడా పెద్దవారికన్నా, పేద వారిపైనే ఎక్కువ ప్రభావం చూపించాయన్నది వాస్తవం. కొన్ని వందలమంది పేదలు బజారున పడ్డారన్నది వాస్తవం. జీఎస్టీ వల్ల కొన్ని వందల మంది చిరువ్యాపారస్తులు వీధిన పడ్డారు. విభిన్న వర్గాలు, అంతరాలు, తారతమ్యాలున్న భారతదేశంలాంటి అతి పెద్ద ప్రజాస్వామ్యదేశంలో కఠినమైన నియమాలు, నిబంధనలతో రాత్రికి రాత్రి వ్యవస్థను మార్చాలనుకోవటం అవివేకం. భయపడటం, బెదిరించటం వల్ల పరిస్థితులు ఇంకా దిగజారతాయి. వాటికి బదులు సహృదయంతో, మానవత్వంతో రైతులను, రైతుకూలీలను, చిరువ్యాపారులను ఆదుకున్నట్లైతే అభివృద్ధికి నిజమైన అర్థంచెప్పిన వాళ్ళమౌతాము. పేదవారి పక్కన ప్రభుత్వాలు నిలబడినప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యానికి నిజమైన గౌరవం ఇచ్చినట్లవుతుంది. అంతే కాని అణగారిన వర్గాలను విస్మరించి, కేవలం జీడీపీ పెరుగుదల అనే అంకెల గారడీతో అభివృద్ధికి రంగులు పులిమితే జనం గుణపాఠం చెప్పే రోజులు తొందరగా వస్తాయి.

ఇ. శ్రీనివాస్‌రెడ్డి
ప్రిన్సిపాల్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ.

రైతన్నల ధర్మగర్జన

అవ్వా ఎర్రటి నెత్తురోడే నీ పాదాలకు ప్రణామము
భారత జాతి గుండెలమీద నీ పాద ముద్ర వేసినవ్
బతికి ఉన్నామనే భ్రమపడే కుహనా సమాజానికి
బతుకుటకు మెతుకువై నీ బతుకే బారమై రోడ్డున పడి
రోదిస్తున్న నీకు ఏ మొహం పెట్టుకొని ఓదార్చాలో
తెలియట్లేదూ..
కన్నం పడ్డ పంచకట్టుతో అన్నం పెట్టే రైతన్న
చేతిలో కర్ర, జబ్బకు సంచి విరిగిన కళ్ళజోడు
ఆరు పదులు వచ్చినా అలుపెరుగని నీ పయనం
ఎవ్వడి కోసమే బాపూ.....?
ఓ... అన్నం పెట్టాలి కదూ నువ్ జెక్కిన శిల్పాలకు
పిండం పెట్టాలి కదూ బతికి ఉన్న శవాలకు!!
పద పద చిందుతున్న నీ పాదపు నెత్తురు జూసన్నా
చీము నెత్తురు ఉన్న జనం కలం కదుపుతూ గళం
విప్పుతారేమొ....!?
మన్నించు తల్లీ.. నా దేశంలో పత్రికా రంగం
మరణించింది.. కాదు కాదు ఆత్మహత్య చేసుకుంది!!
నీ పాద స్పర్శతో పులకిస్తుందీ పుడమీ
నీ ధర్మ గర్జనతో దద్దరిల్లుతోందీ అవనీ
రైతు బిడ్డలుగా మేం ఉన్నాం తల్లీ... జడవకూ తల
తెగిపడినా రాజ్యంతో రాజీలేని యుద్ధం జేస్తం...
మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం కాదురా!
మీ దేవునికి నైవేద్యం పండించే మహా పురుషుడు
ఆకలితో నాసిక్ నుండి ముంబై వరకు ఆకలి యాత్ర
చేస్తుంటే యేడావన్నరా !! / వీళ్ళు గదరా దేశభక్తులు
దేశానికి అన్నం పెట్టే రైతన్న రోడ్డున పడి
విలపిస్తున్నారూ / ఓ నా భారత జనమా సిగ్గు
పడు... / వీళ్ళ కోసం ఏదన్న చేయ్...

- ఎల్లంకి వెంకటేశ్వర్లు
పౌరహక్కుల సంఘం



ప్రతిఫలనం

(నిన్నటి తరువాయి)

మనుషులు..మర మనుషులు

మానవుని మనసులో ఉదయించేవి నిజమైన అస్తిత్వం గల వస్తువుల, పరిణామాల ప్రతిబింబాలు మాత్రమే గాదు, ఆనాటికి అస్తిత్వంలో లేని వస్తువుల ప్రతిబింబాలు కూడా ఏర్పడవచ్చు. మానవుడు భవిష్యత్తులో తాను నిర్మించబోయే భవనం, లేదా యంత్రం లేక సామాజిక వ్యవస్థ, అలాగే ఇతర వస్తువులను గురించిన ప్రతిబింబాలను సృష్టించుకోగలడు. అయితే అవి అదివరకే ఉనికిలోవున్న వస్తువుల ప్రతిబింబాల ఉనికిపైనే తలెత్తగలవు. అవి మానవునికి చుట్టూతా వున్న ప్రపంచానికి సంబంధించిన జ్ఞానం ఆధారంతోనే ఏర్పడుతాయి. మానవులకు జంతువులకు మధ్య చైతన్యమే ప్రధాన తేడాగా గుర్తించాలి. అయితే వానరుని నుంచి నరుడుగా మారిన పరిణామక్రమంలో 'శ్రమ' కీలకపాత్ర పోషించింది. మానవ సమూహం శ్రమ సాధనాలను వినియోగిస్తూ నిర్వహించే ఉమ్మడి, సహకార కార్యకలాపమే 'శ్రమ'.

సహకార, సమిష్టి కార్యకలాపం పునాదిగా...

ప్రతి జంతువు ఆత్మరక్షణ కోసం, ఆహారం కోసం అవయవ విశిష్టతలను కలిగి ఉంటుంది. అయితే ఇతర జంతువులలో లాగా అవయవ విశిష్టతలు కొరవడిన మానవజాతి రక్షణ, ఆహార లభ్యత కోసం సమష్టిగా జీవించక తప్పనిస్థితి. మానవులు జంతుస్థితి నుంచి పరిణామం చెందేందుకు చైతన్యం, భాష అలవర్చుకోవడంలో 'శ్రమ' (ఉమ్మడి, సహకార కార్యకలాపం) ప్రధాన భూమిక పోషించింది. పర్యవసానంగా మానవుల సమష్టి జీవనం చారిత్రకంగా ఉనికిలోకి వచ్చింది. దాంతో మానవుల చైతన్యం రూపొందేందుకు మెదడు అనే అంగం ఎంత అవసరమో, ఆ అంగం రూపొందేందుకు అవసరమైన పరిసరాలతో కూడిన ప్రకృతి, సమాజం (వెరసి ప్రపంచం) అంతే అవసరం. మానవుడు సామాజిక మానవ కార్యకలాపం ద్వారానే జ్ఞానాన్ని, చైతన్యాన్ని పొందగలడు. జ్ఞానం, చైతన్యం సామాజికంగా సమష్టి కార్యకలాపాల పుట్టి, వ్యక్తుల ద్వారా వ్యక్తమవుతుంది. అంతమాత్రాన వ్యక్తులే చైతన్యానికి పునాదిగా గుర్తించడం పొరపాటు. మరమనుషుల మేధ రూపొందిన పదార్థం కోటానుకోట్ల సంవత్సరాల ప్రకృతి స్వతఃసిద్ధ పరిణామక్రమం పరాకాష్టగా ఏర్పడిన మానవ మెదడులోని అత్యున్నత పదార్థం కాదు, అదే సమయంలో ప్రపంచంతో మానవుని సమష్టి కార్యకలాపాల చర్యాచర్య ప్రతిచర్యల వంటివి మరమనుషులకు ఉండవు. ఈ నేపథ్యంలో మనుషుల కంటే మెరుగైన మేధో కార్యకలాపాన్ని మరమనుషులు నిర్వహించలేరు. వివిధ ప్రకృతి పదార్థాలు మానవీకరించిన క్రమంలో బాహ్య కారణాల రీత్యా మరమనుషులు రూపొందారేగానీ, పదార్థపు అంతర్గత చలన నియమాల ప్రేరణతో, పదార్థ స్వతఃసిద్ధ పరిణామక్రమంలో ఏర్పడలేదు. అదీకాక భూగోళంపై అత్యంత సంక్లిష్టమైన, మహోన్నత పదార్థమైన మెదడు కలిగిన స్వయం చలిత వ్యవస్థలుగా మానవులు ఆవిర్భవిస్తే, వివిధ నిర్జీవ పదార్థపు పరిణామ క్రమంలో వివిధ దశల్లో ఉనికిలో ఉన్న పదార్థాలతో రోబోలు రూపొందారు. ముందుగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక పరిధిలోనే మెరుగైన ప్రత్యామ్నాయాలను మర మనుషులు అందించగలరేగానీ సృజనాత్మక ప్రత్యామ్నాయాలను అందించడం వారి స్వభావమే కాదు.

శారీరక/మానసిక శ్రమ తగ్గించే యంత్రాలు

శ్రమ సాధనమైన సాధారణ యంత్రాలు మానవుని శారీరక శ్రమను తగ్గిస్తాయి. సైబర్‌నెటిక్ యంత్రం అతని మానసిక శ్రమను తగ్గిస్తుంది. తద్వారా సృజనాత్మక ప్రయత్నం అవసరం లేని పనుల నుంచి, అలసట, విసుగును గలిగించే పనుల నుంచి మెదడుకు ఉపశమనం కలిగిస్తుంది. అది మానవుని మేధాశక్తిని విస్తృతపరుస్తుంది. అభివృద్ధి పరుస్తుంది. కానీ సైబర్ నెటిక్స్ శాస్త్రం ఎంత అభివృద్ధి చెందినప్పటికీ మానవుని ఆలోచనకు వాహకంగాను, ప్రత్యామ్నాయంగాను పనిచేయజాలదు. మెదడు వంటి అత్యున్నత స్థాయి పదార్థం కొరవడిన రోబోలు ప్రపంచంతో చర్యాప్రతిచర్యల ద్వారా సంఘజీవిగా ఉండే మానవుని స్థానాన్ని ఆక్రమించజాలదు. యంత్రం ఎప్పటికీ పరికరంగానే, మానవుడు ఎదుర్కొనే ఉత్పత్తి సమస్యలను, అతడు గుర్తించిన సమస్యలను పరిష్కరించే సాధనంగానే ఉంటుంది. అయితే ప్రకృతి నుంచి సామాజిక మానవుడు తన అవసరాలను ఉత్పత్తి సాధనాల (శ్రమ సాధనాలు+శ్రమ లక్ష్యాలు (ముడిసరుకుల రూపంలోని ప్రకృతి వనరులు) ద్వారానే తీర్చుకుంటాడు. ప్రకృతిని మానవీకరించే క్రమంలో మనుషులు ఉత్పత్తి సాధనాలను ఆధునీకరిస్తే, ఆ సాధనాలు తిరిగి మానవునిపై ప్రభావం చూపి, సామాజిక పరిణామానికి దారితీశాయి. ఉత్పత్తి సాధనాల అభివృద్ధి చరిత్ర, మానవ సమాజాభివృద్ధి చరిత్ర పరస్పర పూరకాలుగా సాగుతాయి. అయితే ఈ పరిణామం రెండుదశలుగా సాగుతుంది. ఒకటి- మనిషికి, ప్రకృతి మధ్య యంత్రాల వ్యవస్థ రూపంలోని ఉత్పత్తి శక్తుల దశ, రెండు- మనిషికి ప్రకృతికి మధ్య ఉత్పత్తిక్రమాల వ్యవస్థ రూపంలోని ఉత్పత్తి శక్తుల దశ.

'యంత్రాల వ్యవస్థ' స్థానంలో 'క్రమాల వ్యవస్థ'

ఉదాహరణకు పత్తి నుంచి బట్టలు తయారు చేసేందుకు జిన్నింగ్ ద్వారా ముడి పత్తి నుంచి గింజలు తీయడం, రాట్నాల ద్వారా పత్తి నుంచి నూలు తయారుచేయడం, నూలును మగ్గాలపై చేనేత కార్మికుడు నైపుణ్యంతో నేత పనితనంతో బట్టలు తయారుచేయడం వరకు బట్ట తయారయ్యే ఉత్పత్తి క్రమం అవుతుంది. జరిగే కార్యకలాపమంతటినీ ఒక 'ఉత్పత్తి క్రమం' అని అంటారు. పత్తి నుంచి బట్ట తయారయ్యే క్రమంలో విభిన్న దశల్లో వివిధ యంత్రాల సహాయంతో మనిషి కూడా ఆ యంత్రాలతో పాటు పనిచేయవలసి ఉంటుంది. ఈ స్థితిలో పత్తి నుంచి బట్టను రూపొందించే ప్రక్రియ యావత్తులో మనిషికి, ప్రకృతికి మధ్య యంత్రాల వ్యవస్థ ఉంటుంది. ఈ దశలో మనిషి యంత్రంతో సమానంగా పనిచేయవలసి వస్తుంది. అయితే ముడి పత్తి నుంచి గింజలు తీసేందుకు జిన్నింగ్ యంత్రాలు, పత్తి నుంచి నూలు తీసేందుకు నూలు మిల్లులు, నూలు నుంచి బట్ట తీసేందుకు బట్టల మిల్లులు వగైరా యంత్రాలు వచ్చాయి. ఇప్పుడు ఆ యంత్రాలన్నీ స్వయం చలిత యంత్రాలుగా మారాయి. ఈ మొత్తం ప్రక్రియలో మనిషి యంత్రంతో పాటు పనిచేయవలసిన స్థితినుంచి క్రమంగా దూరమయ్యాడు. అంటే మనిషులు ఉత్పత్తి ప్రక్రియలో క్రియాశీలక పాత్ర స్థానం నుంచి యాజమాన్య పాత్రకు పరిణామం చెందే క్రమం నేడు పరాకాష్ఠకు చేరుకుంటోంది. ప్రకృతికి, మనిషికి మధ్య తొలినాళ్ళలో భారీయంత్రాలు, స్వయం చలిత యంత్రాలు, సైబర్నిటిక్ యంత్రాలు, నేడు రోబోటిక్స్ ద్వారా ఉత్పత్తి ప్రక్రియ పరిణామం సాగింది. అంటే మనిషికి ప్రకృతికి మధ్య యంత్రాలతో పాటు కలసి పనిచేసే పరిస్థితుల స్థానంలో యంత్రాలను మానవులు కేవలం నియంత్రించే 'క్రమాల వ్యవస్థ' స్థాయికి ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందుతున్నాయి. దాంతో ఉత్పత్తి స్థానాల్లో రాబోతున్న ఈ విప్లవాత్మక మార్పుల వల్ల మానవశక్తి వినియోగం యంత్రాలను యాజమాన్యానికే పరిమితమై సామాజికావసరాల ఉత్పత్తి అవసరమైన శ్రమకాలం క్రమంగా తగ్గిపోతుంది. దాంతో సమాజంలో 'ఫ్రీ టైం' పెరుగుతుంది. ఉత్పత్తి కోసం మానవ వనరుల వినియోగం గణనీయంగా తగ్గిపోతుంది. దాంతో సమాజంలో మునుపటి వలె ఉద్యోగాలుండవు కాబట్టి, మునుపటి వలె ఉపాధి అవకాశాలూ ఉండవు. కత్తి స్థానంలో తుపాకీ రావడంతో యుద్ధంచేసే పద్ధతిలోనూ, సైనిక అంతరంగిక నిర్మాణంలోను, యుద్ధం చేయవలసిన శత్రుసైన్యాలతో ఉన్న సంబంధాల్లోనూ మౌలిక మార్పులు వచ్చినట్లుగానే, 'క్రమాల వ్యవస్థ' దశకు చేరుకున్న ఉత్పత్తి శక్తుల్లో వచ్చిన పెను విప్లవం సామాజిక సంబంధాల్లో అనివార్యమైన మౌలిక మార్పులు రావడానికి ప్రేరణ ఇస్తుంది. ఈ విషయాన్ని అర్థం చేసుకుని సామాజిక సంబంధాల విప్లవాత్మక పరిణామానికి అనుకూలంగా మానవ కార్యకలాపం సాగితే పెద్ద ఎత్తున విధ్వంసం లేకుండానే ప్రపంచం మౌలికంగా తర్వాతి దశకు అభివృద్ధి చెందుతుంది. అయితే ఈ పరిణామానికి విపరీత అర్థాలు, అపార్థాలు కల్పించి సామాజిక ఆధిపత్యశక్తులు ప్రచారం చేస్తున్నాయి. ఉపాధి సంక్షోభం, జాత్యహంకారం, ఫాసిజం వంటి సామాజిక వైపరీత్యాలు, యుద్ధాలు, అంతర్యుద్ధాలు, అణుయుద్ధాలు చెలరేగి అంతర్జాతీయ సమాజాన్ని 'మానవాళి అంతం' (యుగాంతం) వైపునకు నడిపిస్తాయని, అయితే మానవ సమాజంలోని వైషమ్యాల పరిష్కారం సామాజిక దుష్టత్వంలోనే ఉంది. ఆ దుష్టత్వానికి కారణమైన ప్రజా సంబంధాల్లో మార్పుపైనే మానవజాతి విముక్తి ఆధారపడి ఉంటుందన్న సత్యాన్ని గ్రహించకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకే మరమనుషుల వల్ల మానవ విధ్వంసం జరుగబోతోందని అపోహలను సమాజ ఆధిపత్యశక్తులు దుష్ప్రచారం చేస్తున్నాయి.

మనుషుల కంటే వేగంగా, నైపుణ్యంతో, ప్రతిభావంతంగా సాధారణ యంత్రాలుగానీ, సైబర్నిటిక్ యంత్రాలుగానీ పనిచేయగలవే గానీ ప్రకృతిలో అత్యున్నత స్థాయి పరిణామం చెందిన మెదడుగానీ, ఆ మెదడు ద్వారా ప్రపంచాన్ని ప్రతిబింబించేందుకు అవసరమైన సమాజంగానీ వాటికి ఉండవు. కాబట్టి మనుషుల్లాగా చైతన్యవంతంగా, సృజనాత్మకంగా, స్వయం నిర్ణాయకంగా ఆలోచించి, ప్రతీకరించే స్థాయికి మర మనుషులు ఎన్నటికీ చేరుకోలేవు.

వెన్నెలకంటి రామారావు

మన లేఖలు

రైతులకు ప్రభుత్వాలు చేసిందేమీ లేదు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రైతులకు ఏమి మేలు చేయలేకపోతున్నాయి. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ప్రకటించటంలో విఫలమవుతున్నాయి. సరైన మద్దతు ధర లేకపోవటంతో దళారులదే ఇష్టారాజ్యం కొనసాగుతోంది. తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ప్రభుత్వం ఏ ఒక్క పంటకైన సరైన మద్దతు ప్రకటించిన దాఖలాలు ఉన్నాయా? కేంద్రంతో పోరాడటం అనే శుష్క మాటలు తప్ప చేసింది ఏమిటో. ఇటీవల రాష్ట్రంలో సుబాబుల్, జామాయిల్ పంటలకు గిట్టుబాటు ధరలు లేక కొట్టుమిట్టాడుతున్నాయి. ఎర్రజొన్నలకు సైతం గిట్టుబాటు ధరలు రాని పరిస్థితి ఉంది. అడుగడుగునా రైతు అన్యాయానికి గురి అవుతున్నాడు. దీనికి తోడు నకిలీ విత్తనాలు బెడద వల్ల పూత లోనే రాలిపోవటం వల్ల ఆవేదనకు గురి అవుతున్నారు. ఇటు రైతులు, అటు వినియోగదారుడికి లాభం లేక దళారి లబ్ధిపొందుతున్నాడు. దిక్కుతోచని స్థితిలో రైతు అమ్ముకొనవలసి వస్తోంది. కూరగాయలకు సైతం ధరపడిపోవటం వల్ల రైతులు ఉచితంగా పంచి పెడుతున్న సంఘటనలు ఉన్నాయి. పశువులకు మేతగా ఉపయోగించుకుంటున్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించటంలో కేంద్రంపై పోరాటం సాగించాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సైతం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు మారిన రైతు బ్రతుకులు మారలేదు. దళారి సంస్కృతి నుండి రైతులను ఆదుకోవాలి.

- అయినం రఘురామారావు
ఖమ్మం.

మనం
కుటుంబం
శుక్రవారం, 16 మార్చి 2018
www.manamnews.com

ఈ దశాబ్దపు రసవత్తర రాజకీయాలను శాసిస్తూ, చిత్ర విచిత్రమైన మలుపులు తిప్పుతున్న సబలలు తమ వ్యూహాలకు మరింత పదును పెడుతున్నారు. రాజకీయాలను ఒంటిచేత్తో శాసించే స్థాయిలో ప్రస్తుతం వీరు న్యూస్ మేకర్స్‌గా 2018 రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా నేతలు తమ ఉక్కు సంకల్పాన్ని ప్రదర్శిస్తున్న తీరు నభూతో నభవిష్యసి.

మో'ఢీ'కి సై

1984 తర్వాత మొట్టమొదటి సారి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఆవిర్భవించిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి ఇక ఐదేళ్ల పాటు ఎదురుండదని భావించిన వారి లెక్కలన్నీ తలకిందులైన వేళ.. ప్రధాని నరేంద్ర మోదీ ఎదురులేని నేతగా సరికొత్త చరిత్ర సృష్టించబోయే వేళ.. ఉన్నట్టుండి రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. ఇంత స్పష్టమైన మెజార్టీ ఉన్న ప్రభుత్వానికి వచ్చిన కష్టాలేంటి అంటే అవి ఒకటా రెండా.. అష్టదిగ్బంధనం చేసినట్టు.. ఏదో అదృశ్యశక్తి రాజకీయ సమీకరణాలను ఒక్కసారిగా తలకిందులు చేసినట్టు రాజకీయ పెనుమార్పులకు మహిళానేతలు కేంద్ర బిందువుగా మారారు. మోదీని ఢీ కొట్టేందుకు సై అంటూ మాటల తూటాలు పేల్చిన ఈ మహిళల మాటలను మొదట్లో అంతా చాలా ఈజీగా కొట్టిపారేశారు. కానీ ఈ మహిళా రాజకీయ నేతలు నాడు ఊహించినదే నేడు నిజమైంది.. వారి అంచనాలు అక్షరాలా నిజమయ్యాయి.. అందుకే ఇప్పుడు జాతీయ రాజకీయాలు వీరి చుట్టూనే తిరుగుతున్నాయి అంటే అతిశయోక్తి కాదనే క్షణాలు వచ్చాయి.

ఆ ఆరుగురు ఓ సైన్యం

పరిచయం అక్కర్లేని మహిళా నేతలుగా మనదేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న సోనియా గాంధి, మమతా బెనర్జి, మాయావతి, మీసా భారతి, కనిమొళి, కల్వకుంట్ల కవితల ఎత్తులు ఏమిటి? వీరి తదుపరి లక్ష్యం ఏమిటి? అసలు వీరి ఎత్తులకు చిత్తయ్యేలా కనిపిస్తున్న కమలనాథుల తదుపరి వ్యూహం ఏమిటి? మరి వీరు థర్డ్ ఫ్రంట్ దిశగా అడుగులు వేస్తారా? రానున్న జనరల్ ఎలక్షన్స్‌లో అతిపెద్ద రాజకీయ కూటమిగా ఆవిర్భవించి, అధికారం చేపడతారా? మోదీకి చెక్ పెట్టే సత్తా వీరికుందా? వీరి వెనుక ఉన్న బలమైన శక్తులు ఏమిటి? వీరంతా 'మహా కూటమి'గా అవతరిస్తే భారత ఓటర్లు వీరికి పట్టం కడతారా? ఒక్క ముక్కలో చెప్పాలంటే అరడజను మంది మహిళా నేతలపై దేశవ్యాప్తంగా సాగుతున్న చర్చల సారాంశం ఇది.

ఫ్రంట్ మేకర్స్



జెండాలు వేరైనా అజెండా ఒక్కటేగా

బీజేపీ విధానాలతో విసిగిన ఓటర్లకు వీరంతా ప్రత్యామ్నాయం చూపేలా తెరవెనుక వాడివేడిగా సాగుతున్న సమీకరణాలు సఫలమయ్యేందుకు ఒక దశలో వీరు తమ సైద్ధాంతిక విభేదాలను సైతం పక్కన పెట్టేందుకు సై అంటున్నారు. మూకుమ్మడి శత్రువు బీజేపీ, మోదీ కనుక వీరంతా తమ జెండాలు వేరైనా అజెండాలు ఒక్కటే అంటూ ఐక్యతా రాగం పాడే సమయం ఆసన్నమైందనే సంకేతాలు చాలా బలంగా ఇస్తున్నారు. రాజ్యసభలో కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఎస్పీ, బీఎస్పీలు కలిసి వ్యవహరించిన తీరుతో కీలక బిల్లులను కేంద్రం ఆమోదించుకోలేని పరిస్థితుల్లోకి తోసింది. రాజ్యసభలోలానే ఇదే యూనిటీని పార్లమెంట్ వెలుపల ప్రదర్శిస్తే బీజేపీకి చెక్ పెట్టడం సులువనేది ఈ పార్టీలకున్న అతిపెద్ద నైతిక బలంగా మారింది.

పెద్దక్కే.. పెద్ద దిక్కు



పశ్చిమబెంగాల్ సీఎం, ఫైర్ బ్రాండ్ మమతా బెనర్జీ ఏకంగా సీబీఐ, నారదా స్టింగ్ ఆపరేషన్, శారదా చిట్ ఫండ్ కుంభకోణం వంటి అంశాలు తనను ఏమాత్రం బెదిరించలేవని కేంద్రంపై తిరుగుబావుటా ఎగురవేసిన తీరు యావత్ దేశాన్ని నివ్వెరపోయేలా చేసింది. అంతేకాదు మూడవ కూటమికి తాను రథసారథిలా ఉంటానని చెప్పకనే చెబుతున్న దీదీ, రాజకీయ విశ్లేషకుల దృష్టిని ఎప్పుడో ఆకర్షించారు. కేంద్రం చేసే తాటాకు చప్పుడులకు బెదిరేది లేదంటూ బెంగాల్ టైగర్‌లా చెలరేగుతున్న దీదీ, ఇప్పుడు దేశ రాజకీయాలకు దిశా నిర్దేశం చేసేందుకు పూర్తిగా సన్నద్ధంగా ఉన్నారు. కేవలం రాష్ట్ర రాజకీయాలకే పరిమితం అయితే భవిష్యత్ ఉండబోదని గ్రహించిన దీదీ, జాతీయ రాజకీయాల్లో తన పట్టును ఎప్పటికప్పుడు నిలుపుకునే ప్రయత్నం చేస్తూనే, తాను నేషనల్ పొలిటీషన్ అనిపించుకునే మెటీరియల్ అంటూ సందర్భం వచ్చిన ప్రతిసారీ చాటుకుంటూనే ఉన్నారు. సోనియా పెత్తనానికి ఓ వైపు 'నై' చెబుతూనే మరోవైపు పెద్దక్కయ్య పాత్ర పోషించేందుకు ప్రాంతీయ పార్టీ అయిన తృణముల్ పార్టీ సరైన రాజకీయ పక్షమనే భరోసా ఇవ్వడంలో సఫలమయ్యారు. అందుకే తాను లేకుండా థర్డ్ ఫ్రంట్‌కు అసలు అర్థం లేదనేలా మమతా బెనర్జీ అత్యంత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కేంద్రం చేపట్టిన రాజకీయ కక్షసాధింపు చర్యలను సమర్థంగా ఎదుర్కొని మోదీ వ్యతిరేక కూటమిలో 'టాల్ లీడర్‌గా' నిలిచారు మమతా దీదీ. ప్రజలతో ప్రేమగా, అభిమానంగా దీదీ అనిపించుకునే మమతా బెనర్జీ జాతీయ రాజకీయాల్లో 'పెద్దక్కయ్య పాత్ర' పోషించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

అత్తమ్మ 'మాయ'

మోదీ, అమిత్ షా, యోగిల దూకుడుకు కళ్లెం వేసేందుకు.. ఉత్తర్‌ప్రదేశ్‌లో బద్ధశత్రువులైన సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్‌పార్టీ చేతులు కలపడం విచిత్రమైన రాజకీయ కూటమికి ప్రాణం పోసింది. రాష్ట్రంలో ఎస్పీ, బీఎస్పీ మధ్య పచ్చగడ్డి వేస్తే మండే పరిస్థితులు ఉన్నప్పటికీ శత్రువుకి శత్రువు మిత్రుడన్న నానుడిని నిజం చేస్తూ సమాజ్ వాదీ నేత అఖిలేష్ యాదవ్‌తో చేతులు కలిపేందుకు మాయావతి సిద్ధమవ్వడం, ఇప్పటివరకూ మాటలకే పరిమితమైన 'బువా' పాత్రను నిజంగా పోషించేస్తూ..కాదు కాదు.. జీవించేసిన మాయా చూపిన ఎఫెక్ట్ బీజేపీకి చెమటలు పట్టించేసింది. ఇలా అఖిలేష్‌తో చేతులు కలిపారో లేదో బై పోల్స్‌ను 'భయపోల్స్'గా యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ కుర్చీకే ఎసరు తెచ్చేలా పాచిక వేసిన మాయావతి ఇదే ఫార్ములాను భవిష్యత్‌లోనూ రిపీట్ చేసే యోచనలో ఉన్నారు. పొలిటికల్ హిట్ ఈక్వేషన్‌గా నిలిచిన ఈ పొత్తుతో లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని అన్ని స్థానాలను క్లీన్ స్వీప్ చేస్తే, మళ్లీ కేంద్రంలో అధికారం చేపట్టడానికి కమలనాథులకు అవకాశాలు బాగా తగ్గుతాయనే లెక్కలు వేస్తున్న మాయాను థర్డ్ ఫ్రంట్‌లోకి ఆహ్వానించేందుకు ఇటు కాంగ్రెస్‌తోపాటు ప్రాంతీయ పార్టీలన్నీ తెగ ఉత్సాహం కనబరుస్తున్నాయి. ప్రాంతీయ పార్టీల్లో నయా పొలిటికల్ జోష్‌ను తెచ్చిన మాయా తన చెరిష్మాతో దేశవ్యాప్తంగా ఎస్సీల ఓట్లను ఆకర్షించే సత్తా ఉన్న నేత కావడంతో బీజేపీయేతర కూటమి ఏదైనా ఈమెకు పెద్దపీట వేయాల్సిందే అనేలా పరిస్థితులను తనకు అనుగుణంగా మలచుకున్నారు.



సోనియా డిన్నర్ డిప్లమసీ



పార్టీ పగ్గాలు కుమారుడు రాహుల్ గాంధీకి అప్పగించినప్పటికీ జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న సోనియా క్రియాశీల రాజకీయాల్లో మళ్లీ తన మార్కును చూపుతున్నారు. యూపీఏ ఛైర్‌పర్సన్ హోదాలో బీజేపీ వ్యతిరేక పార్టీలను ఒకే గొడుగు కిందికి తెచ్చేందుకు సోనియా చేస్తున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి వచ్చేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. మోదీ ప్రధానిగా అధికార పగ్గాలు చేపట్టిన క్షణంనుంచే లోక్‌సభలో నామమాత్రంగా ఉన్న ప్రతిపక్షాల్లో ఐక్యత లోపించిందని గుర్తించిన సోనియా సాధారణ ఎన్నికలు సమీపించే సమయానికి చురుకైన రాజకీయనేతగా మారడం విశేషం. టెన్ జన్‌పథ్‌ను దేశ రాజకీయాలకు కేంద్ర బిందువుగా చేయాలన్న ఆమె తాపత్రయం బీజేపీయేతర పార్టీలను, పలు ప్రాంతీయ పార్టీలను 'డిన్నర్ డిప్లమసీ' ద్వారా 'అతుకుల బొంత'ను తయారు చేసి, తన రాజకీయ వారసుడికి, ప్రధానిగా పట్టం కట్టేందుకు నడుం బిగించారు. ఈ విషయంలో సోనియా సాధించింది ఎంత అంటే.. ఆమె విదేశీయతను కాదని వేరు కుంపటి పెట్టుకున్న శరద్ పవార్ సైతం సోనియా నిర్వహించిన యూపీఏ కీలక భేటీకి హాజరయ్యేలా అంటే అతిశయోక్తి కాదు.



లాలూ విసిరిన అస్త్రం

మీసా భారతి, మొన్నటివరకూ కేవలం ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ గారాలపట్టి, ఓ ఎంపీ మాత్రమే. కానీ తనపై సీబీఐ, ఈడీని కేంద్రం ఉసిగొల్పిందన్న కసితో రగిలిపోతున్న మీసా భారతి తనలోని లీడర్‌షిప్ క్వాలిటీలను ఒక్కొక్కటే బయటికి తీస్తోంది. తండ్రికి తగ్గ కూతురు అనిపించుకునేలా వడివడిగా రాజకీయ అడుగులు వేస్తూ, తన పదునైన బిహారీ డైలాగులతో జాతీయ మీడియాలో చెలరేగిపోతున్నారు. తమ్ముళ్లు ఇద్దరూ బిహార్ రాజకీయాల్లో మునిగితేలుతుంటే జాతీయ రాజకీయాల్లో తన సత్తా చాటుకునేలా కీలక యూపీఏ భేటీకి కూడా హాజరై తన వాణిని వినిపించారు. సోనియా పక్కనే నించుని తన స్థాయిని చెప్పకనే చాటుకున్న మీసా, భవిష్యత్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడం ఖాయమనే సంకేతాలను చాలా స్పష్టంగా ఇచ్చారు. మమతా బెనర్జీ, మాయావతి, సోనియాగాంధీల నేతృత్వంలో వచ్చే కూటమి ఏదైనా అందులో మీసా ఉండబోతున్నారంటూ స్వయంగా స్టేట్‌మెంట్ ఇచ్చేశారు.

డీఎంకే గొంతుక కనిమొళి



రాజధానిలో తమిళుల సమస్యలు లేవనెత్తడంలో డీఎంకే గొంతుకగా వ్యవహరిస్తున్న డీఎంకే అధినేత ఎం కరుణానిధి ముద్దుల కుమార్తె కనిమొళి రాజకీయాల్లోకి వచ్చిననాటినుంచి జాతీయ రాజకీయాలపై తన పట్టును చూపుతూనే ఉన్నారు. యూపీఏ భేటీలన్నింటికీ క్రమం తప్పకుండా హాజరయ్యే కనికి, నేషనల్ పొలిటికల్ ఈక్వేషన్స్ కొట్టిన పిండి. సంయమనం పాటిస్తూ, చేయాలనుకున్నదాన్ని చేతల్లో చేసి చూపే డిగ్నిఫైడ్ పొలిటీషియన్‌గా పేరుగాంచిన కని, సుతిమెత్తని మాటలతోనే విమర్శనాస్త్రాలను సంధిస్తారు. తమ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, తమిళుల ఆత్మాభిమానంపై ఏమాత్రం కాంప్రమైజ్ కాకుండా దృఢ సంకల్పంతో వ్యవహరించే కని అంటే ప్రాంతీయ పార్టీలన్నీ మంచి అభిమానం ప్రదర్శిస్తాయి. రాజకీయ దౌత్యం ప్రదర్శించడం ఈమెకు వెన్నతో పెట్టిన విద్యగా రాజకీయ పండితులు సైతం ఈమెకు కితాబిస్తారంటే భవిష్యత్ రాజకీయాల్లో కని పాత్ర ఎంత కీలకంగా ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చు. పార్లమెంట్‌లో అనర్గళంగా మాట్లాడుతూనే, మోదీ సర్కారుకు ఘాటుగా చురకలు అంటించే కనిమొళి థర్డ్ ఫ్రంట్ ఏర్పాటుకోసం తహతహలాడుతున్నారు.

కీలకం.. కవిత

రాజకీయ మేధావిగా అనతికాలంలోనే గుర్తింపు సంపాదించిన తెలంగాణ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత, లోక్‌సభలో ఎంపీగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. కీలక చర్చల్లో కేంద్ర ప్రభుత్వ విధివిధానాలను ఏకిపారేసిన కవిత, తెలంగాణ రాష్ట్ర సమస్యలపై ఢిల్లీలో గట్టిగా పోరాడుతారనే కీర్తిని ఆర్జించారు. పార్లమెంట్ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ, జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న కవిత యూపీఏ భేటీకి హాజరవుతారని అందరూ మొదట్లో భావించారు. ఇటీవలే ఆమె పుట్టిన రోజు సందర్భంగా ప్రధాని మోదీ ఆమెకు తెలుగులో పుట్టినరోజు శుభాకాంక్షలు అందజేస్తూ పంపిన గ్రీటింగ్ కార్డ్ చాలు కవిత రాజకీయ పరపతిని, స్థాయిని తెలియజెప్పేందుకు. చురుకైన యువనేతగా, మంచి వక్తగా పేరున్న కవిత రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ముఖ్యమైన పాత్ర పోషించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే ఈమెను కూడా థర్డ్ ఫ్రంట్‌లో భాగస్వామ్యం చేయాలనే యోచనలో కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి.






రూ.1,74,453,84,00,000

(మొదటిపేజీ తరువాయి)

కోట్లుగా చూపారు. బడ్జెట్ మొత్తంలో రాష్ట్ర సొంత ఆదాయం రూ. 73,751.88 కోట్లు. కేంద్రం నుంచి గ్రాంట్స్ రూపంలో రూ. 29,041.88 కోట్లు వస్తుందని చూపించారు. క్యాపిటల్ వ్యయం రూ. 33,369.10 కోట్లు. మొత్తం వ్యయంలో ఇది 19 శాతమని, మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే ఇది చాలా ఎక్కువని ఆర్థిక మంత్రి చెప్పారు. జీడీపీలోద్రవ్యలోటు 3.45 శాతం ఉంది. ఈసారి బడ్జెట్‌లో గతంలోలాగే ఇరిగేషన్‌కు రూ. 25 వేల కోట్లు కేటాయించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకానికి రూ. 2643 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పాటు బ్యాంకులు, వివిధ ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సమకూర్చుకుంటామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. రైతులకు పంటల పెట్టుబడి పథకానికి రూ. 12 వేల కోట్లు కేటాయించారు. ఇక బీసీల సంక్షేమం కోసం రూ. 5,920 కోట్లు, ఎస్టీల సంక్షేమానికి రూ. 8,063 కోట్లు , మైనార్టీల సంక్షేమానికి రూ. 2,500 కోట్లు, ఎస్సీల ప్రగతికి రూ. 16,453 కోట్లు, ఎస్టీ ప్రగతికి రూ. 9693 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ. 15,563 కోట్లు , వైద్య ఆరోగ్య శాఖకు రూ. 7375 కోట్లు కేటాయించారు. ఆసరా పింఛన్లకు రూ. 5,300 కోట్లు కేటాయించారు.






గాడిలోకి ఆర్థికస్థితి

తెలంగాణ ఏర్పడిన తర్వాత వరుసగా ఐదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం ఎంతో సంతోషంగా ఉందని ఈటల చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన నాటి అస్తవ్యస్త పరిస్థితుల నుంచి వినూత్నమైన పథకాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలోకి తెచ్చినట్లు చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మొదలైన ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించామని, 45 నెలల స్వల్ప కాలంలోనే ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించామన్నారు. చీకటి నుంచి వెలుగులోకి, అపనమ్మకం నుంచి ఆత్మ విశ్వాసంలోకి, అణగారిన స్థితి నుంచి అభ్యున్నతిలోకి, వలస బతుకుల నుంచి వ్యవసాయ ప్రగతి వైపు రాష్ట్ర ప్రజలను నడిపిస్తున్నట్లు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి ఫలాలను పేదలకు అందించాలనే ముఖ్యమంత్రి ఆశయానికి అద్దం పడుతూ బడ్జెట్‌ను రూపొందించినట్లు బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

సమైక్య రాష్ట్రంలో చివరి రెండేళ్లలో 2012-14లో తెలంగాణ ప్రాంత జీఎస్‌డిపి వృద్ధిరేటు దేశ వృద్ధిరేటు కంటే చాలా తక్కువగా ఉందని ఈటల తెలిపారు. అప్పుడు దేశ సగటు వృద్ధిరేటు 5.9 ఉంటే తెలంగాణ ప్రాంతంలో 4.2 శాతమే ఉందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతే రాష్ట్ర స్థూల ఉత్పత్తి(జీఎస్‌డీపీ) గణనీయంగా పెరిగిందన్నారు. 2014-15లో జీడీపీ వృద్ధిరేటు 6.8 శాతం నమోదు అయింది. 2016-17 సంవత్సరంలో 10.1 శాతం నమోదైంది. ప్రస్తుత 2017-18 ఆర్థిక సంత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 10.2 శాతం ఉంటుందని అంచనా వేసినట్లు వెల్లడించారు. జాతీయ జీడీపీ వృద్ధిరేటు 6.6 శాతం కంటే తెలంగాణ వృద్ధిరేటు ఎంతో ఎక్కువగా ఉందన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు వల్ల ఏర్పడిన ఇబ్బందులను అధిగమించి ఇంత వృద్ధిని సాధించడం గర్వకారణమన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీ ప్రస్తుత ధరల ప్రకారం గత ఏడాది 6,41,985 కోట్లు. 2017-18లో అది 7,32,657 కోట్లకు పెరిగింది. గత సంవత్సరం కంటే ఇది 14.1 శాతం అధికం. ఇక తలసరి ఆదాయంలోనూ రాష్ట్రం చాలా మెరుగుపడిందని వివరించారు. రాష్ట్ర తలసరి ఆదాయం 2016-17లో 1,54,724 రూపాయలుగా ఉంది. ఇది 2017-18లో 13.4 శాతం పెరిగి 1,75,534 రూపాయలుగా నమోదైంది. జాతీయ వృద్ధిరేటు 8.5 శాతం కంటే ఇది ఎంతో ఎక్కువని ఆర్థిక మంత్రి వివరించారు.



పారిశ్రామిక ప్రగతి..

తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానం వల్ల తయారీ రంగంలోనూ గణనీయమైన ప్రగతి సాధించినట్లు వివరించారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు, పారిశ్రామిక విధానం వల్ల ఏటా తయారీ రంగం వృద్ధి చెందుతున్నదన్నారు. 2015-16 సంవత్స రంలో ఉత్పత్తి రంగం వృద్ధిరేటు 6.4 శాతం ఉంటే, 2016-17లో అది 7.4 శాతానికి పెరి గింది. 2017-18 సంవత్సరంలో 7.6 శాతం ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. సాగునీటి సరఫరా పెరగడంతో సాగు విస్తీర్ణం పెరిగిందని, ఫలితంగా వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధి 2017-18లో 6.9 శాతానికి పెరిగిందన్నారు. 24 గంటల విద్యుత్, భూగర్భ జలాల వినియోగంతో 2018-19 సంవత్సరంలో వ్యవసాయాభివృద్ధి గణనీయంగా ఉంటుందని అంచనా వేశారు.

కళ్లకు కట్టినట్లు పురోగతి

తెలంగాణ ఏర్పడిన తరువాత, ఏర్పడక ముందు పరిస్థితిని పరిశీలిస్తే రాష్ట్రం పురోగతి కళ్లకు కట్టినట్లు కనిపిస్తుందని చెప్పారు. విధా నాల రూపకల్పనలో, ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వం తీసుకు వచ్చిన గుణాత్మకమైన మార్పు వల్లే ఈ విజయం సాధ్య మైందన్నారు. ఈ వరవడికి కొనసాగింపుగానే ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఈటల వివరించారు. సంక్షేమం, మౌలిక వసతుల కల్పన, పాలనా సంస్కరణల్లో తెలంగాణ చూపిన మార్గం తమకు అనుసరణీయమని ఇతర రాష్ట్రాలు భావిస్తు న్నాయని చెప్పారు. ప్రభుత్వం సాధిస్తున్న విజయా లతో భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందనే ఆత్మవిశ్వాసం నేడు తెలంగాణ సమాజంలో తొణికిసలాడుతున్నదని, ఈ విశ్వాసమే ప్రాతిపదికగా బంగారు తెలంగాణ నిర్మాణం ధ్యేయంగా ఈ బడ్జెట్‌కు రూపకల్పన చేసినట్లు చెప్పారు.

పాక్‌లో హ్యాపీ.. భారత్‌లో అన్‌హ్యాపీ!

(మొదటిపేజీ తరువాయి)

దిగజారితే, 2018లో ఏకంగా 11 ర్యాంకులు దిగిపోయింది. మొత్తం 156 దేశాలకు గాను భారతదేశం 133వ స్థానంలో ఉంది. ఐక్యరాజ్య సమితికి చెందిన సుస్థిర అభివృద్ధి పరిష్కారాల నెట్‌వర్క్ ప్రతి సంవ త్సరం ఈ నివేదికను వెల్లడిస్తుంది. ఉగ్రవాద స్థావరంగా పేరొంది, అసలు తలసరి ఆదాయం విషయంలో కూడ అంతంతమాత్రంగానే ఉండే పాకిస్థాన్ మాత్రం గత సంవత్సరం కంటే ఐదు ర్యాంకులు మెరుగుపడి 75వ స్థానంలో ఉంది. ఆర్థిక పరిస్థితి విషయంలో వెనక బడి ఉన్నా, సంతోషంలో మాత్రం పాక్‌తో పాటు ఇంకా బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, శ్రీలంక లాంటి చిన్న చిన్న దేశాలు కూడా మన కంటే ఎంతో మెరుగైన స్థానాలలో ఉన్నాయి. ప్రభుత్వ నియంత్రణలు చాలా అత్యధికస్థాయిలో ఉండే చైనా కూడా భారతదేశం కంటే మిన్నగా కనపడుతోంది.

జీవన ప్రమాణం, సామాజిక మద్దతు, అవినీతి లాంటి పలు అంశాల ఆధారంగా ఒక దేశంలో ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నా రన్నదానికి పాయింట్లు ఇచ్చి ర్యాంకులు నిర్ణయిస్తారు. అలా మొత్తం 156 దేశాలకు సంబంధించి ర్యాంకులు తీస్తే మనం ఎక్కడో అట్టడు గున ఉన్నామన్న మాట. ఎప్పుడో ఏడాది మొత్తమ్మీద కేవలం కొద్ది రోజుల పాటే సూర్యరశ్మిని చూస్తూ.. చలికి గజగజ వణికిపోయే ఫిన్లాండ్ దేశం ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశమని తేలింది. తమ దేశంలో రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ.. ఒక్కటేంటి అన్నీ బాగున్నాయని.. అందుకే తామంతా ఈ దేశంలో చాలా సంతో షకరమైన జీవితాన్ని గడుపుతున్నామని ఫిన్లాండ్ రాజధాని హెల్సింకిలో నివసించే 25 ఏళ్ల సోఫియా హోమ్ తెలిపారు.

భద్రాద్రిలో ఉలికిపాటు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధం ఏంటని అనుకుంటుండగానే.. ఆ ముగ్గురిలో ఒకరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందినవాడనే విషయం ఒక్కసారి బాంబులా పేలింది. వెంటనే ఈ ప్రాంతమంతా ఉలిక్కిప డిందిద. అశ్వాపురం మండలం అమ్మగారిపల్లికి చెందిన మహ్మద్ తౌఫిక్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్లు బయటపడటంతో తీవ్ర చర్చ నడుస్తోంది. ఇతని తండ్రి ఓ కర్మాగారంలో కాంట్రాక్టు ఉద్యోగిగా చేస్తున్నాడు. 20 ఏళ్ల క్రితం చంద్రుగొండలో ఉండేవారు. ఉద్యోగ నిమిత్తం తండ్రి అశ్వాపురం రావడంతో తౌఫిక్ తన చదువును అశ్వాపురంలోనే కొనసాగించాడు. 1 నుంచి 10వ తరగతి వరకు కర్మాగారం స్కూల్‌లో చదివాడు. అనంతరం వనపర్తిలోని పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ డిప్లొమా చదువుతూ రెండో సంవత్సరంలోనే ఆపేశాడు. 2016లో హైదారాబాద్‌లో పనిచేస్తున్నానంటూ ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడు. అప్పటినుంచి 2017 ఆఖరి వరకు మళ్లీ ఇంటివైపు రాలేదన్నారు. 2017లో చెల్లెలి పెళ్లి కోసమని వచ్చాడని.. ఆ తర్వాత హైదరాబాద్‌లో వ్యాపారం చేసుకుంటానని చెప్పి తల్లిదండ్రుల దగ్గర రూ. 30 వేలు తీసుకుని వెళ్లాడని తెలిసింది. తౌఫిక్‌పై గతంలో మణుగూరు సబ్ డివిజన్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌లో దొంగతనం కేసు నమోదైనట్లు తెలుస్తోంది. నేరప్రవృత్తి కలిగి ఉండటంతో తల్లిదండ్రులు అతడిపై ఆగ్రహం వెలి బుచ్చేవారు. తౌఫిక్ ఏనాడూ తన వాళ్లను పట్టించుకున్న పాపాన పోలే దని చుట్టుపక్కల వాళ్లు అంటున్నారు. చంద్రుగొండలోని అతడి నాన మ్మ కూడా.. తౌఫీక్‌తో తమకు సంబంధం లేదని తెగేసి చెప్పింది.

ఉగ్రవాద నీడ జిల్లాపై పడడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఓవైపు మావోయిస్టులు ప్రాబల్యం ఉండడం, ఇటీ వలే వరుస ఘటనలు జరుగుతుండటంతో ఇప్పుడు ఉగ్రవాద నీడ కూడా పడటం ఆందోళనకు గురిచేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం రామాలయం, ఐటీసీ బీపీఎల్, అశ్వాపురం భారజల కర్మాగారం, నవభారత్, కేటీపీఎస్, సింగరేణి కర్మాగారాలు ఉండటంతో ఉగ్రవాదులతో ఏమైనా ముప్పు ఉంటుందేమో అని ప్రజలు భయాందోళనలో ఉన్నారు.

దమ్ముంటే నాపై పోటీ చెయ్

(మొదటిపేజీ తరువాయి)



తప్పుకొంటా. మీ కుటుంబం ఓడిపోతే రాజకీ య సన్యాసం చేస్తారా' అని నిలదీశారు. తమ శాసన సభ్యత్వం రద్దుకు నిరసనగా రెండు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంటకరెడ్డి, సంపత్ కుమార్‌లు గురువారం దీక్ష విరమించారు. గాంధీభవన్‌లోని దీక్షా స్థలికి వచ్చి తెలంగాణ జేఏసీ చైర్మన్ కోదండరామ్ వారిరువురికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. శాసనసభలో నిరసన తెలపటం సర్వసాధారణమని అన్నారు. రైతుల ఆత్మహత్యలు, గిట్టుబాటు ధర, నల్గొండ మున్సిపల్ చైర్మన్ భర్త శ్రీనివాస్ హత్య కేసు వంటి పలు అంశాలపై ఎక్కడ నిలదీస్తామోననే భయంతోనే తమపై కేసీఆర్ వేటు వేయించారని ఆరోపించారు. షోకాజ్ నోటీస్ ఇవ్వకుండా చర్యలు తీసుకోవటం ప్రజాస్వామ్య విలువలకే విఘాతమని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉస్మానియా విద్యార్థుల వద్దకు పోవాలంటే కేసీఆర్‌కు ధైర్యం లేదన్నారు. కేసీఆర్‌కు దమ్ముంటే తనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు. అనంతరం సంపత్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి కల్వకుంట్ల కుటుంబాన్ని తరిమి తరిమి కొట్టాలని కార్యకర్తలకు పిలపునిచ్చారు. టీఆర్‌ఎస్‌ను తెలంగాణలో బొంద పెట్టటమే కార్యకర్తల లక్ష్యం కావాలన్నారు. భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ కల్వకుంట్ల రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నారంటూ కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేసీఆర్ కుటుంబానికి బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అనే విషయాన్ని కూడా ఆ కుటుంబం మరచిపోయిందన్నారు. ఉరిశిక్ష పడ్డవారికి మీ చివరి కోరిక ఏంటని అడుగుతారడని, కనీసం తమ అభిప్రాయం తీసుకోకుండా నిరంకుశత్వంగా తనతో పాటు కోమటిరెడ్డిపై వేటు వేయటం రాచరిక పాలనకు అద్దం పడతోందని అన్నారు. నాడు హరీశ్‌రావు గవర్నర్ నరసింహన్‌ను కొట్టేలా దూసుకెళ్లిన విషయాన్ని ఆయన మరిచిపోయారన్నారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు దెబ్బ తగిలితే మీడియాకు ఎందుకు చూపించటం లేదని ప్రశ్నించారు. పార్టీలో చేరితో కోట్ల రూపాయలు ఇస్తామని టీఆర్‌ఎస్ పాలకులు ఆఫర్లు ఇచ్చారని, తాను పార్టీని విడకపోవటంతో తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సంపత్ ఆరోపించారు. కేసీఆర్‌కు రెడ్డి, దళిత సామాజిక వర్గాలంటే గిట్టవని ఆయన అన్నారు.

భారీ ప్రదర్శన

దీక్ష విరమణ అనంతరం కోమటిరెడ్డి వెంకటరెడ్డి గాంధీ భవన్‌నుంచి బయటకు భారీ ప్రదర్శనగా వచ్చారు. ఈ క్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. కార్యక్రమంలో సీఎల్పీ నేత జానారెడ్డి, షబ్బీర్ అలీ, సురేష్‌రెడ్డి, మల్లు రవి, పద్మావతి, రాంమోహన్‌రెడ్డి, జగ్గారెడ్డి, జీవన్‌రెడ్డి, విజయరామారావు, బలరాం నాయక్, వంశీచందర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, చిన్నారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ కెప్టెన్ పాండురంగారెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




నేడే కేంద్రంపై అవిశ్వాసం

లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు వైసీపీ నోటీసు

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వనందుకు తీర్మానం

జాతీయ, ప్రాంతీయ పార్టీల మద్దతుకు యత్నం

ఆయా పార్టీల నేతలను కలసిన వైసీపీ ఎంపీలు



న్యూఢిల్లీ, మార్చి 15:

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన విషయంలో వైసీపీ మరో ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వంపై శుక్రవారం అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి నోటీసు ఇచ్చారు. గురువారం లోక్‌సభ సెక్రటరి జనరల్‌కు ఆయన నోటీసు అందజేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంటులో హామీ ఇచ్చి నా.. కేంద్ర ప్రభుత్వం మాట తప్పిందని, ఆ హామీనే విస్మరించిందని ఆయన నోటీసులో పేర్కొన్నారు. సభలో తమ అవిశ్వాస తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు. కాగా ఈ నెల 21న కేంద్రంపై అవిశ్వాస తీర్మానాన్ని పెట్టాలని వైసీపీ ముందు భావించింది. తాజా రాజకీయ పరిస్థితులతో పాటు పార్లమెంటు సమావేశాలను కుదించాలని కేంద్రం ఆలోచన చేస్తున్న నేపథ్యంలో శుక్రవారమే అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించింది. తాము పెట్టే తీర్మానానికి మద్దతు ఇవ్వాలని జాతీయ, ప్రాంతీయ పార్టీలకు లేఖలు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ పక్షనేత మల్లికార్జున ఖర్గే, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పక్ష నేత సౌగతా రాయ్, బీజేడీ నేత మెహతాబ్, టీడీపీ నేత తోట నరసింహం, టీఆర్‌ఎస్ లోక్‌సభ నేత జితేందర్ రెడ్డి, ఎన్సీపీ నేత తారిఖ్ అన్వర్, ఆప్ ఎంపీ భగవంత్ మన్ ను వైసీపీ ఎంపీలు కలసి అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ రాసిన లేఖలను అందజేశారు.

మందుపాతరలు.. కేరాఫ్ హిడ్మా!

మొదటిపేజీ తరువాయి

వ్యక్తి అని, అతడే.. మావోయిస్టు అగ్రనేతల్లో ఒకడైన మడావి హిడ్మా అలియాస్ హిడ్మాలు అలియాస్ హిడ్మన్న అలియాస్ సంతోష్‌గా ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. 80 వేల చదరపు కిలోమీటర్ల వైశాల్యం గల దక్షిణ బస్తర్ సుకుమా అడవుల్లోని ప్రతి ప్రాంతం ఇతనికి కొట్టిన పిండి. మంగళవారం నాడు మందుపాతర పేల్చి 12 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను బలితీసుకున్న ఘటనలోనూ హిడ్మా ప్రధాన సూత్రధారి అని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నెల 2న తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు బీజాపూర్ జిల్లా ఊసూర్ పోలీస్టేషన్ పరిధిలోని పూజారి కాంకేర్ అటవీ ప్రాంతంలో జరిగిన పోలీసుల ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోగా, అగ్రనేతలు తప్పించుకొని అబూజ్‌మాడ్ చేరినట్టు భద్రతాదళాలకు సమాచార మందింది. ఆ విషయం తెలిసిన భద్రతా బలగాలు అబూజ్‌మాడ్‌పై దాడికి సిద్ధమవుతున్న తరుణంలోనే, మావోయిస్టులు దాడిచేసి దెబ్బతీసినట్టు భావిస్తున్నారు. ఈ సందర్భంగా దండకారణ్య స్పెషల్ జోనల్ అధికార ప్రతినిధి జగన్ పేర రెండు రోజుల క్రితం ఓ ప్రకటన వెలువడింది. అనారోగ్యంతో ఉన్న మావోయిస్టులను పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపారని, దీనికి తెలంగాణ ప్రభుత్వం, సాయుధ బలగాలపై బదులు తీర్చుకుంటామనేదే ఆ ప్రకటన సారాంశం. మంగళవారం నాటి మావోయిస్టుల మందుపాతర ఘటన ఈ ప్రకటనను బలపరిచినట్లయింది. రోజుల వ్యవధిలోనే దాడికి ప్రతీకార దాడి చేసి దెబ్బతీయడం హిడ్మాకే సాధ్యమని, దండకారణ్యంలో జరిగే ప్రతి మందుపాతర దాడుల వెనుక మడావి హిడ్మా పాత్ర కచ్చితంగా ఉంటుందని నిఘావర్గాల అభిప్రాయం.

ఎవరీ మడావి హిడ్మా?

ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా జగర్‌గుండ పోలీస్టేషన్ పరిధిలోని పువర్తి.. హిడ్మా పుట్టిన ఊరు. ఇతను మురియా గోండ్ ఆదివాసి జాతికి చెందినవాడు. 9 ఏళ్ల వయసు నుంచే నక్సలైట్లతో సంచరిస్తూ గెరిల్లా పోరాట పద్ధతులు, పేలుడు పదార్థాలతో ప్రయోగాలు చేయడం, దారికాచి అనూహ్యదాడి చేయడం, సాయుధ బలగాలను ఏమార్చడం లాంటి వ్యూహాలను ఔపోసన పట్టినట్టు కేంద్ర నిఘావర్గాల వద్ద ఉన్న సమాచారం. మావోయిస్టుల అత్యున్నత సైనిక దళం పిడబ్ల్యూజీఏ (పీపుల్స్ వార్ గెరిల్లా ఆర్మీ). ఇందులో అత్యంత శక్తిమంతమైనదిగా భావించే ఒకటో బెటాలియన్‌కు అత్యంత చిన్న వయస్సున్న హిడ్మా (37) కమాండర్‌గా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. దక్షిణ బస్తర్‌లోని సుకుమా అటవీ ప్రాంతంలో హిడ్మాను ఆదివాసీలు హీరోలా ఆదరిస్తారని అంటారు. అతడున్న ప్రాంతానికి చుట్టూ 50 కిలోమీటర్ల మేర ఆదివాసీలతో తాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న నెట్‌వర్క్ పనిచేస్తూ ఉంటుంది. దండకారణ్యంలో అతడు ఎక్కడికి వెళ్లినా చుట్టూ 50 కిలోమీటర్ల పరిధిలో ఏం జరిగినా వెంటనే తెలుస్తుందని అంటున్నారు. ఆయుధాలకు తగిన విధంగా మార్పుచేర్పులు చేసి.. వాటిని మరింత సులభంగా ఉపయోగించేలా చేయ డంలో కూడా ఇతడు దిట్ట. కదిలే టార్గెట్లను మందుపాతరలతో పేల్చడంలో అందెవేసిన చేయి. మావోయిస్టు దళ సభ్యులు కాకుండా, తాను ఏర్పాటు చేసుకున్న ముగ్గురు కమాండర్లలో ఒక్కొక్కరి వద్ద 50 మంది సభ్యులుంటారని ఇంటెలిజెన్స్ అధికారుల వద్ద ఉన్న సమాచారం. హిడ్మా ఎక్కడికి వెళ్లినా ఈ ముగ్గురి వద్ద పనిచేసే సభ్యులు వెన్నంటి ఉంటారు. ఎక్కడైనా భద్ర తా బలగాలపై మావోయిస్టుల దాడి జరుగుతుంటే వారికి సహా యంగా మరో దళాన్ని భద్ర తాదళాలున్న ప్రాంతానికి మరో వైపు మోహరించి దాడిచేసేలా వ్యూహం పన్నుతాడని చెబుతున్నారు. భద్రతాదళాల బలహీ నతలను పసిగట్టి కోలుకోని విధం గా దాడిచేయడంలో నేర్పరి. స్వతహా గా అక్కడే పుట్టిపెరిగినవాడు కావడంతో అతడిని పట్టుకోవడం భద్రతాదళాలకు సాధ్యం కావడంలేదు.



2010లో దంతెవాడ దాడిలో 76 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను, 2012లో సుకుమా కలెక్టర్ అలెక్స్‌మీనన్ కిడ్నాప్‌లో, 2013లో కాంగ్రెస్ నేతలతో సహా 31మందిని ఊచకోత కోసిన ఘటనలో, 2017లో 37మంది సీఆర్పీఎఫ్ జవాన్లను మందుపాతరలతో హతమార్చిన సంఘటనల్లో మడావి హిడ్మాదే ప్రధాన పాత్ర అని భద్రతాదళాల వద్ద ఉన్న సమాచారం. ఇతని తలకు ప్రభుత్వం కట్టిన వెల రూ. 70 లక్షలు!! హిడ్మా దాడులన్నీ ఇప్పటి వరకు దంతెవాడ, దక్షిణ బస్తర్, సుకుమా, అబూజ్ మాడ్ దండకారణ్యానికే పరిమితమని సమాచారం.



ఇంకెందరు చావాలి?


- **తుపాకీ సంస్కృతిని నిర్మూలించండి**
- **చట్టాల్లో మార్పులు తీసుకురండి**
- **నినదించిన అమెరికా విద్యార్థి లోకం**
- **దేశవ్యాప్తంగా ర్యాలీలు, ప్రదర్శనలు**

వాషింగ్టన్, మార్చి 15: ''అవునూ.. ఇంకెందరు చావాలి. తుపాకీ గుళ్లకు మరికొందరు బలయితేనే స్పందిస్తారా? తక్షణమే గన్ చట్టాల్లో మార్పులు తీసుకురండి'' అంటూ అమెరికా విద్యార్థి లోకం నినదించింది. దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న గన్ కల్చర్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు, ప్రదర్శనలు చేపట్టారు. వాషింగ్టన్‌లోని కేపిటల్ బిల్డింగ్ ఎదుట నిర్వహించిన ఆందోళనలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో స్కూల్స్, కాలేజీలు, బార్లు, పబ్స్‌లో విచక్షణారహితంగా కాల్పులు జరుగుతుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గన్ కల్చర్‌ను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చారు. 50 రాష్ట్రాల్లోని విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. శాంతియుతమైన జీవితాన్ని ఇవ్వాలని విద్యార్థులు గాల్లోకి బెలూన్స్ వదిలారు.



రాకెట్ టెక్నాలజీతో కృత్రిమ గుండె

- **చైనా శాస్త్రవేత్తల ఆవిష్కరణ**



బీజింగ్, మార్చి 15: అత్యాధునిక రాకెట్ సాంకేతికత సాయంతో కృత్రిమ గుండెను అభివృద్ధి చేసినట్లు చైనా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రయోగ దశలో ఉన్న ఈ కృత్రిమ గుండెను మనిషికి అమర్చడం ద్వారా జీవితకాలాన్ని పొడిగించాలన్నదే తమ ధ్యేయమని తెలిపారు. చైనా అకాడమీ ఆఫ్ లాంచ్ వెహికల్ టెక్నాలజీ(కాల్ట్)తో కలిసి టెడా అంతర్జాతీయ హృద్రోగ చికిత్సాలయం పరిశోధకులు దీనిని అభివృద్ధి చేశారు. ఈ గుండెను పలు జంతువులపై ప్రయోగాత్మకంగా పరీక్షించిన తర్వాత ప్రభుత్వ ఆమోదం కోసం పంపించినట్లు వారు తెలిపారు. ఏరోస్పేస్ హార్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ గుండె.. హృదయ స్పందనను తగ్గించడం ద్వారా అవయవాల పనితీరును మరింత మెరుగు పరిచి, జీవిత కాలాన్ని పెంచుతుందని చెప్పారు. అయితే, ప్రస్తుతం చైనా చట్టాల ప్రకారం.. గుండె మార్పిడిలో కృత్రిమ పరికరాలను అమర్చేందుకు అనుమతి లేదు. దీంతో పలువురు బాధితులు తాత్కాలికంగా వైద్య పరికరాలపై ఆధారపడి జీవిస్తూ దాతల కోసం వేచి చూస్తున్నారని వైద్యులు వివరించారు.

చైనీస్ నుంచి ఇంగ్లీష్‌లోకి..

- మైక్రోసాఫ్ట్ కృత్రిమ మేధ తయారీ



వాషింగ్టన్, మార్చి 15: భాషాపరమైన సమస్యలను సులభంగా పరిష్కరించే సరికొత్త వ్యవస్థను మైక్రోసాఫ్ట్ అభివృద్ధి చేసింది. చైనా భాషలోని వార్తలు, కథనాలను ఆంగ్లంలోకి అనువదించే కృత్రిమ మేధస్సును రూపొందించింది. మనుషులకు మల్లే ఈ కృత్రిమ మేధ కూడా ఎలాంటి తప్పుల్లేకుండా(వంద శాతం అక్యూరసీతో) అనువాదాన్ని పూర్తి చేస్తుందని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. ఈ మేరకు ప్రయోగాత్మక పరీక్షలలో చైనా వార్తా కథనాలను ఈ వ్యవస్థతో ఇంగ్లీష్‌లోకి అనువదించి చూడగా.. అందులో ఎలాంటి తప్పులు లేవని తేలిందన్నారు. ఇందుకోసం చైనా, ఇంగ్లీష్ భాషలు రెండింటిలో ప్రవేశమున్న నిపుణులతో ఈ వ్యవస్థను పరీక్షించామని శాస్త్రవేత్తలు వివరించారు. కాగా, వేర్వేరు భాషలలోని విషయాన్ని తప్పుల్లేకుండా ఇంగ్లీష్‌లోకి తర్జుమా చేయగల వ్యవస్థ కోసం చాలా కాలంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో మనుషులకు మల్లే అనువాదం చేయగల కృత్రిమ పరికరాలు అందుబాటులోకి రాలేదని నిపుణులు వివరించారు. మరోవైపు, ఈ ఆవిష్కర ణపై మరిన్ని ప్రయోగాత్మక పరీక్షలు జరపాల్సి ఉందని, వాటిలో వచ్చే ఫలితాలతోనే ఈ కృత్రిమ వ్యవస్థకు గుర్తింపు లభిస్తుందని వారు తెలిపారు.

ముర్రా గేదెకు.. అస్సామీ దూడ

- **దేశంలోనే తొలి అస్సామీ క్లోన్**



హిస్సార్(హరియాణ), మార్చి 15: దేశంలోనే తొలిసారిగా ముర్రా జాతి గేదె ఓ అస్సామీ జాతి దూడకు జన్మనిచ్చింది.. హిస్సార్‌లోని హైటెక్ సచ్ డైరీ ఫార్మ్ సమీపంలోని పచ్చిక బయళ్లలో ఈ క్లోన్ దూడకు జన్మనిచ్చిందని గేదెల కేంద్రీయ పరిశోధన సంస్థ(సీఐఆర్‌బీ) పరిశోధకులు వెల్లడించారు. ఫార్మ్‌లో కాకుండా ఆరుబయట పుట్టిన తొలి క్లోన్ దూడ కూడా ఇదేనని వారు తెలిపారు. హైటెక్ సచ్ డైరీలోని క్లోనింగ్ లేబరేటరీలో ఈ పరిశోధన కొనసాగింది. ఈ సందర్భంగా ఐసీఏఆర్-సీఐఆర్‌బీ డైరెక్టర్ ఇంద్రజీత్ సింగ్ మాట్లాడుతూ.. ఈశాన్య ప్రాంతాలలో ఎక్కువగా కనిపించే అస్సామీ దున్నపోతులు బలిష్టంగా ఉంటాయని చెప్పారు. స్థానికంగా వ్యవసాయ పనులకు వీటిని ఉపయోగిస్తారని వివరించారు. క్లోనింగ్ ప్రకియలో పుట్టిన దూడల్లో ఇది రెండో దూడ అని వివరించారు. పుట్టినపుడు ఇది 54.2 కిలోల బరువుతో పూర్తి ఆరోగ్యంగా ఉందని తెలిపారు. కాగా, ఈ క్లోనింగ్ ప్రకియ కోసం గువహటిలోని వెటర్నరీ కాలేజీలో భద్రపరిచిన సెమెన్‌ను ప్రత్యేకంగా విమానంలో తీసుకొచ్చామని ఇంద్రజీత్ సింగ్ తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం విజయవంతమై తొలి అస్సామీ క్లోన్ పుట్టడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఎలా పడితే అలా రాసేస్తారా?

- **రాత్రికి రాత్రే పోప్ అయిపోదామనుకుంటారా**
- **మీ ఊహల్లో ఉంటే రాసేసి.. చక్కా వెళ్లిపోతారా**
- **పత్రికా స్వేచ్ఛ మాట సరే.. పరిమితులుంటాయి**
- **'ద వైర్' కేసులో సుప్రీం సీజే జస్టిస్ దీపక్ మిశ్రా**



న్యూఢిల్లీ, మార్చి 15: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ఎలక్ట్రానిక్ మీడియా మీద తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ద వైర్' అనే వెబ్‌సైట్‌లో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కొడుకు జయ్ షా మీద రాసిన కథనంపై దాఖలైన పరువునష్టం దావా విచారణ సందర్భంగా సీజే తీవ్రంగా వ్యాఖ్యానించారు. ''మేం పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తాం గానీ వాళ్లు కూడా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. తాము రాత్రికి రాత్రే పోప్‌లు అయిపోతామని ఎలక్ట్రానిక్ మీడియా ఆలోచించకూడదు'' అని ఆయన అన్నారు. తాను కేవలం ఈ కేసు గురించి మాత్రమే కాదని.. సర్వసాధారణంగా ఇలాగే జరుగుతోందని చెబుతున్నానని తెలిపారు. కేసు విచారణను ఏప్రిల్ 12వ తేదీకి వాయిదా వేశారు. ఈ సందర్భంగా టీవీ మీడియా గురించి ఆయన ఘాటు విమర్శలు చేశారు.

''ఎలక్ట్రానిక్ మీడియాలో ఉన్న చాలామంది తాము ఏమైనా రాయొచ్చని అనుకుంటారు. మీ ఊహలకు సరిపోయేది ఏదైనా మీరు రాసేసి వెళ్లిపోతారా? ఉన్నత స్థానంలో ఉన్నామని ఏమైనా రాసేస్తారా? జర్నలిజం అంటే ఇదేనా?'' అని జస్టిస్ మిశ్రా ప్రశ్నించారు. మన దేశంలో పత్రికాస్వేచ్ఛ ఉందని చెబుతూ.. ''ఎవరిగురించైనా ఏదైనా ఎలా మాట్లాడతారు? దేనికైనా పరిమితులుంటాయి. మీరు ఎవరిమీదైనా మీకు నచ్చినట్లు ఎలా వ్యాఖ్యానిస్తారు?'' అంటూ నిలదీశారు. జయ్ షా తమపై దాఖలు చేసిన పరువునష్టం దావాను రద్దుచేయాలంటూ ద వైర్ సంస్థ వేసిన పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు జనవరిలో కొట్టేసింది. ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే ద వైర్ రిపోర్టర్, ఎడిటర్ల మీద కేసు ఉన్నట్లు తెలుస్తోందని అప్పట్లో చెప్పింది. ఆ కథనంలో మరీ దారుణంగా జయ్ సంస్థ టర్నోవర్‌ను ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ఎన్నికతో పోల్చిచూపించారని వ్యాఖ్యానించింది. బీజేపీ 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాతే జయ్ షా కంపెనీ టర్నోవర్ గణనీయంగా పెరిగిందని ద వైర్ తన కథనంలో పేర్కొంది. తమ కథనానికి సాక్ష్యాధారాలు ఉన్నాయని, అందువల్ల తమపై నేరపూరిత పరువునష్టం దావా వేయకూడదని వాదించింది.

ఈడీకి అరెస్టు అధికారంపై సుప్రీంలో విచారణ

- **కార్తీని 26 వరకు అరెస్టు చేయొద్దని ఈడీకి ఆదేశాలు**

న్యూఢిల్లీ, మార్చి 15: మనీలాండరింగ్ కేసులో నిందితులను అరెస్టు చేసే అధికారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి ఉందా? లేదా? అనే అంశంపై దాఖలైన కేసులన్నింటినీ విచారణకు కోసం తన పరిధిలోకి సుప్రీంకోర్టు బదిలీ చేసుకుంది. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కార్తీ చిదంబరంను అరెస్టు చేయకుండా ఉండేలా ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిని సవాలు చేస్తూ సీబీఐ, ఈడీ వేర్వేరుగా సుప్రీంలో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ సందర్భంగా ఈడీ న్యాయ పరిధిని కుంచించివేసేందుకు ప్రయత్నాలు జరిగాయని ఈ సందర్భంగా ఈడీ, సీబీఐ పేర్కొన్నాయి. వాదనలు విన్న సుప్రీంకోర్టు ఈడీ న్యాయపరిధికి సంబంధించిన కేసులన్నీ తన పరిధిలోకి బదిలీ చేసుకుంది. విచారణ జరిపి ఆదేశాలు వెల్లడిస్తామని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కాగా, ఎన్‌ఎన్‌ఎక్స్ మీడియా కేసులో కార్తీ చిదంబరంను ఈ నెల 26 వరకు అరెస్టు చేయకుండా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

శరద్‌పవార్‌తో రాహుల్ భేటీ!


- **యునైటెడ్ ఫ్రంట్‌పై చర్చలు!**

న్యూఢిల్లీ, మార్చి 15: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ లోక్‌సభ సాధారణ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. బుధవారం రాత్రి ఆయన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) చీఫ్ శరద్ పవార్‌తో సమావేశమయ్యారు. మహారాష్ట్రలో కాంగ్రెస్-ఎన్‌సీపీ కూటమిని బలోపేతం చేయడంపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా బీజేపీ వ్యతిరేక కూటమిని ఏర్పాటు చేయడంపై వీరు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. శరద్ పవార్ కుమార్తె సుప్రియ సూలే న్యూఢిల్లీ నివాసంలో ఈ సమావేశం జరిగిందని, ఆమె కూడా చర్చల్లో పాల్గొన్నారని తెలు స్తోంది. పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి మమత బెనర్జీని రాహుల్ గాంధీ త్వరలో న్యూఢిల్లీలో కలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం ఈ నెలా ఖరులో జరగవచ్చునని చెప్తున్నారు. శరద్ పవా ర్ కూడా మమత బెనర్జీతో చర్చలు జరిపే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-బీఎస్పీ జట్టుకట్టడంతో బీజేపీ మట్టికర వడం తదితర పరిణామాల నేపథ్యంలో వీరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా బీజేపీకి వ్యతిరేకంగా యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటుకు ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిసింది.



మోదీ అహంకారం వల్లే ఓటమి


ప్రధానిపై శత్రుఘ్న సిన్హా నిప్పులు



న్యూఢిల్లీ, మార్చి 15: ఉత్తరప్రదేశ్, బిహార్ ఉప ఎన్నికల్లో బీజేపీ పరాభవం నేపథ్యంలో సొంత పార్టీపై ఎంపీ శత్రుఘ్న సిన్హా మరోసారి నిప్పులు చెరిగారు. ప్రధాని నరేంద్రమోదీ అహంకారం, అతి విశ్వాసం, షార్ట్‌టెంపర్ కారణంగానే ఈ పరాభవం ఎదురైందని ట్విటర్‌లో పేర్కొన్నారు. ''ప్రజాస్వామ్య రాజకీయాల్లో అహంకారం, అవిశ్వాసం, అతి కోపం పతనానికి దారితీస్తాయని నేను పదేపదే చెప్తూ వస్తున్నాను. ఇవి ట్రంప్ లేదా, మిత్రోం లేదా, ప్రతిపక్ష నాయకులు ఎవరి నుంచి వచ్చినా ప్రమాదమే'' అని పేర్కొన్నారు. మిత్రోం అంటూ ప్రధాని మోదీ ప్రసంగించే సంగతి తెలిసిందే. అదేవిధంగా బీజేపీకి రానున్నది కష్టకాలమేనని, ఇప్పటికైనా బీజేపీ అధినాయకత్వం (ప్రధాని మోదీ, అమిత్‌షా) మేలుకోవాలని హితవు పలికారు. ''మన వ్యక్తులు, శ్రేణులు త్వరగా సీటు బెల్టు సర్దుకోవాల్సిన అవసరాన్ని యూపీ, బిహార్ ఫలితాలు చాటుతున్నాయి. రానున్నది సంక్షోభకాలం. ఈ సంక్షోభం నుంచి ఎంత త్వరగా బయటపడితే.. అంత మంచిదని కోరుకుంటూ మనం ప్రార్థించాలి. ఈ ఫలితాలు మన భవిష్యత్తు గురించి సంకేతాలు ఇస్తున్నాయి. వీటిని తేలికగా తీసుకోకూడదు'' అని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ పనైపోయింది

- **2019లో సమీకరణాలు మారక తప్పవు: శివసేన**



ముంబై, మార్చి 15: ఉత్తర ప్రదేశ్ ఉప ఎన్నికల ఫలితాలతో బీజేపీ పనైపోయందని నిరూపితమయ్యిందని ఎన్‌డీఏ ఒకప్పటి మిత్రపక్షమైన శివసేన ఆరోపించారు. ఈ ఫలితాలు ప్రతిపక్షాలకు మంచి బలాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చాయని పేర్కొంది. అయితే.. బీజేపీని గట్టిగా ఎదు ర్కొనే నాయకత్వం ప్రతిపక్షాల్లో లేకపోవడం ఆలోచిం చదగిన అంశమని శివసేన అధికార పత్రిక 'సామ్నా' సంపాదకీయంలో పేర్కొంది. వచ్చే ఎన్నికల్లో మోదీ ప్రతిష్ఠపై రాహుల్ గాంధీ పోరాడాల్సి ఉంటుందని సూచించింది. ఇప్పటివరకు ప్రజలు బీజేపీపై భ్రమల్లో ఉన్నారని, కానీ ఉప ఎన్నికల ఫలితాలతో వారు ఆ భ్రమల నుంచి బయటకు వచ్చారని అభిప్రాయ పడింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2019లో రాజకీయ సమీకరణాల్లో పూర్తి మార్పుల తప్పవని పేర్కొంది. ''మేం మోసపోయామని ప్రజలు గుర్తిస్తు న్నారు. ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని మరింతగా ప్రజ్వలింపజేసేందుకు విపక్షాలకు సరైన నాయకత్వం కావాలి'' అని సూచించింది.

దేశం విడిచివెళ్లకుండా 91 మందిపై నిషేధం

- **యోచిస్తున్న కేంద్ర ప్రభుత్వం**
- **జాబితా రూపొందించిన అధికారులు**

న్యూఢిల్లీ, మార్చి 15:బ్యాంకులను మోసం చేసి విదేశాలకు పారిపోతున్న సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖ ముందు జాగ్రత్త చర్యలు ప్రారంభించింది. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని, తిరిగి చెల్లించకుండా ఎగ్గొడుతున్నవారిలో 91 మంది కీలక వ్యక్తుల పేర్లతో ఓ జాబితాను రూపొందించింది. వీరిని విదేశాలకు వెళ్ళకుండా నిలువరించేందుకు సన్నాహాలు చేస్తోంది. వీరి కంపెనీలు ప్రస్తుతం డిఫాల్టర్స్ జాబితాలో ఉన్నాయి. ఉద్దేశపూర్వకంగా రుణాలను ఎగవేసిన కంపెనీల డైరెక్టర్లు, యజమానుల పేర్లతో ఈ జాబితాను రూపొందించినట్లు విశ్వసనీయ సమాచారం.


రుణాలను తిరిగి చెల్లించగలిగిన స్తోమత ఉన్నప్పటికీ వీరు చెల్లించడం లేదని కేంద్ర ఆర్థిక శాఖ గుర్తించినట్లు తెలుస్తోంది. రూ.50 కోట్లు, అంతకన్నా ఎక్కువ మొత్తం రుణాలను తీసుకున్న దరఖాస్తుదారులు, వారికి హామీదారుల పాస్‌పోర్టు వివరాలను సమర్పించాలని బ్యాంకులను కోరినట్లు సమాచారం. కాగా, విదేశాల్లో రుణ పరపతి కల్పిస్తున్న లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్‌ను ఇటీవలే భారతీయ రిజర్వు బ్యాంకు నిషేధించిన సంగతి తెలిసిందే.

పీఎన్‌బీలో మరో కుంభకోణం

- 9 కోట్ల మేర కుచ్చుటోపీ
- కేసు నమోదు చేసిన సీబీఐ

న్యూఢిల్లీ, మార్చి 15: ఎంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)లో మరో మోసం బయటపడింది. ఇటీవల పీఎన్‌బీ ముంబై బ్రాంచ్‌లో వెలుగుచూసిన రూ.12వేల కోట్ల భారీ కుంభకోణం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తాజాగా ఇదే బ్యాంకులో మరో మోసం వెలుగులోకి వచ్చింది. ఈ బ్యాంకులో దాదాపు రూ. 9 కోట్ల (91 మిలియన్ల రూపాయలు) మేర మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు సమాచారం. చాంద్రీ పేపర్, అల్లయిడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు చెందిన కొందరు అధికారులు ఈ బ్రాంచ్‌లో రూ. 9కోట్ల మోసపూరిత లావాదేవీలకు పాల్పడినట్లు వెల్లడైంది. దీంతో ఆయా సంస్థలపై సీబీఐ కేసు నమోదు చేసింది. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న పీఎన్‌బీ రిటైర్డ్ ఉద్యోగి గోకుల్‌నాథ్ శెట్టి, సింగిల్ విండో ఆపరేటర్ మనోజ్ కరత్‌లపై తాజా కుంభకోణానికి సంబంధించి సీబీఐ కేసు నమోదు చేసింది. ఇందులో ఆయా కంపెనీలు, వాటి డైరెక్టర్ల పేర్లను కూడా పొందుపరిచింది.

మరో రెండు బిల్లులు ఓకే



- **లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదం**
- **9వ రోజూ ఉభయ సభల్లో ఎంపీల నిరసన**

న్యూఢిల్లీ, మార్చి 15: లోక్‌సభలో విపక్షాల నిరసనలు, నినాదాల మధ్యే మరో రెండు బిల్లులకు ఆమోదం లభించింది. గ్రాట్యుటీ చెల్లింపు సవరణ బిల్లు, నిర్ధారిత సాయం సవరణ బిల్లులను మూజువాణి ఓటుతో ఆమోదించారు. వరుసగా తొమ్మిదో రోజు గురువారం కూడా పార్లమెంటు ఉభయ సభల కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడింది. విపక్ష ఎంపీల నినాదాలతో దద్దరిల్లాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే ఆయా అంశాలపై టీడీపీ, టీఆర్‌ఎస్, కాంగ్రెస్, టీఎంసీ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. సభ్యులు శాంతించకపోవడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను తొలుత మధ్యాహ్నానికి, తర్వాత శుక్రవారానికి వాయిదా వేశారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు టీడీపీ, వైసీపీ, తెలంగాణలో రిజర్వేషన్ల కోటా పెంపునకు టీఆర్ఎస్, కావేరి నీటి యాజమాన్య బోర్డు ఏర్పాటుకు అన్నాడీఎంకే డిమాండ్ చేశాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై కాంగ్రెస్, టీఎంసీ ఎంపీలు ఆందోళన చేశారు. కాగా ఓ వైపు నిరసనలు కొనసాగుతుండగానే కేంద్రం రెండు బిల్లులకు ఆమోద ముద్ర వేయించుకుంది. ఈ బిల్లులపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ నేత జ్యోతిరాధిత్య సింధియా వెల్ లోకి దూసుకెళ్లి డిమాండ్ చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్, కార్మిక శాఖ మంత్రి సంతోష్ గంగ్వార్ మాట్లాడుతూ.. కీలకమైన ఈ బిల్లులను ఆమోదించాల్సిన అవశ్యకత ఉందన్నారు. కాగా బుధవారం లోక్‌సభలో ఎలాంటి చర్చ జరగకుండానే ఆర్థిక బిల్లు, వినియోధికార బిల్లులను మూజువాణి ఓటుతో ఆమోదించిన సంగతి తెలిసిందే.

అశాస్త్రీయంగా రాష్ట్ర విభజన: సుజనా

రాజ్యసభలో కూడా సభ్యులు ఆందోళన కొనసాగించారు. ఆయా అంశాలపై టీడీపీ, అన్నాడీఎంకే, కాంగ్రెస్, టీఎం సీ సభ్యులు నిరసన చేపట్టారు. సభలో గందరగోళం ఏర్పడటంతో మధ్యాహ్నం 3 గంటల లోపు రెండుసార్లు వాయిదా పడింది. తనకు కేంద్ర మంత్రిగా పనిచేయడానికి అవకాశమిచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఎంపీ సుజనా చౌదరి కృతజ్ఞతలు తెలిపారు. 2014లో అన్యాయంగా, అశాస్త్రీయంగా రాష్ట్రాన్ని విభజించారని రాజ్యసభలో టీడీపీ ఎంపీ సుజనా చౌదరి అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. ఎన్డీయే ప్రభుత్వం నుంచి మిత్ర పక్షం టీడీపీ వైదొలిగిన సంగతి తెలిసిందే. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయనందుకు టీడీపీకి చెందిన కేంద్ర మంత్రులు అశోక్ గజపతి రాజు, సుజనా చౌదరి రాజీనామా చేశారు.

దినకరన్ కొత్త రాజకీయ పార్టీ

- **'అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం'**
- **జయలలిత ఫొటోతోనే పార్టీ జెండా**
- **'రెండాకుల' గుర్తు కోసం పోరాటం**
- **అన్ని ఎన్నికల్లో గెలుస్తాం: దినకరన్**



మదురై, మార్చి 15: తమిళనాట మరో కొత్త పార్టీ ఆవిర్భవించింది. అన్నాడీఎంకే బహిష్కృత నేత, ఆర్కే నగర్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ నేతృత్వంలో మరో 'రాజకీయ' జెండా పుట్టుకొచ్చింది. దివంగత ముఖ్యమంత్రి జయలలిత పేరు, రూపం... రెండింటినీ మేళవించి దినకరన్ ప్రజల ముందుకొచ్చారు. 'అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం' పేరుతో కొత్త పార్టీ ప్రారంభించారు. గురువారం మదురైలో జరిగిన సభలో పార్టీ పేరుతో పాటు జెండాను కూడా ఆవిష్కరించారు. నలుపు, తెలుపు, ఎరుపు రంగుల్లో ఉన్న జెండాపై 'అమ్మ' ఫొటోను ముద్రించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు దినకరన్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్నికల్లో తమ పార్టీ తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అన్నాడీఎంకే పార్టీ చిహ్నమైన 'రెండాకుల గుర్తు' కోసం తాము పోరాడుతామని, అప్పటిదాకా ఎన్నికల సంఘం కేటాయించిన కుక్కర్ గుర్తుతోనే కొనసాగుతామని తెలిపారు. జయ మరణం తర్వాత జరిగిన రాజకీయ మార్పులనూ ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. పార్టీ పేరు లేకుండా స్వతంత్రంగా పోరాడుతున్న తనతో ఉంటూ ఇన్నాళ్లు కష్టాలు ఎదుర్కొన్నవారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. అమ్మ మృతితో తమిళనాట రాజకీయ సంక్షోభం తలెత్తడం.. అన్నాడీఎంకే రెండుగా చీలిపోవడం, శశికళ జైలుకెళ్లడం.. కొన్నాళ్ల పోరు తర్వాత పన్నీర్ సెల్వం, పళనిస్వామి కలిసిపోయి.. దినకరన్‌ను బహిష్కరించడం తెలిసిందే. ఆ తర్వాత ఇటీవల జరిగిన ఆర్కే నగర్ ఉప ఎన్నికలో దినకరన్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందారు. దీంతో కొత్త ఉత్తేజంతో తనకు మద్దతిచ్చే నాయకులందరినీ కూడగట్టి బుధవారం పార్టీ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా తనకు ఉన్న బలాన్ని దినకరన్ ప్రదర్శించారు. మాజీ మంత్రులు వి.సెంథిల్ బాలాజీ, పి.పళనియప్పన్, సీనియర్ నేతలు అంబజగన్, పి.వెట్రివేల్, తంగ తమిళ సెల్వన్ తదితరులు పార్టీ ప్రకటన సభకు హాజరయ్యారు. ఈ సభకు దాదాపు 50 వేల మందికి పైగా జనం వచ్చారు. సభా వేదిక వద్ద అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్, జయలలిత, శశికళ, ద్రవిడ ఉద్యమకర్త అన్నాదురై సహా దినకరన్‌ల భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో అభిమానులు దినకరన్ 'కాబోయే సీఎం' అంటూ నినాదాలు చేశారు.



చిరు అతిథిగా...

రామ్‌చరణ్ , సమంత హీరో హీరోయిన్లుగా నటిస్తోన్న చిత్రం 'రంగస్థలం'. సుకుమార్ దర్శకుడు., మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్; సి.వి.ఎం(మోహన్)ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మార్చి 30న సినిమా విడుదలవుతుంది. వైజాగ్ ఆర్.కె.బీచ్‌లో మార్చి 18న ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించబోతున్నారు. సినిమాకు సంబంధించిన ఆడియో ఆల్‌రెడీ మార్కెట్లోకి విడుదలైంది. ఈ సందర్భంగా నవీన్ ఎర్నేని మాట్లాడుతూ ''రంగస్థలం' సినిమాకు సంబంధించిన ఆడియో జ్యూక్ బాక్స్ మార్కెట్లోకి విడుదలైంది. ఆల్‌రెడీ విడుదలైన మూడు పాటలకు చాలా మంచి స్పందన వచ్చింది. ఈ నెల 18న వైజాగ్ ఆర్.కె.బీచ్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను భారీగా నిర్వహిస్తున్నాం. మెగాస్టార్ చిరంజీవిగారు ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. సినిమా విషయానికి వస్తే పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం'' అన్నారు. సుకుమార్ మాట్లాడుతూ ''సినిమాలో ఆరు పాటలున్నాయి. ఐదు పాటలను జ్యూక్ బాక్స్‌లో వింటే ఆరో సాంగ్ సర్‌ప్రైజ్. దీన్ని చంద్రబోస్‌గారు పాడారు.1980 బ్యాక్‌డ్రాప్‌లో సినిమా సాగుతుంది. ఆ కాలం నుండి వచ్చిన వ్యక్తులను సినిమా అలరిస్తుంది. మిస్ అయిన జనరేషన్‌ను ఈ జనరేషన్‌వారు ఈ సినిమాలో చూడొచ్చు. మంచి టెక్నీషియన్స్ దొరకడం వల్ల నా వర్క్ సులభమైంది. ముఖ్యంగా ఆర్ట్ డైరెక్టర్ రామకృష్ణ, మోనికగారు 1980 బ్యాక్‌డ్రాప్‌లో సెట్‌ను చక్కగా చేశారు. నేను పెద్దగా కష్టపడలేదు. ఈ సినిమాకు సంబంధించి పాట రాసిన తర్వాతే ట్యూన్స్ కంపోజ్ చేశారు. సినిమాలో ఆరు పాటలకు ఇదే పద్ధతిని ఫాలో అయ్యాం. గ్రామీణ నేపథ్యంలో సినిమా చేయాలని ఎప్పటి నుండో అనుకుంటున్నాను. ఇప్పటికీ కుదిరింది. సినిమాలో 'రంగమ్మ మంగమ్మ..' పాటలో ఉపయోగించిన గొల్లబామ అనే పదం ఓ కీటకానికి సంబంధించింది. ఎవరినో.. ఏదో అనాలనో చేయలేదు'' అన్నారు. ఆర్ట్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ''నాకు 'రంగస్థలం' సినిమా చేసే అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు.. నాకు సహకారం అందించిన రామ్‌చరణ్‌కు థాంక్స్. రేపు సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు థ్రిల్ అవుతారు. నేను సిటీలోనే పుట్టి పెరగడం వల్ల నాకు విలేజ్ కల్చర్ తెలియదు. అయినా నేను రీసెర్చ్ చేసి సెట్ వేశాను. నా కెరీర్‌లో ఇదొక బెస్ట్ మూవీగా నిలిచిపోతుంది'' అన్నారు. చంద్రబోస్ మాట్లాడుతూ ''మంచి సాహిత్యానికి, మంచి సంగీతం కుదిరింది. మంచి సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్. పాటలు చాలా బావున్నాయని అందరూ అప్రీసియేట్ చేస్తున్నారు'' అన్నారు.

రవితేజ అడ్వెంచర్



రవితేజ ఇప్పుడు రెండు సినిమాలతో తీరిక లేకుండా ఉన్నారు. కల్యాణ్ కృష్ణ దర్శకత్వంలో సినిమా (ఈ సినిమాకు 'నేల టికెట్' అనే టైటిల్ వినపడుతుంది) షూటింగ్ జరుపుకుంటోంది. అలాగే శ్రీనువైట్ల దర్శకత్వంలో రవితేజ 'అమర్ అక్బర్ ఆంటోని' సినిమా చేయబోతున్నారు. ఈ రెండు సినిమాలు పూర్తి కాగానే వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో రవితేజ సినిమా చేసే అవకాశాలున్నాయని అంటున్నాయి సినీ వర్గాలు. రామ్ తాళ్లూరి నిర్మాణంలో ఈ సినిమా రూపొందనుంది. ఇదొక అడ్వెంచర్ మూవీగా తెరకెక్కనుంది. 'టైగర్, ఎక్కడికి పోతావు చిన్నవాడా, ఒక్క క్షణం' వంటి డిఫరెంట్ చిత్రాల దర్శకుడు వి.ఐ.ఆనంద్... మరోసారి విలక్షణమైన కాన్సెప్ట్‌తో రవితేజ సినిమా చేస్తున్నారట. అయితే శ్రీనువైట్ల సినిమా పూర్తయిన తర్వాతే ఈ సినిమా స్టార్ట్ అవుతుందం టున్నారు మరి.


వి.ఐ.ఆనంద్

డాన్స్ ప్రధానంగా..

ప్రభుదేవా, ఐశ్వర్య రాజేష్ ప్రధాన తారాగణంగా రూపొందుతోన్న చిత్రం 'లక్ష్మీ'. విజయ్ దర్శకుడు. ప్రతీక్ చక్రవర్తి, శృతి నల్లప్ప, ఆర్.రవీంద్రన్ నిర్మాతలు. గురువారం జరిగిన ఈ సినిమా ప్రాతికేయుల సమావేశంలో ప్రభుదేవా మాట్లాడుతూ ''దర్శకుడు విజయ్‌తో 'అభినేత్రి' సినిమా చేయడం గొప్ప అనుభవం. తర్వాత మా కాంబినేషన్‌లో 'అభినేత్రి 2' సినిమా చేద్దామని కూడా అనుకున్నాం. ఆ సమయంలో ఈ స్క్రిప్ట్ విన్నాను. చాలా బాగా నచ్చింది. ఇలాంటి సినిమాకు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చాలా ముఖ్యం. శామ్ అద్భుతమైన సంగీతాన్ని అందించాడు. డాన్స్ బేస్‌డ్ మూవీస్ వచ్చి చాలా రోజులయ్యాయి. ఈ సినిమాలో నటించిన పిల్లలందరూ చాలా బాగా చేశారు. నేను అన్నట్లుగానే సినిమా ఓ రేంజ్‌లో ఉంటుంది. ఇండియా మొత్తం నుండి పిల్లలను ఎంపిక చేశారు. ఈ పిల్లలతో చేయడం మంచి ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చింది'' అన్నారు. దర్శకుడు ఎ.ఎల్.విజయ్ మాట్లాడుతూ ''ప్రభుదేవా డాన్సింగ్ లెజెండ్. ఆయనతో ఎప్పుడు సినిమా చేసినా ఓ లెర్నింగ్ ఎక్స్‌పీరియెన్స్. మంచి స్క్రిప్ట్ సెన్స్ ఉన్న వ్యక్తి ప్రభుదేవాగారు. నిర్మాతలు శృతి, ప్రతీక్‌లు చక్కగా సినిమా చేశారు'' అన్నారు. శృతి నల్లప్ప మాట్లాడుతూ ''ప్రభుదేవాగారితో సినిమా చేయడం నా కల. ఈ సినిమాతో అది నేరవేరినందుకు ఆనందంగా ఉంది'' అన్నారు. ప్రతీక్ మాట్లాడుతూ ''మేం ప్రభుదేవా గారితో సినిమా చేయాలని ముందుగా ఏమీ ప్లాన్ చేసుకోలేదు. ఏదో అలా జరిగింది. తెలుగులో మా బ్యానర్‌లో వస్తున్న సినిమా ఇది. భవిష్యత్‌లో తెలుగు, తమిళంలో మరిన్ని సినిమాలు చేస్తాం'' అన్నారు.


ప్రభుదేవా


మాధవన్, విజయ్ సేతుపతి

బాలీవుడ్‌లో రీమేక్

మాధవన్, విజయ్ సేతుపతి ప్రధానపాత్రలో తమిళంలో తెరకెక్కిన 'విక్రమ్ వేదా' కోలీవుడ్‌లో పెద్ద విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో ఈ మూవీని పలు భాషల్లో రీమేక్ చేసేందుకు సన్నాహాలు కూడా జరిగాయి. అందులో భాగంగా మొదటగా హిందీలో ఈ చిత్రం రీమేక్ కానుంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. రాజ్ కుమార్ రావు.. విక్రమ్ పాత్రలో కనిపించనుండగా, నవాజుద్దీన్ సిద్ధిఖీ ..వేదా పాత్రలో కనిపించనున్నాడు. మాతృకలో ఈ చిత్రాన్ని తెరకెక్కించిన పుష్కర్, గాయత్రినే హిందీ రీమేక్‌కు కూడా దర్శకత్వం వహించనున్నారు. ఇక రిలియన్స్ ఎంటర్‌టైన్‌మెంట్, ప్లాన్ సీ స్టుడియో, వై నాట్ స్టుడియో సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. మరి తమిళ్‌లో రికార్డులు క్రియేట్ చేసిన ఈ చిత్రం బాలీవుడ్ ప్రేక్షకులను ఏ మాత్రం మెప్పిస్తుందో చూడాలి.


రానా

హారర్ చిత్రంలో...

'బాహుబలి'లో భల్లాలదేవగా అందరినీ మెప్పించిన నటుడు రానా దగ్గుబాటి. ఇప్పుడు చేస్తున్న సినిమాలన్నింటిలో రానా ఏదో ఒక ప్రత్యేకతను చూపించే ప్రయత్నం చేస్తున్నారు. రెండవ ప్రపంచ యుద్ధ నేపథ్యంలో సాగే ప్రేమకథగా '1945', అలాగే మలయాళ చిత్రం 'రాజా మార్తాండ వర్మ'తో పాటు.. ప్రభు సాల్మన్ దర్శకత్వంలో 'హథీ మేరే సాథీ' సినిమాల్లో నటిస్తున్నారు. అలాగే 'దొంగాట' ఫేమ్ వంశీకృష్ణ దర్శకత్వంలో స్టూవర్టుపురం దొంగ టైగర్ నాగేశ్వరరావుపై తెరకెక్కబోయే సినిమా చేయనున్నారు. ఇవన్నీ కాకుండా.. రానా ఇప్పుడు ఓ హారర్ చిత్రంలో నటించడానికి ఆసక్తిని చూపిస్తున్నారని తెలుస్తోంది. వివరాల్లోకెళ్తే.. సిద్దార్థ్, ఆండ్రియా నటించిన హారర్ చిత్రం 'గృహం'. ఈ సినిమాను మిలింద్ రావ్ అనే దర్శకుడు తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఈ యువ దర్శకుడు ఇప్పుడు రానాతో ఓ హారర్ సినిమా చేయబోతున్నారట. ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నాయని ఫిలింనగర్ వర్గాల టాక్.


అనుష్క

బరువు తగ్గే పనిలో..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ జేజెమ్మ అనుష్క టైటిల్ పాత్రలో నటించిన 'భాగమతి' మంచి విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ఆమెకు హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలు క్యూ కడుతున్నాయి. అయితే అనుష్క... గౌతమ్ మీనన్ దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా చేయనుంది. ఈ సినిమా కోసం బరువు తగ్గాలని గౌతమ్ మీనన్ సూచించడంతో అనుష్క బరువు తగ్గే పనిలో ఉంది. తెలుగులో 'ఘర్షణ, ఏ మాయ చేసావె, సాహసం శ్వాసగా' వంటి సినిమాలను డైరెక్ట్ చేశారు. అలాగే ఆయన తమిళంలో చేసిన పలు చిత్రాలు తెలుగులోకి అనువాదమయ్యాయి.


జగపతిబాబు

ఎన్టీఆర్‌తో మరోసారి!

హీరో నుండి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారిన జగపతిబాబు వరుస సినిమాలతో బిజీగా మారారు. విలన్‌గా, తండ్రిగా ఇలా డిఫరెంట్ క్యారెక్టర్స్‌లో ఆకట్టుకుంటున్నారు జగ్గుబాయ్. తాజా సమాచారం ప్రకారం ఈ సీనియర్ నటుడు ఎన్టీఆర్ చిత్రంలో నెగిటివ్ టచ్ ఉన్న పాత్రలో కనపడనున్నారని తెలిసింది. గతంలో ఎన్టీఆర్, జగపతి బాబు కలిసి 'నాన్నకు ప్రేమతో'లో కలిసి నటించారు. ఆ చిత్రంలో కూడా జగపతిబాబు నెగిటివ్ టచ్ ఉన్న పాత్రలోనే కనిపించారు. మళ్లీ తారక్‌తో చేయబోయే సినిమాలోనూ విలన్‌గా చేస్తుండటం గమనార్హం. తారక్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రానున్న ఈ సినిమా త్వరలోనే సెట్స్‌కి వెళ్లనుంది. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్.రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుంది.


సురభి

జర్నలిస్ట్ పాత్రలో..

'బీరువా, ఎక్స్‌ప్రెస్ రాజా, జెంటిల్ మన్' వంటి విజయవంతమైన చిత్రాల్లో సందడి చేసిన కథానాయిక సురభి. ఇటీవల 'ఒక్క క్షణం'తో పలకరించిన ఈ ముద్దుగుమ్మ.. ప్రస్తుతం మంచు విష్ణు కాంబినేషన్‌లో 'ఓటర్' చేస్తోంది. ఈ సినిమా తరువాత మరో తెలుగు చిత్రానికి సంతకం చేయని సురభి.. తాజాగా ఓ ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కు అంగీకారం తెలిపిందని తెలిసింది. తమిళంలో విజయవంతమైన 'కణితన్'కు రీమేక్‌గా రూపొందుతున్న చిత్రంలో కథానాయికగా సురభి కన్‌ఫర్మ్ అయిందని సమాచారం. నిఖిల్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ఒరిజనల్ వెర్షన్ టి.ఎన్.సంతోష్ దర్శకత్వం వహించనున్నారు. ఇంతకుముందు కేథరిన్ ట్రెసా, రష్మిక మందన్నా, షాలిని పాండే, హన్సిక వంటి కథానా యికల పేర్లు పరిశీలనలోకి వచ్చినా వారెవరూ కన్‌ఫర్మ్ కాలేదు. మరి.. సురభి అయినా ఈ ప్రాజెక్ట్‌లో ఉంటుందో మరొకరు చేరుతారో చూడాలి.



నిర్మాతపై ప్రియమణి ఫిర్యాదు...

హీరోయిన్ ప్రియమణి తన నిర్మాతలపై 'మా' అసోసియేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళ్తే.. ప్రియమణి ప్రధాన పాత్రధారిగా 'అంగుళీక' సినిమాలో నటించడానికి అంగీకరించారు. అయితే కొన్ని అనివార్య కారణాలతో ప్రియమణి ఆ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నారు. ఈ ఘటన జరిగి చాలా రోజులవుతుంది. అయితే రీసెంట్‌గా సదరు చిత్ర నిర్మాతలు 'అంగుళీక' సినిమా మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఈ సినిమాలో వారు ప్రియమణి నటించిందని సదరు దర్శక నిర్మాతలు చెప్పడంతో.. ఖంగుతిన్న ప్రియమణి తాను 'అంగుళీక' సినిమాలో నటించలేదని.. కానీ నిర్మాతలు తన ఫోటోలను వాడుకున్నారని మూవీ ఆరిస్ట్ అసోసియేషన్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మరి మా అసోసియేషన్ దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోనుందో చూడాలి.

స్క్రిప్ట్ ఎవరిదీ

ఉండవల్లి స్క్రిప్ట్ చదివారు


- పవన్‌పై బుద్దా వెంకన్న ఫైర్



అమరావతి, మార్చి 15 (మనం ప్రతినిధి): శేఖర్ రెడ్డి అనే వ్యక్తికి లోకేశ్‌కి అసలు సంబంధం లేదని.. సంబంధం ఉంటే ఆనాడు ప్రతిపక్షం తమను ప్రశ్నించకుండా ఉండేదా? ఉండవల్లి అరుణ్ కుమార్ రాసిన స్క్రిప్ట్‌ను పవన్ చదువుతున్నారని అని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. చంద్రబాబును దేవుడితో కొలిచిన వ్యక్తి ఒక్క రోజులో ఎందుకు మారిపోయాడో తెలపాలన్నారు. ఎన్నో సార్లు సభలు పెట్టిన పవన్, టీడీపీ వాళ్లు అవినీతి చేశారని ఎక్కడా చెప్పలేదని తెలిపారు. అనూహ్యంగా గురువారం నిటి సభలో మాట్లాడటంలోని ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించారు. జేఎఫ్‌సీ రాసినది పవన్ చదివారని విమర్శించారు. ప్రజారాజ్యం పార్టీని కూడా పవన్ సపోర్ట్ చేశారని, మరి ఆ రోజు ప్రజారాజ్యం ఎందుకు అధికారంలోకి రాలేదో తెలియజేయాలన్నారు. చంద్రబాబు మేలిమి బంగారం లాంటివారని, ఒక లెజెండ్ అని తెలిపారు.

పవన్ పార్ట్‌టైం పొలిటీషియన్

- బీజేపీ స్క్రిప్ట్ చదివారు: ఎమ్మెల్యే బోండా



అమరావతి, మార్చి 15 (మనం ప్రతినిధి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఓ పార్ట్ టైం పొలిటీషియన్ అని తెలుగుదేశం ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. పవన్ కల్యాణ్ తెలుగుదేశంపై చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలన్నారు. శేఖరరెడ్డి కేసులో లోకేశ్‌కు సంబంధం ఉందని పవన్‌కు ప్రధాని మోదీ చెప్పారా? అని ప్రశ్నించారు. కుటుంబం కంటే ప్రజా సంక్షేమంపైనే లోకేశ్ ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. బీజేపీ స్క్రిప్ట్‌నే పవన్ చదివారని అన్నారు. రాజకీయాలు ఎన్నికల సమయంలోనే చేయాలని, ఏ ఆధారాలతో చంద్రబాబు, లోకేశ్ పై ఆరోపణలు చేశారో చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు విమర్శలు చేయలేదో, హోదా ఇవ్వని మోడీ పేరును ఎందుకు ప్రస్తావించలేదో చెప్పాలన్నారు. శేఖర్ రెడ్డికి, లోకేశ్ కు ఏమిటి సంబంధం? ఓ వైపు వైసీపీ, మరోవైపు జనసేనను పెట్టుకుని బీజేపీ రాజకీయాలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలపై పవన్‌కు అవగాహన లేదని, ఏపీ సమస్యలపై ఏనాడైనా ప్రధానిని, కేంద్రమంత్రులను కలిశారా? అని ప్రశ్నించారు.

పవన్ వెనుక బీజేపీ

- వైసీపీ ఫార్ములాతోనే మాటల స్క్రిప్ట్ : పల్లె



అమరావతి, మార్చి 15 (మనం ప్రతినిధి): టీడీపీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, మంత్రి నారా లోకేశ్‌ను టార్గెట్ చేస్తూ పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఆధారాలు లేకుండా మంత్రి లోకేశ్‌పై ఆరోపణలు చేయడం సరికాదని, పవన్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని అన్నారు. పవన్ వెనుక బీజేపి హస్తం ఉన్నట్లు అనుమానంగా ఉందన్నారు. వైసీపీ ఫార్ములా తోనే పవన్ మాటల స్క్రిప్ట్‌లా ఉందన్నారు. ఏపీకి నిధుల కోసం కేంద్రంపై పోరాటం చేయకుండా, టీడీపీపై దాడి చేయడం వెనుక మర్మమేమిటని ప్రశ్నించారు. ఇది పవన్‌కు సరికాదన్నారు. ఆయన తన వ్యాఖ్యలపై పునరాలోచించుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌లపై పవన్ చేసిన ఆరోపణలు ఆవేశంతో మాట్లాడినవని, ఆలోచనతో మాట్లాడినవి కావని అన్నారు. తండ్రికి అపకీర్తి వచ్చేలా లోకేష్ ఏనాడు వ్యవహరించలేదన్నారు. లోకేష్ నిప్పులాంటి వ్యక్తి అని, నారా వారి ఇంటా వంటా ఎక్కడ అవినీతికి ఆస్కారం లేదన్నారు. ప్రత్యేక హోదా కోసం, కేంద్ర సాయం కోసం ఏపీ ప్రజలు ఎదురు చూస్తుంటే ఈ సమయంలో టీడీపీని టార్గెట్ చేస్తూ మాట్లాడటం వెనుక బలమైన కుట్ర దాగి ఉందన్నారు. పవన్ కళ్యాణ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో గౌరవించారని, ఎంతో అభిమానించారని, ఈ రోజు ఏపీలో పాలన సవ్యంగా సాగుతుంటే, ఏదో బురదజల్లే వ్యాఖ్యలు మంచిదికాదన్నారు. కేంద్రం కుట్రలో పవన్ భాగస్వామ్యం అయ్యారనే అనుమానం తమకు కలుగుతోందన్నారు.

బీజేపీ.. వైసీపీల పావుగా పవన్

- చంద్రబాబుపై ఆరోపణలా?: చినరాజప్ప
- నాడు చిరంజీవి.. నేడు పవన్ కల్యాణ్
- కాపులను తాకట్టుపెడుతున్నారు: నారాయణ



అమరావతి, మార్చి 15 (మనం ప్రతినిధి): బీజేపీ, వైసీపీ కుట్రలో పవన్ కల్యాణ్ పావుగా మారారని డిప్యూటీ సీఎం చినరాజప్ప ఆరోపించారు. ఓటర్లు ఇతర పార్టీల వద్ద డబ్బు తీసుకుని జనసేనకు ఓటు వేయాలని చెప్పడం పవన్ నిజాయితీకి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. అమరావతి సచివాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. పవన్ తన పార్టీ ఆవిర్భావ సభలో మాట్లాడిన తీరు చూస్తే.. అతడి వెనుక బీజేపీ హస్తం ఉందనిపిస్తోందన్నారు. బీజేపీపై పోరాడాల్సిందిపోయి చంద్రబాబుపై ఆరోపణలు గుప్పించటం దురదృష్టకరమని, పవన్ తన కార్యకర్తలకు దిశానిర్దేశం చేయకుండా టీడీపీని టార్గెట్ చేశారని విమర్శించారు. ప్రజల సహకారంతో కేంద్రంపై టీడీపీ పోరాడుతోందని చెప్పారు. రాష్ట్రంలో టీడీపీ ఒక బలమైన పార్టీ అని అంతా తమతో కలిసి రావాలని చినరాజప్ప ప్రజలకు పిలుపునిచ్చారు. కాపుల విషయంలో తాము తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలకు గండి

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బీజేపీ చేతిలో పావుగా మారి రాష్ట్ర ప్రయోజనాలకు గండికొడుతున్నారని మంత్రి నారాయణ ఆరోపించారు. చిరంజీవి ప్రజారాజ్యం కారణంగా కాపులు 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయారన్నారు. నాడు ప్రజారాజ్యం పేరుతో చిరంజీవి కాపులను తాకట్టు పెట్టారని, ఇప్పుడు పవన్ కల్యాణ్ అలానే చేస్తున్నారని విమర్శించారు.

ఎన్టీఆర్ నా దేవుడు

- ఆయన దగ్గర చాలా నేర్చుకున్నా
- ప్రజలే నాకు హైకమాండ్
- కుటుంబం కన్నా కార్యకర్తలే మిన్న
- నా భార్య వల్లే నాకు ఏ సమస్యల్లేవు
- ఏ నాయకుడు నాలా కష్టపడలేదు
- వెంకటేశ్వరస్వామి పునర్జన్మ ఇచ్చాడు
- అసెంబ్లీలో చంద్రబాబు ప్రసంగం



అమరావతి, మార్చి 15 (మనం ప్రతినిధి): తనను కని, పెంచిన తల్లిదండ్రుల కన్నా ఎన్టీఆర్‌ను గొప్పగా గుర్తు పెట్టుకుంటానని టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ''ఎన్టీఆర్ నా దేవుడు. ప్రజలే నాకు హైకమాండ్. అంతేకానీ లాలూచీ రాజకీయాలకు నేను భయపడను'' అని చంద్రబాబు స్పష్టం చేశారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంపై చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడారు. ఎన్టీఆర్ దగ్గర రాజకీయాలు చాలా నేర్చుకున్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. కుటుంబం కన్నా కార్యకర్తలే తనకు క్లిష్ట సమయాల్లో అండగా ఉన్నారని చంద్రబాబు చెప్పారు. తన సతీమణి భువనేశ్వరి కుటుంబానికి సంబంధించిన పనులు చూసుకోవడం వల్లే తనకు రాజకీయాల్లో రాణించగలిగానని చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఏనాడూ ఆవిడ ముఖ్యమంత్రి కూతురు, భార్యలా ఆలోచించలేదని ప్రశంసించారు. తాను ధైర్యంగా పనిచేయగలుగుతున్నానంటే.. దానికి తన సతీమణి కారణమని చంద్రబాబు అన్నారు.

ఎన్నో సంక్షోభాలు ఎదుర్కొన్నా..

ఏ రాజకీయనాయకుడూ పార్టీ కోసం తనలా కష్టపడలేదని చంద్రబాబు అన్నారు. 40 ఏళ్ల రాజకీయాల్లో ఎన్నో అవరోధాలు, సంక్షోభాలు ఎదుర్కొన్నానని తెలిపారు. ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుని ముందుకుపోయానని తెలిపారు. ''నాకు జీవితంలో భయం అంటే తెలియదు. నా జీవితం నాకు నేర్పించిన పాఠం అది. ఉదయం నిద్ర లేచినప్పునడు ధ్యానం చేసినప్పుడు నేను ఎవరిని? ఎక్కడ పుట్టాను. ఎలా పైకి వచ్చాను. ఇప్పుడు నా బాధ్యత ఏమిటి? అని ప్రతిరోజూ ఆలోచిస్తాను. కుటుంబ వ్యవహారాలు గురించి పది నిమిషాలు ఆలోచిస్తాను. కుటుంబ వ్యవస్థ దేశానికి ఆదర్శం'' అని బాబు వేదాంత ధోరణిలో మాట్లాడారు.

ఆ విషయం నాకు గుర్తులేదు..

రాజకీయాల్లో 40 ఏళ్లు పూర్తయ్యాయన్న విషయం తనకు గుర్తు లేదన్నారు. మిత్రులు, పార్టీ నేతలు చెప్పే వరకు ఆ విషయాన్ని పట్టించుకోలేదని తెలిపారు. కొంతమంది తనకు ఫోన్ చేసి చెబితే.. అవును కరెక్టే కదా అనుకున్నానన్నారు. ఆ నాటి నుంచి నేటి వరకు అన్నీ కళ్ల ముందు కదలాడుతున్నాయని తెలిపిన ఆయన.. కాసింత ఉద్వేగానికి గురయ్యారు. తాను ఎప్పుడూ పని చేసేందుకే ఇష్టపడతానని.. పనిలోనే ఆనందాన్ని వెతుక్కుంటానన్నారు. ఒకపని విసుగు అనిపిస్తే.. వేరే పనికి వెళ్లిపోతానని చెప్పారు. తాను మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు కేఈ కృష్ణమూర్తి, అశోక్‌గజపతిరాజు, బలరామకృష్ణమూర్తి ఎమ్మెల్యేలుగా ఉన్నారని.. తాను చేసే పోరాటాల్లో వాళ్లు పాల్గొన్నారని చంద్రబాబు గుర్తుచేశారు. పదేళ్ల ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నో పోరాటాలు చేశామని చంద్రబాబు చెప్పుకొచ్చారు. బాబ్లి ప్రాజెక్టు వద్ద తమను అరెస్ట్ చేశారని..అక్కడి ప్రభుత్వంతో తీవ్రంగా పోరాడామని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి కోసం విజన్‌ను ఏర్పాటు చేస్తే ఆ రోజు చాలా మంది తనను ఎగతాళి చేశారన్నారు. విభజన తర్వాత రాష్ట్రానికి చాలా సమస్యలు వచ్చాయని, సమస్యలకు భయపడి పారిపోలేదని చెప్పారు. తన మీద నమ్మకంతో తన మాట నమ్మి ఓట్లు వేసి గెలిపించారని, ప్రజలకు ఇబ్బంది రాకూడదనే ముందుకుపోతున్నానని చెప్పారు. రాజధానికి 33వేల ఎకరాల భూమి రైతులు ఇవ్వబట్టే.. ఈ రోజు అసెంబ్లీలో కూర్చొగలిగామని చెప్పారు.

కలామ్‌ను రాష్ట్రపతి చేశాను

రాష్ట్రపతి అభ్యర్థిగా అలెగ్జాండర్ వద్దని తానే అప్పటి ప్రధాని వాజ్‌పేయికి చెప్పానని చంద్రబాబు గుర్తుచేశారు. ''ఆరోజు నేను తునిలో ఉన్నాను. అప్పుడు ప్రధాని వాజ్‌పేయి ఫోన్ చేశారు. రాష్ట్రపతి అభ్యర్థిని మేము ఖరారు చేశామని చెప్పారు. అలెగ్జాండర్‌ను రాష్ట్రపతిగా పెట్టాలని అందరూ నిర్ణయించామని చెప్పారు. దానికి నేను అంగీకరించలేదు. రాష్ట్రపతి అభ్యర్థిగా అబ్దుల్ కలాం అయితే బాగుంటుందని అనుకున్నాం. అదే విషయాన్ని వాళ్లకు చెప్పాను. కేంద్రంతో గట్టిగా మాట్లాడి కలామ్‌ను రాష్ట్రపతి చేశాను. ఆనాటి ప్రధాని వాజ్‌పాయ్ చొరవ వల్లే రాష్ట్రంలో జాతీయరహదారులు వేయించగలిగాం'' అని ఆనాటి రోజులను గుర్తుచేశారు.

కిం కర్తవ్యం?

వ్యూహ ప్రతివ్యూహాల్లో పార్టీలు.. టీడీపీపై విమర్శలతో జనసేన



- మోదీపై అవిశ్వాసంతో వైసీపీ
- సొంతంగా పోటీకి టీడీపీ సై
- బీజేపీతో జతకట్టేది ఎవరెవరు?
- బహుముఖ పోటీకి ఏపీ సిద్ధం

(మనం – అమరావతి)

టీడీపీ అధిష్ఠానం గత కొంతకాలంగా ఊహించిందే జరిగింది. పవన్ కల్యాణ్ తమపై విమర్శల వర్షం గుప్పిస్తారని సమాచారం అందినప్పటి నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి వ్యూహం రచించడం ప్రారంభించారు. బుధవారం నాటి పవన్ విమర్శల వెనుక ఎవరున్నారు, ఎవరు లేరు అనేది ప్రస్తుతానికి అప్రస్తుతమైనా, రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం మాత్రం ఒక్కసారిగా సరికొత్త రంగులు దిద్దుకుంటోంది. ఇంతవరకు వైసీపీ ప్రధాన ప్రతిపక్షంగా చంద్రబాబుపై ఎదురుదాడి చేస్తూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకోవాలని చూస్తుంటే.. ఇప్పుడు ఉన్నట్టుండి పవన్ కూడా ముఖ్యమంత్రి సీటుపై గురిపెట్టి బరిలోకి దూకేశారు. అటు పవన్, ఇటు జగన్ ఇద్దరూ ప్రధాని నరేంద్ర మోదీపై నేరుగా ఒక్క విమర్శ కూడా చేయకపోవడం విచిత్రం. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సొంతంగా పోటీ చేయాలని గత వారం రోజులుగా కసరత్తు ప్రారంభించిన చంద్రబాబు నాయుడికి పవన్ హఠాత్తుగా విపక్షంగా మారిపోవడంతో సీట్లు సర్దుబాటులో కాస్త వెసులుబాటు లభించినట్లుగా భావిస్తున్నారు. పవన్ విమర్శలను గురువారం టీడీపీ మంత్రులు, నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా తిప్పికొట్టారు. అయినా చంద్రబాబు పవన్ కల్యాణ్‌పై విమర్శలొద్దని, వారి తిట్లే తనకు ఆశీర్వచనాలని అన్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రిమండలి నుంచి వైదొలగిన టీడీపీ శుక్రవారం సాయంత్రం జరగనున్న పొలిట్‌బ్యూరో సమావేశం తర్వాత ఎన్‌డీఏ నుంచి కూడా వైదొలగేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. తమపై విమర్శలు చేస్తున్న తమ వ్యతిరేక శక్తులను బీజేపీ నేరుగా ప్రోత్సహిస్తోందని అనుమానం వ్యక్తం చేసిన చంద్రబాబు ఆ దిశగా తాజాగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈశాన్య భారతంలో విజయం సాధించిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌పై దృష్టి సారించిన బీజేపీ, గత కొంతకాలంగా తమ ప్రభుత్వాన్ని బలహీనపరిచేందుకు పలు అడ్డంకులు సృష్టిస్తూ వచ్చిందని టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ మాస్టర్ ప్లాన్ ప్రకారం, అభిజ్ఞ వర్గాలు అందించిన సమాచారం మేరకు నాగపూర్ ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయంలో రూపుదిద్దుకున్న మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ రంగంలోకి దిగారు. ఈ మేరకు జగన్, పవన్‌లను కలిసి పోటీ చేసేలా ఒప్పించేందుకు ప్రయత్నాలు కూడా సాగుతున్నాయి. అయితే దీనికి అంగీకరించేందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా లేరని వైసీపీ వర్గాలు నిర్ధారిస్తున్నాయి. జనసేన.. అటు కమ్యూనిస్టులు, లోక్‌సత్తా, కాంగ్రెస్ పార్టీలతో కలిసి పోటీచేసే అవకాశాన్ని కూడా తోసిపుచ్చలేమని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.చిరంజీవి రాష్ట్ర కాంగ్రెస్‌లో ఇప్పటికీ అగ్రనేతగా కొనసాగుతుండటం ఈ వాదనకు ఊతమిస్తోంది.

ముక్కోణపు పోటీ...

మరోవైపు శుక్రవారం లోక్‌సభలో వైసీపీ ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి రాష్ట్ర ప్రయోజనాలే ప్రథమ కర్తవ్యమంటూ చంద్రబాబు అవిశ్వాసానికి మద్దతిచ్చి విపక్షాల ఎత్తుకు పైఎత్తు వేశారు. ఇప్పుడు అవిశ్వాస తీర్మానానికి కావలసిన సభ్యుల సంఖ్యను వైసీపీ, టీడీపీ కలిసి సాధిస్తాయా? లేక ఎవరికి వారే ఆ సంఖ్య కోసం ప్రయత్నిస్తారా? వేచి చూడాల్సి ఉంది. మరోవైపు, రాష్ట్రంలో ముక్కోణ పోటీకి రంగం సిద్ధమైనట్లే తెలుస్తోంది. ఇచ్ఛాపురం నుంచి హిందూపూరం, హిందూపురం నుంచి మంత్రాలయం వరకు ఎవరెవరి బలాలు ఎంతెంతో బేరీజు వేయడం ఇప్పటికే ప్రారంభించారు. జగన్, పవన్, చంద్రబాబు మధ్య పోటీ ఎలా ఉండనుందోనని అంచనాలు వేస్తున్నారు.

వీడియోకాల్ మాట్లాడుతూనే ఆత్మహత్య

ప్రేమ విఫలం కావడంతో యువకుడి దుశ్చర్య



హైదరాబాద్, మార్చి 15: క్షణికావేశంతో తీసుకున్న నిర్ణయంతో ఓ యువకుడి జీవితం అర్థాంతరంగా ముగిసింది. ప్రేమ విఫలం కావడంతో మనస్థాపం చెందిన యువకుడు ప్రేమికురాలితో వీడియో కాల్ మాట్లాడుతూనే ఉరివేసుకున్నాడు. మల్కాజ్‌గిరిలోని వినాయక్ నగర్‌లో అజ్మీర్ సాగర్(20) తన సోదరితో కలసి అద్దెకు ఉంటున్నాడు. సాగర్ కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే నాలుగు నెలల క్రితం ఆ యువతి బంధువులతోపాటు, ఇంట్లోవాళ్లు కూడా ఈ ప్రేమ వ్యవహారంలో సాగర్‌ని హెచ్చరించారు. ఈ క్రమంలో సాగర్ తల్లిదండ్రులు అతనికి పెళ్లి సంబంధాలు చూడటంతో తీవ్ర మనస్థాపానికి లోనయ్యాడు. ఈ సందర్భంగా ప్రేమికుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో ఆమె నువ్వు చనిపోతే నీ మీద కోపం పోతుందంటూ వాట్సాప్‌లో సందేశం పంపింది. దీనిపై మాట్లాడా లంటూ సాగర్ గురువారం ఉదయం ఆమెకు మెసేజ్ చేశాడు. తాను చనిపోవడం చూడాలనుకుంటే వీడియో కాల్ చేయమని కోరాడు. ఆ యువతి వీడియో కాల్ చేయగానే.. సాగర్ తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలిపాడు. సాగర్ సీరియస్‌గా చెప్పినప్పటికీ ఆమె సరదాగా తీసుకుంది. దీంతో సాగర్ వీడియో కాల్ మాట్లాడుతూనే సీలింగ్ ఫ్యాన్‌కి ఊరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడు మెదక్ జిల్లా బాబుసాయిపేటకు చెందిన వాడని తెలుస్తోంది. చేతికొచ్చిన కొడుకు బలవన్మరణానికి పాల్పడడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నగరాల్లో 70 స్పీడ్‌తో వెళ్లొచ్చు!

న్యూఢిల్లీ, మార్చి15: దేశంలోని ప్రముఖ నగరాల్లో వాహనాల వేగంపై కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై నగరాల్లో కార్ల కనీస వేగ పరిమితిని గంటకు 70 కిలోమీటర్లకు పెంచుతూ కేంద్ర రోడ్డురవాణ మంత్రిత్వశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కార్గో వాహనాలు గంటకు 60 కిలోమీటర్ల వేగంతో, ద్విచక్రవాహనాలు కూడా గంటకు 50 కిలోమీటర్ల వేగంతో దూసుకు పోవచ్చు. అయితే రాష్ట్రాలు, స్థానిక సంస్థలు రోడ్డు భద్రతపై వేగపరిమితిని తగ్గించుకునేందుకు కేంద్రం అనుమతించింది. ఎక్స్‌ప్రెస్‌వేలపై కార్లు గంటకు 120 కిలోమీటర్ల వేగంతో వెళ్లేందుకు తాము అనుమతిస్తున్నట్లు కేంద్ర రవాణ శాఖ సంయుక్త కార్యదర్శి అభయ్ దామ్లే వెల్లడించారు.

సిరిసిల్ల అభివృద్ధికి కృషి

- మంత్రి కేటీఆర్



వేములవాడ, మార్చి 15 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి బాటలో పయనిస్తూ అభివృద్ధికి చిరునామాగా నిలిచిందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. రూ.1.64 కోట్లతో నిర్మించిన రెండు కమ్యూనిటీ హాళ్లు, పిల్లల పార్కులు, రూ. 30 లక్షలో వ్యయంతో కొనుగోలు చేసిన రోడ్లు ఊడ్చే యంత్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ అభివృద్ధి పయణంలో సాగుతోందని పేర్కొన్నారు. సిరిసిల్ల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నానని చెప్పారు. పట్టణంలోని కార్గిల్‌లేక్‌ను పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టెస్కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సుడా ఛైర్మన్‌గా జీవీ రామకృష్ణారావు



కరీంనగర్, మార్చి 15(మనం న్యూస్ బ్యూరో): కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన జీవీ రామకృష్ణారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. న్యాయవాద వృత్తిలో రాణిస్తున్న రామకృష్ణారావు తొలినుంచి కేసీఆర్‌కు, టీఆర్ఎస్ బలోపేతంకోసం ఆహర్నిషలు కృషిచేశారు. పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న రామకృష్ణారావు ఎన్నిక ఉత్తర్వులను మంత్రి ఈటల రాజేందర్ విడుదలచేశారు. రామకృష్ణారావు నియామకం పట్ల కరీంనగర్, జిల్లావ్యాప్తంగా టీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.


ఎమ్మార్పీఎస్ అంతానికి కేసీఆర్ కుట్ర

- కృష్ణమాదిగపై సీఎం వ్యాఖ్యలు ఖండిస్తున్నాం
- దళితులను కేసీఆర్ మోసం చేస్తున్నారు: సండ్ర

హైదరాబాద్, మార్చి 15(మనం ప్రతినిధి): శాసనసభ వేదికగా సీఎం కేసీఆర్ మంద కృష్ణమాదిగపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని టీటీడీపీ నేత, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. గురువారం అసెంబ్లీలోని టీడీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మాదిగ జాతికి అన్యాయం చేస్తున్న కేసీఆర్.. వర్గీకరణకు నాయకత్వం వహిస్తాననడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. మంద కృష్ణమాదిగకు ప్రాణహాని ఉన్నదని మొత్తుకుంటున్నా కేసీఆర్ స్పందించకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్‌ను నాశనం చేసేందుకు కేసీఆర్ కుట్ర పన్నారని సండ్ర మండిపడ్డారు. మాదిగ జాతిని ఉద్ధరిస్తానని, తెలంగాణ రాష్ట్రానికి దళితున్ని తొలి సీఎం చేస్తానని ఎన్నికలకు ముందు చెప్పిన కేసీఆర్ ఫలితాలు వచ్చాక తానే సీఎం పీఠం ఎక్కి దళిత జాతికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మాదిగ జాతికి చెందిన ఉప ముఖ్యమంత్రి రాజయ్యను కేబినేట్ నుంచి అకారణంగా, అవమానకర రీతిలో కేసీఆర్ తొలగించారని గుర్తు చేశారు. మాల మాదిగలు లేని కేబినేట్ ఏర్పాటు చేసిన ఘనత కేవలం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుంతుందని సండ్ర ఎద్దేవా చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయకుండా, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

అక్రమాలను సహించం

- నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు
- లారీ ఓనర్స్ సమస్యల పరిష్కారానికి కమిటీ
- రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్, మార్చి 15 (మనం ప్రతినిధి): ట్రక్ ఆపరేటర్స్ హైవే ఎమినిటీస్ సొసైటీ(తోహాస్) అక్రమాల మీద రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి కన్నెర్ర చేశారు. ప్రభుత్వానికి, ప్రజా సంక్షేమానికి తూట్లు పొడిచి అక్రమాలకు పాల్పడిన వారిని సహించేదిలేదని హెచ్చరించారు. గురువారం సచివాలయంలో రాష్ట్ర లారీ అసోషియేషన్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుర్గాదాస్ మంత్రిని కలిసి తోహాస్ అక్రమాల మీద చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. దీంతో స్పందించిన మంత్రి వెంటనే రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్ శర్మ, జేటీసీలు పాండు రంగనాయక్, రమేష్‌లతోపాటు రాష్ట్ర లారీ ఓనర్స్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశమయ్యారు. రంగారెడ్డి జిల్లాలోని పెద్దంబరంపేటలో తోహాస్‌కు కేటాయించిన 9.37 ఎకరాల స్థలాన్ని ఆ సంఘం సెక్రటరీ జనరల్ మహమ్మద్ ఖాస్ దుర్వినియోగం చేశారని రుజువవ్వటంతో సదరు వ్యక్తులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

మనం టెక్నాలజీ


శుక్రవారం 16 మార్చి 2018
www.manamnews.com

ఈ తరహాలో మానిటర్లు రూపొందడం ప్రపంచంలోనే ఇదే తొలిసారట! చిత్రంలో మాదిరిగా యూఎస్‌బీ టైప్-సీ కేబుల్‌తో మరో ల్యాప్‌టాప్‌కి కనెక్ట్ చేసి అదనపు తెరని చిటికెలో పొందొచ్చు.

చిత్రంలో మాదిరిగా ముందుగా పోర్ట్‌కి చిన్న ప్లగ్‌ని కనెక్ట్ చేయాలి. 12.8 మందంతో ప్లగ్‌ని డిజైన్ చేశారు. ప్లగ్ మ్యాక్‌బుక్‌లో భాగంగా కలిసిపోతుంది. దానికి ఉన్న అయస్కాంతత్వంతో ఛార్జింగ్ కేబుల్‌కి అతుక్కునేలా చేసి ఛార్జ్ చేయవచ్చు.

మరింత స్మార్ట్‌గా యూఎస్‌బీలు!

ఫోన్... ట్యాబ్... ల్యాపీ... వాడేది ఏదైనా... అదనపు యాక్సెసరీస్‌తో మరింత సౌకర్యంగా మార్చేస్తుంటాం... ఇవిగోండి ఈ సరికొత్త యూఎస్‌బీలు అలాంటివే! యూఎస్‌బీ-సీ వెర్షన్‌తో సందడి చేస్తున్నాయి. వాడితే విలువైన ప్రయోజనాలు అనేకం! టెక్ ప్రియుల్లో ఎక్కువగా వినిపిస్తున్న పదం యూఎస్‌బీ. కొత్తగా అందుబాటులోకి వస్తున్న ఫోన్, పీసీ, ల్యాపీ అన్నింటి తయారీలో తనదైన ముద్రవేస్తూ గ్యాడ్జెట్లను మరింత స్మార్ట్‌గా మార్చేస్తోంది. కావాలంటే యాపిల్ అందించే మ్యాక్‌బుక్... గూగుల్ పరిచయం చేసిన క్రోమ్‌బుక్ పిక్సల్ కంప్యూటర్లను చూడండి. యూఎస్‌బీ-సీ సౌకర్యంతో నాజూకుగా తయారయ్యి టెక్ ప్రియుల్ని అలరిస్తున్నాయి. అన్ని అవసరాలకూ ఒక్కటే పోర్ట్! డిస్‌ప్లే, యూఎస్‌బీ, పవర్, హెచ్‌డీఎంఐ, వీజీఏ... ఇలా అన్ని అవసరాలకు ఆ పోర్ట్‌నే వాడుకోవచ్చు. ఇక కేబుల్‌ని కళ్లు మూసుకుని పోర్ట్‌కి కనెక్ట్ చేయవచ్చు. ఎందుకంటే... కేబుల్‌ని ఎటైనా తిప్పి అమర్చవచ్చు. వేగంగా డేటాని ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాయి. యూఎస్‌బీ 3.1 సూపర్‌స్పీడ్ వెర్షన్‌ని వాడుకుని ఏకంగా సెకన్‌కి 10 గిగాబైట్‌ల డేటాని ట్రాన్స్‌ఫర్ చేయవచ్చట.... ఇంతిలా సందడి చేస్తున్న కొత్త యూఎస్‌బీల సంగతులేంటో కాస్త వివరంగా చూద్దాం!



ఒకే దాంట్లో ఐదు

మార్కెట్‌లో వస్తున్న ఆధునిక ల్యాపీలు తక్కువ యూఎస్‌బీ పోర్ట్‌లతో నాజూకుగా రూపొందుతున్నాయి. కానీ, పలు సందర్భాల్లో అవసరం నిమిత్తం యూఎస్‌బీ పోర్ట్‌లతో ఎక్కువ పరికరాల్ని కనెక్ట్ చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఇలాంటప్పుడు ఉన్న ఒక్క యూఎస్‌బీ పోర్ట్‌ని 5 పోర్ట్‌లతో కూడిన హబ్‌గా మార్చేయవచ్చు తెలుసా? అందుకు పరికరాన్ని వాడొచ్చు. 'టైప్ సీ' వెర్షన్‌తో ముందుకొచ్చింది. దీంట్లో మొత్తం పోర్ట్‌లు ఐదు. రెండు యూఎస్‌బీ 3.0 పోర్ట్‌లు... రెండు కార్డ్ రీడర్లతో పాటు ఒక ఛార్జింగ్ పోర్ట్ ఉంది. చిత్రంలో మాదిరిగా వాటిని కనెక్ట్ చేసి వాడుకోవచ్చు. మీరు వాడే నాజూకు ల్యాపీకి తగినట్టుగానే హబ్‌ని కూడా తీర్చిదిద్దారు. యాపిల్ మ్యాక్‌బుక్‌కి సరిపడే రంగుల్లో అందిస్తున్నారు.

పెన్‌డ్రైవ్ యూఎస్‌బీ

ల్యాపీలు, స్మార్ట్ ఫోన్‌లు అన్ని యూఎస్‌బీ టైప్-సీ టెక్నాలజీని సపోర్ట్ చేసేవే. మరైతే ఫోన్‌లోని డేటాని సులువైన పద్ధతిలో కాపీ చేసుకునేందుకు ఏదైనా ఫ్లాష్ డ్రైవ్‌ని వాడదాం అనుకుంటే ఓ సరికొత్త డ్రైవ్ సిద్ధంగా ఉంది. అదే శాన్‌డిస్క్ కంపెనీ అందించే ఫ్లాష్ డ్రైవ్. దీని మెమొరీ సామర్థ్యం 32జీబీ. ఇది కేవలం ఫ్లాస్‌డ్రైవ్ మాత్రమే కాదు. రెండో వైపు యూఎస్‌బీ టైప్-సీ పోర్ట్ ఉంది. పీసీ, ల్యాపీ, ఫోన్ దేనికైనా ఇట్టే కనెక్ట్ అయ్యి డేటాని చిటికెలో ట్రాన్స్‌ఫర్ చేస్తుంది. యూఎస్‌బీ 3.0 వెర్షన్‌తో ఫ్లాష్ డ్రైవ్‌లోకి డేటాని కాపీ చేసుకోవచ్చు. ఇలా డ్రైవ్‌లోకి కాపీ చేసిన డేటాని టైప్-సీ కనెక్టర్‌లో ఫోన్, ట్యాబ్, ల్యాపీలకు కనెక్ట్ చేసి డేటాని క్షణాల్లో కాపీ చేయవచ్చు. అంతేకాదు... ఫ్లాష్ డ్రైవ్‌తో ఫోన్, ల్యాపీలను ఒకేసారి కనెక్ట్ చేసి డేటా ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు.

ఇదో హార్డ్‌డ్రైవ్



నోట్‌బుక్... నెట్‌బుక్... క్రోమ్‌బుక్‌లు... వీటిల్లో బిల్ట్‌ఇన్ ఎస్‌ఎస్‌డీ స్టోరేజ్ సామర్థ్యం తక్కువే! మరైతే టీబీల్లో మెమొరీని ల్యాపీ, డెస్క్‌టాప్ పీసీలకు అనుసంధానం చేయాలంటే? సీగేట్ కొత్తగా అందిస్తున్న ఎక్స్‌టర్నల్ స్టోరేజ్ పరికరాల్ని వాడడమే! దీని మెమొరీ సామర్థ్యం ఎంతో తెలుసా? 8టీబీ. యూఎస్‌బీ ట్కెప్-సీ సదుపాయంతో మార్కెట్‌లోకి వచ్చిన తొలి డెస్క్‌టాప్ ఎక్స్‌టర్నల్ స్టోరేజ్ పరికరం ఇదేనట! యూఎస్‌బీ 3.1 వెర్షన్ పోర్ట్‌తో స్టోరేజ్ డివ్కెజ్‌ని అందిస్తున్నారు. మెరుపు వేగంతో డేటాని ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. చిత్రంలో మాదిరిగా యూఎస్‌బీ ట్కెప్-సీ కేబుల్‌తో కంప్యూటర్, ల్యాపీలకు కనెక్ట్ చేసి వాడుకోవచ్చు. ప్రత్యేక డెస్క్‌టాప్ సూట్‌తో (సీగేట్ డ్యాష్‌బోర్డ్) డేటాని ఎప్పటికప్పుడు స్టోరేజ్ పరికరంలోకి బ్యాక్‌అప్ అయ్యేలా సెట్ చేయవచ్చు.

మ్యాక్‌బుక్ కోసం...



యాపిల్ మ్యాక్‌బుక్‌ని వాడుతున్నారా? ఉన్న ఒక్క పోర్ట్‌ని కొత్త పద్ధతిలో వాడదాం అనుకుంటున్నారా? ఉదాహరణకు మ్యాక్‌బుక్‌కి ఛార్జింగ్ పెట్టారు. మధ్యలో ఆదమరిచి బుక్‌ని ఎట్కెనా తీసుకెళ్లాలని ప్రయత్నిస్తే! పోర్ట్‌కి కనెక్ట్ చేసిన కేబుల్ అడ్డుకుంటుంది. అస్తవ్యస్తంగా కేబుల్ డిస్‌కనెక్ట్ అవుతుంది. మరి, ఇలాంటి సమస్య రాకూడదు అనుకుంటే? మ్యాక్‌బుక్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన గురించి తెలుసుకోవాల్సిందే. ఇదో మాగ్నటిక్ యూఎస్‌బీ టైప్-సీ పవర్ కేబుల్. దీంతో మ్యాక్‌బుక్‌ని సౌకర్యవంతంగా ఛార్జ్ చేయవచ్చు. చిత్రంలో మాదిరిగా ముందుగా పోర్ట్‌కి చిన్న ప్లగ్‌ని కనెక్ట్ చేయాలి. 12.8 మందంతో ప్లగ్‌ని డిజైన్ చేశారు. ప్లగ్ మ్యాక్‌బుక్‌లో భాగంగా కలిసిపోతుంది. దానికి ఉన్న అయస్కాంతత్వంతో ఛార్జింగ్ కేబుల్‌కి అతుక్కునేలా చేసి ఛార్జ్ చేయవచ్చు.

పోర్టబుల్ మానిటర్



ఇంట్లో డెస్క్‌టాప్ కంప్యూటర్ వాడుతున్నారు. ఏదైనా ప్రత్యేక అవసరానికి అదనంగా మరో మానిటర్‌ని కనెక్ట్ చేసి వాడదాం అనుకుంటే? అసుస్ కంపెనీ తయారు చేసిన ఈ కొత్తరకం మానిటర్ గురించి తెలుసుకోవాల్సిందే. దీంట్లోని ప్రత్యేకత ఏంటంటే... యూఎస్‌బీ టైప్-సీ కేబుల్‌తో కనెక్ట్ చేసి వాడుకునేలా మానిటర్‌ని తీర్చిదిద్దడం. ఈ తరహాలో మానిటర్లు రూపొందడం ప్రపంచంలోనే ఇదే తొలిసారట! చిత్రంలో మాదిరిగా యూఎస్‌బీ టైప్-సీ కేబుల్‌తో మరో ల్యాప్‌టాప్‌కి కనెక్ట్ చేసి అదనపు తెరని చిటికెలో పొందొచ్చు. మానిటర్ తెర పరిమాణం 15.6 అంగుళాలు. 8.5 ఎంఎం మందంతో నాజూకుగా మానిటర్‌ని రూపొందించారు. బరువు కేవలం 800 గ్రాములే. విండోస్ 10, మ్యాక్ ఓఎస్‌లను మానిటర్ సపోర్ట్ చేస్తుంది.

మొబైల్‌లో వార్తలు వింటారా?



ప్రపంచవ్యాప్త సమాచారాన్ని రేడియోలోలాగా వినాలనుకుంటే ఆప్ ఉంది. ఇండియా, ప్రపంచం, ఆటలు, వినోదం... లాంటి వివిధ విభాగాలున్నాయి. వాటిని క్లిక్ చేస్తే సంక్షిప్త వార్తలు కనిపిస్తాయి. ఆ వివరాల్ని వినాలనుకుంటే పైన ఉన్న స్పీకర్ ఐకాన్‌ను క్లిక్ చేయాలి. అప్పుడు ఒక్కో వార్తను న్యూస్ రీడర్ చదివి వినిపిస్తుంది. మొబైల్ డేటాతో న్యూస్ వింటే ఎక్కువ డేటా ఖర్చవుతుందనుకుంటే వైఫై ఉన్నప్పుడు వార్తల్ని ఆఫ్‌లైన్ చేసుకునే సౌకర్యమూ ఉంది.

ఆపిల్ అద్దం



ఆపిల్ పండు తెలుసు, ఆపిల్ ఫోను తెలుసు... ఇదేంటి కొత్తగా ఆపిల్ అద్దం అనుకుంటున్నారా? ఈ ఫొటోలో మీరు చూస్తున్నది అద్దం లాంటిదే... కానీ అద్దం కాదు. ఎందుకంటే ఇది మొబైల్. న్యూయార్క్‌కు చెందిన రాఫెల్ డైమెక్ అనే వ్యక్తి మొబైల్‌లా పని చేసే ఈ స్మార్ట్ అద్దాన్ని రూపొందించారు. ఐఓఎస్ 10 ఆపరేటింగ్ సిస్టమ్‌తో ఈ స్మార్ట్ అద్దం పని చేస్తుంది. ఇది పని చేసే విధానాన్ని డైమెక్ ఓ వీడియోగా చిత్రీకరించి యూట్యూబ్‌లో పెట్టాడు. అందులో ఆప్స్ వినియోగం, సెట్టింగ్స్ మార్చుకోవడం లాంటి పనులు చేసి చూపించాడు. అయితే ఇలాంటి అద్దాల్ని అమ్మకానికి పెట్టే అవకాశం ఉన్నదీ లేనిదీ డైమెక్ ఈ వీడియోలో చెప్పలేదు. అయితే ఇది గ్రాఫిక్ మాయనా, నిజమా అనేది తెలియడం లేదు.

బుల్లి మైక్రోలెన్స్

ఆధునిక హంగులతో ఫోన్ కెమెరాలు చేస్తున్న సందడి చూస్తూనే ఉన్నాం. డిజిటల్ కెమెరాల మాదిరిగా అదనపు లెన్స్‌ని ఫోన్ కెమెరా లెన్స్‌కి తగిలిస్తూ భిన్నమైన ఫొటోలు తీసేందుకూ ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో అనేక రకాల లెన్స్ స్మార్ట్ ఫోన్‌ల కోసం పుట్టుకొస్తున్నాయి. వాటిల్లో ఇప్పుడు కొత్తగా రెండు మినీ లెన్స్ సందడి చేస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యంత పల్చటి మైక్రోస్కోప్ లెన్స్ ఇవేనట. స్మార్ట్ ఫోన్‌లు, ట్యాబ్లెట్ కెమెరాలకు వీటిని చిత్రంలో మాదిరిగా అతికించి మైక్రో ఫొటోగ్రఫీ చేయవచ్చు. సూక్ష్మ ప్రపంచాన్ని ఫోన్ కెమెరా కంటితో సులువుగా చూడొచ్చు. మ్యాక్రో లెన్స్‌ని వాడి 10ఎక్స్ మ్యాగ్నిఫికేషన్‌తో ఫొటోలు తీయొచ్చు. రెండు లెన్స్ మందం వరుసగా 0.5, 1.2ఎంఎం. వీటిని ఏటీఎం కార్డ్‌ల మాదిరిగా పర్సులో పెట్టుకుని తీసుకెళ్లొచ్చు. వాడుతున్న ఫోన్ మోడల్‌కి అనుగుణంగా లెన్స్‌ని కెమెరాకి అతికించొచ్చు. లెన్స్‌తో కూడిన టేపు ఎన్నిసార్లయినా అతుక్కుంటుంది. ఒక్కసారి అతికించి ఫోన్‌కి అలానే వదిలేయవచ్చు కూడా. ఎందుకంటే ఫోన్‌ని వాడేటప్పుడు లెన్స్‌తో ఎలాంటి అసౌకర్యం ఉండదు. ఫోన్ కెమెరా సెన్సర్ ఆధారంగా లెన్స్ పని చేస్తాయి.



బ్యాటరీ లేకుండా మొబైల్



స్మార్ట్‌ఫోన్‌కు త్వరలో ఛార్జింగ్ పెట్టక్కర్లేదు. మీరు చదివింది నిజమే. అసలు మొబైల్‌లో బ్యాటరీ ఉంటేనే కదా ఛార్జింగ్ పెట్టాల్సి వచ్చేది. ప్రస్తుతం వాషింగ్టన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు బ్యాటరీ లేని మొబైల్ రూపొందించే పనిలో ఉన్నారు. రేడియో సిగ్నల్స్, కాంతి నుంచి శక్తిని అందుకొని ఈ మొబైల్ పని చేస్తుంది. ఇప్పటి మొబైల్స్‌లో మాట్లాడినప్పుడు... ఆ మాటలు డిజిటల్ సిగ్నల్స్‌గా మారి అవతలి వ్యక్తికి చేరుతాయి. రాబోయే మొబైల్స్‌లో మాట్లాడితే మైక్రోఫోన్స్‌లో వ్కెబ్రేషన్స్ ఉత్పత్తి అవుతాయి. అవి ఎనలాగ్ సిగ్నల్స్‌గా మారి ఆంటెనా ద్వారా అవతలి వ్యక్తికి చేరుతాయి. అలా విద్యుత్తు వినియోగం తక్కువగా ఉంటుంది. కాబట్టి బ్యాటరీ లేకుండా ఇవి పని చేస్తాయంటున్నారు శాస్త్రవేత్తలు. ప్రస్తుతానికి ప్రోటోటైప్ మాత్రమే సిద్ధమైంది. దీన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తే మరిన్ని ఆప్షన్లు అందుబాటులోకి వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఈ బ్యాగులోవి కొట్టేయలేరు



కాలేజీ విద్యార్థులు, ఉద్యోగులు బ్యాక్‌పాక్ లేకుండా బయటికి పోలేని స్థితి. అయితే, ఇప్పటి వరకూ మార్కెట్‌లో అందుబాటులో ఉన్న బ్యాగులన్నింటికీ ముందు భాగంలోనే పలు రకాల జేబులు ఉన్నాయి. దీంతో బ్యాగు తగిలించుకున్నాక వెనక పదే పదే చెక్ చేస్తుంటాం. జేబులకు ఉన్న జిప్‌లన్నీ సరిగా ఉన్నాయా... లేదా అని. జన సంద్రంలో దొంగల భయంతో కొన్ని సార్లు వీపునకు తగిలించుకోవాల్సిన బ్యాగుని ముందుకి తగిలించు కుంటాం కూడా. ఇలాంటి ఇబ్బందులు లేకుండా వస్తువుల్ని భద్రంగా మోసుకెళ్లాలంటే? వైవిధ్యమైన డిజైన్‌తో బ్యాగుని తీర్చిదిద్దారు. బ్యాగు ముందు భాగంలో ఒక్క జేబూ కనిపించదు. తగిలించుకున్న బ్యాగు జిప్‌ని ఓపెన్ చేయడం ఇతరులకు అసాధ్యం. సామర్థ్యం 20 లీటర్లు. 15 అంగుళాల పరిమాణం ఉన్న ల్యాపీని సులువుగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక అర ఉంది. ట్యాబ్లెట్, ఐపాడ్, మొబైల్... లాంటి ఇతర యాక్ససరీస్‌ని పెట్టుకునేందుకు లోపల ప్రత్యేక అరలు ఉన్నాయి. వర్షంలో 'రెయిన్ ప్రూఫ్' కవచంతో బ్యాగుని తడవకుండా కాపాడుకోవచ్చు. పవర్ బ్యాంకుని బ్యాగులోపల ఏర్పాటు చేసిన యూస్‌బీ పోర్ట్‌కి అనుసంధానం చేసి ఫోన్‌ని ఛార్జ్ చేయవచ్చు. అందుకు అనువుగా బ్యాగుకి బయటి పక్క ఎక్స్‌టర్నల్ యూఎస్‌బీ పోర్ట్‌ని నిక్షిప్తం చేశారు.

ఫ్లయింగ్ సెల్ఫీ

ఫోన్... సెల్ఫీ స్టిక్‌తో... సెల్ఫీలు తీసుకుని ఉంటారు. కానీ, ఎప్పుడైనా 'ఫ్లయింగ్ సెల్ఫీ' తీసుకున్నారా? చిత్రంలో ఎగురుతూ కనిపించేది అదే. డ్రోన్ మాదిరిగా 25 మీటర్ల పరిధిలో ఎగురుతూ సెల్ఫీల్ని చిత్రీకరిస్తుంది. 360 డిగ్రీల కోణంలో పనోరమిక్ ఫొటోలను క్యాప్చర్ చేస్తుంది. ఫోన్‌తో కనెక్ట్ అయ్యి పని చేస్తుంది. అంటే... ఫోనే రిమోట్ అన్నమాట. దీంతో ఫొటోలను తీసిన వెంటనే చూడొచ్చు. 'లైవ్ స్ట్రీమింగ్'తో వీడియోలను కూడా చిత్రీకరిస్తూనే వీక్షించొచ్చు. టెక్నాలజీతో ఎంతమందిలో ఉన్నా మీ ముఖాన్ని గుర్తించి ఫొటో అవుతుంది. 3 మీటర్ల పరదిలో మీ చుట్టూనే తిరుగుతుంది. ఎంత సేపు ఎగురుతుంది? అనేగా... ఫుల్ ఛార్జ్ చేస్తే 20 నిమిషాల పాటు ఎగురుతుందట. ఫుల్ ఛార్జ్ చేసేందుకు పట్టే సమయం రెండు గంటలు.



ప్రొజెక్టర్‌లో ఆండ్రాయిడ్



అత్యుత్తమైన వీడియో క్వాలిటీతో కూడిన ప్రొజెక్టర్‌లు మార్కెట్‌లో చాలానే ఉన్నాయి. అయితే, ఆండ్రాయిడ్ ఓఎస్‌తో పని చేసే ప్రొజెక్టర్లు ప్రత్యేకమైనవి. వాటిల్లో 'ఒప్టోమా ఎంఎల్330' ఒకటి. యూజర్లకు ఇది ప్రత్యేకం. ఇంట్లో ఎక్కడైనా పెట్టుకుని వీడియోలు తిలకించొచ్చు. అందుకు అనువుగా తక్కువ పరిమాణంలో తీర్చిదిద్దారు. బరువు 460 గ్రాములు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఆండ్రాయిడ్ 4.4 (కిట్‌క్యాట్) ఓఎస్ వెర్షన్‌తో ఇది పని చేస్తుంది. సినిమాలే కాకుండా వీడియో గేమ్స్ ఆడొచ్చు. పీసీ అవసరం లేకుండా పవర్‌పాయింట్ ప్రజంటేషన్స్ రన్ చేసుకుని చూడొచ్చు. వై-ఫై నెట్‌వర్క్ సపోర్ట్‌తో నెట్టింట్లో అందుబాటులో ఉన్న వీడియో స్ట్రీమింగ్ సర్వీసుల్ని యాక్సెస్ చేసి చూడొచ్చు. ఆప్స్‌ని (నెట్‌ఫ్లిక్స్, యూట్యూబ్...) రన్ చేసుకునే వీలుంది. 3డీ కంటెంట్‌ని సపోర్ట్ చేస్తుంది. పై భాగంలో ఏర్పాటు చేసిన 'టచ్ కంట్రోల్స్'తో ప్రొజెక్టర్‌ని సులభంగా ఆపరేట్ చేయవచ్చు. హెచ్‌డీఎంఐ, మైక్రోఎస్‌డీ, యూఎస్‌బీ పోర్ట్, వై-ఫై, బ్లూటూత్, బిల్ట్ ఇన్ స్పీకర్లు ఉన్నాయి. ఇంట్లో హోం థియేటర్ స్పీకర్లను బ్లూటూత్ నెట్‌వర్క్ ద్వారా కనెక్ట్ చేసి వాడుకోవచ్చు. ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లేందుకు అనుకూలంగా ప్రత్యేక కేస్‌తో ప్రొజెక్టర్‌ని అందిస్తున్నారు.



ద్రవ్యోల్బణం/టోకు ధరల సూచి

ఫిబ్రవరి 2018


ఆధారం 2011-12=100

2016-17 | 2017-18

ద్రవ్యోల్బణం రేటు (తాత్కాలికం) 2.48% — జనవరి 2.84%

డబ్ల్యు.పి.ఐ (తాత్కాలికం) 115.8 — జనవరి 115.8

	2017-18	2016-17	డబ్ల్యు.పి.ఐ
అన్ని వస్తువులు	2.48	5.51	115.8
ప్రాథమిక వస్తువులు	0.79	4.01	128.0
ఆహార వస్తువులు	0.88	2.55	137.8
ఆహారేతర వస్తువులు	-2.66	4.65	120.6
ఇంధనం విద్యుత్	3.81	25.17	98.1
వస్తూత్పత్తి సరుకులు	3.04	3.23	115.2



ఆధారం: వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ


టాప్ లూజర్స్

15 మార్చి

బి.ఎస్.ఇ సెన్సెక్స్ 33,685.54 (-150.20 పాయింట్లు)


పాయింట్లు		%
312.40	యస్ బ్యాంకు	-2.04%
912.25	రిలయన్స్	-1.76%
301.45	ఐసీఐసీఐ బ్యాంకు	-1.60%
1297.40	హెచ్.యు.ఎల్	-1.48%
611.40	టాటా స్టీల్	-1.46%
528.95	యాక్సిస్ బ్యాంకు	-1.23%
254.10	ఎస్‌బీఐ	-1.13%
265.55	ఐటీసీ	-0.88%
516.90	సన్ ఫార్మా	-0.78%
1833.95	హెచ్‌డీఎఫ్‌సీ	-0.67%

మ్యూచువల్ ఫండ్లు ఈక్విటీ పెట్టుబడులు



ఆధారం: సెబి


రూపాయి వర్సెస్ డాలర్



తలకిందుల స్కేలు

దడ పుట్టిస్తున్న స్థలాల ధరలు

న్యూఢిల్లీ: మందగమనం కొంత కాలం కొనసాగిన తర్వాత, స్థిరాస్తుల రంగం పునరుద్ధరణ సంకేతాలు ఇస్తోందని, కానీ, స్థలాల ధరలు, ముఖ్యంగా, చిన్న నగరాల్లో అధిక స్థాయిల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోందని ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. రియల్టర్ల సంస్థ 'క్రెడాయ్' వార్షిక సదస్సులో ఆయన గురువారం ప్రసంగించారు. స్వీయ ప్రవర్తనా నియమావళిని పాటించవలసిందని, రాత్రికి రాత్రి దుకాణాలు తెరచి అంతే హఠాత్తుగా అదృశ్యమైపోయే వ్యక్తులను దూరం పెట్టవలసిందని ఆయన 'క్రెడాయ్'ని కోరారు. స్థిరాస్తుల రంగ మార్కెట్ శుభ సంకేతాలు ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తాయని ఆయన అన్నారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నది భవన నిర్మాణ, స్థిరాస్తుల రంగమేనని ఆయన చెప్పారు. నూతన స్థిరాస్తుల చట్టం రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) నిర్దేశిస్తున్న ఉత్తమ విధానాలను అమలుపరచడంలో 'క్రెడాయ్' పూర్తిగా సన్నద్ధమై ఉండగలదనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ''నియంత్రణ లేకపోతే, విజయ్ మాల్యాలు, నీరవ్ మోదీలు వంటివారు పుట్టుకొస్తా''రని ఉప రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. తాను పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ఆ స్థిరాస్తుల చట్టం ఆమోదం పొందిన సంగతిని ఆయన గుర్తు చేశారు. గత ఏడాది మే నుంచి అమలులోకి వచ్చిన ఈ చట్టం ఆస్తుల రంగానికి ఎంతో అవసరమైన పారదర్శకతను తీసుకురావాలని కోరుకుంటోంది. విజయవాడ, తదితర ప్రదేశాల్లో స్థలాల ధరలు న్యూయార్క్, వాషింగ్టన్‌లలోని వాటితో సమానంగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోందని వెంకయ్య నాయుడు అన్నారు. స్థలం ధర అధికంగా ఉండడంతో, గృహ నిర్మాణ వ్యయం పెరిగిపోతోందన్నారు. ప్లాట్లు ఎక్కువగా దళారీల చేతుల్లో ఉన్నాయని,



''ధరల దిద్దుబాటు అవసరం'' ఉందని అన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలోకి రియాలిటీ (వాస్తవికత) రావలసిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం కోటి 90 లక్షల గృహాలకు కొరత ఉందని, అది 2030 నాటికి 3 కోట్ల 80 లక్షలకు చేరగలదనే అంచనా ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఈ విషయంలో ప్రైవేటు సంస్థలు వహించవలసిన పాత్ర ఎంతో ఉందని, పర్యావరణం పేరుతో అభివృద్ధికి అవరోధాలు కల్పించకుండా, గృహ నిర్మాణ ప్రాజెక్టులకు జాప్యం చేయకుండా స్థానిక పాలనా సంస్థలు అనుమతులు ఇవ్వాలని ఉప రాష్ట్రపతి కోరారు.

భారత్ వృద్ధి 7.3 శాతంగా అంచనా



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారతదేశపు ఆర్థిక వృద్ధి 7.3 శాతానికి పెరగగలదని, 2019-20లో అది మరింతగా 7.5 శాతంగా ఉండగలదని అంచనా వేసినట్లు ఫిచ్ గురువారం వెల్లడించింది. భారతీయ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం వృద్ధి రేటు నమోదు చేయగలదని అమెరికా కేంద్రంగా ఉన్న ఫిచ్ ఏజన్సీ తన ప్రపంచ ఆర్థిక దృక్పథ నివేదికలో పేర్కొంది. కేంద్ర గణాంకాల కార్యాలయ (సి.ఎస్.ఓ) అధికారిక అంచనాలు కూడా 6.5 శాతంగానే ఉండడం విశేషం. ఆర్థిక వ్యవస్థ 2016-17లో 7.1 శాతం వృద్ధి చెందింది. ''వృద్ధిని వెనక్కి లాగుతూ వచ్చిన విధాన సంబంధిత అంశ ప్రభావం ఇప్పుడు పలుచబడిపోయినందున'' వృద్ధి పుంజుకునే అవకాశం ఉందని ఫిచ్ పేర్కొంది.

పెద్ద నోట్ల రద్దు పూర్వ స్థితికి ద్రవ్య సరఫరా

ద్రవ్య సరఫరా పెద్ద నోట్ల రద్దు మునుపటి స్థితికి, 2017 మధ్య కాలంలో చేరుకుందని, గతంలోని ధోరణిలో మాదిరిగానే ఇప్పుడది క్రమంగా పెరుగుతూ వస్తోందని ఫిచ్ తెలిపింది. అలాగే, 2017 జూలైలో తీసుకొచ్చిన వస్తువులు, సేవల పన్ను (జి.ఎస్.టి) సంబంధింత అవాంతరాలు కూడా క్రమంగా తగ్గిపోయాయని చెప్పింది. రికవరీ సంకేతాలు ప్రదర్శిస్తూ, భారతీయ ఆర్థిక వ్యవస్థ అక్టోబర్-డిసెంబరు కాలంలో ఐదు క్వార్టర్ల గరిష్ఠ స్థితి 7.2 శాతాన్ని తాకింది. వ్యవసాయం, నిర్మాణం, వస్తూత్పత్తి వంటి కీలక రంగాలు మంచి పనితీరు కనబరచడం దానికి దోహదపడింది. ఏప్రిల్‌తో మొదలవుతున్న 2018-19 ఆర్థిక సంవత్సర బడ్జెట్, ద్రవ్య పటిష్టత మందగతిన సాగుతుందని పేర్కొంది కనుక, అది సమీప కాల వృద్ధి దృక్పథానికి మద్దతిచ్చేదిగానే ఉందని ఫిచ్ తెలిపింది. అల్పాదాయ వర్గాల వారికి ప్రయోజనం చేకూర్చే (కనీస మద్దతు ధర, ఉచిత ఆరోగ్య బీమా) వంటి చర్యలు దానిలో ఉన్నాయి. అవి గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పెరగడానికి తోడ్పడతాయి. మౌలిక వసతుల పెట్టుబడులు ముఖ్యంగా ప్రభుత్వ యాజమాన్యంలోని వ్యాపార సంస్థల పెట్టుబడులు పెంచే పథకాలు కూడా ప్రభుత్వానికి ఉన్నాయని ఫిచ్ గుర్తు చేసింది. ''ఆ విధానాలు గణనీయమైన రోడ్డు నిర్మాణ పథకాలు, గత ఏడాది చివరలో ప్రకటించిన బ్యాంకుల పునర్ మూలధనీకరణ పథకాలకు తోడవుతున్నాయి. ఇవి మధ్య కాలంలో కూడా వృద్ధికి కొంత ఆలంబనగా నిలుస్తాయి'' అని ఫిచ్ వెల్లడించింది.

ద్రవ్యోల్బణం

వినియోగదార్ల ధరల సూచి పెరగడానికి వేగంగా పెరుగుతున్న ఆహార వస్తువుల ధరలే ప్రధాన కారణమని ఫిచ్ వెల్లడించింది. దీనికి భిన్నంగా, ఎక్సైజ్ సుంకాలను వెనక్కి తీసుకోవడం ద్వారా ప్రభుత్వం ఇంధన ధరలను అరికట్టగలిగింది. పెరుగుతున్న ముడి చమురు ధరల నేపథ్యంలో పెట్రోలు పంపుల వద్ద పెట్రోలు, డీజిలు ధరలను అంతో ఇంతో నిలకడగా ఉంచగలిగిందని ఫిచ్ వ్యాఖ్యానించింది. ''ద్రవ్యోల్బణం 2018, 2019 సంవత్సరాలలో, రిజర్వ్ బ్యాంక్ లక్ష్యానికి ఎగువ బ్యాండ్‌లో 5 శాతం కన్నా కొద్ది తక్కువగా ఉండగలదని మేం భావిస్తున్నాం'' అని ఫిచ్ పేర్కొంది. వృద్ధి మరింత వేగాన్ని పుంజుకున్న తర్వాత, రిజర్వ్ బ్యాంక్ వచ్చే ఏడాది నుంచి వడ్డీ రేట్లు పెంచడం ప్రారంభిస్తుందని, ద్రవ్యోల్బణ ఒత్తిడులు హెచ్చుగానే ఉంటాయని ఫిచ్ భావిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర పథకం, (ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, మోటారు వాహనాల విడి భాగాలు) వంటి కొన్ని వస్తువులపై కస్టమ్స్ సుంకాలు పెంచినందు వల్ల ధరలు కూడా పెరుగుతాయని పేర్కొంది.

గడువును ఇంకా పొడిగించేది లేదు

న్యూఢిల్లీ: సవరించిన రేట్లతో స్టిక్కర్లు అతికించిన, జి.ఎస్.టికి ముందునాటి, ప్యాకేజ్డ్ ఉత్పత్తుల అమ్మకం గడువును ఈ మార్చి 31కి మించి పొడిగించబోవడం లేదని వినియోగ వ్యవహారాల మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ గురువారం వెల్లడించారు. జి.ఎస్.టి గత జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన తర్వాత, నూతన గరిష్ఠ చిల్లర ధరను ప్రదర్శించేందుకు, అమ్ముడుపోని ప్యాకేజ్డ్ వస్తువులపై స్టిక్కర్లను అతికించి, సెప్టెంబరు వరకు అమ్ముకోవచ్చని కంపెనీలకు తెలిపారు. తర్వాత ఆ గడువును రెండుసార్లు పొడిగించారు. ప్రస్తుతం మార్చి 31 చివరి తేదీగా ఉంది. వచ్చే నెల నుంచి ప్యాకేజ్డ్ ఉత్పత్తులపై ఒకే ఎం.ఆర్.పి. ఉంటుందని, అమ్ముడుపోని నిల్వలపై అదనపు ధర స్టిక్కర్లను అతికించడానికి అనుమతించబోమని మంత్రి చెప్పారు. జి.ఎస్.టి కౌన్సిల్ నిర్ణయిస్తే తప్ప గడువును పొడిగించడం కూడా ఉండదని ఆయన తెలిపారు. నవంబరులో సుమారు 200 వస్తువులపై రేట్లను తగ్గించినప్పుడు, అదనపు స్టిక్కర్లు అతికించేందుకు వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతించింది.

ఎగుమతి సబ్సిడీలపై వివాదం



న్యూఢిల్లీ: భారతదేశపు ఎగుమతి సబ్సిడీ పథకాలను ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఓ)లో సవాల్ చేయాలన్న అమెరికా నిర్ణయం దేశీయ వర్తకులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ఈ ప్రోత్సాహకాలను ప్రభుత్వం దశల వారీగా ఎత్తివేయాలని భారతీయ ఎగుమతుల సంస్థల సమాఖ్య (ఎఫ్.ఐ.ఇ.ఓ) గురువారంనాడు పేర్కొంది. భారతదేశపు ఎగుమతుల సబ్సిడీ కార్యక్రమాలను సవాల్ చేస్తూ, డబ్ల్యు.టి.ఓలోని వివాద పరిష్కార సంప్రదింపుల యంత్రాంగానికి ఫిర్యాదు చేసినట్లు అమెరికా వాణిజ్య ప్రతినిధి (యు.ఎస్.టి.ఆర్) రాబర్ట్ లైట్‌హైజర్ ప్రకటించారు. ''ఎగుమతుల రంగానికి ఇది పెద్ద తలనొప్పిగా తయారైంది. ఎగుమతి సబ్సిడీలుగా అభివర్ణిస్తున్న వాటిని దశల వారీగా రద్దు చేయాలని పరిశ్రమ అభిప్రాయపడుతోంది'' అని ఎఫ్.ఐ.ఇ.ఓ డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ చెప్పారు. దేశీయ ఎగుమతిదార్లకు అమెరికా ప్రధాన మార్కెట్‌గా ఉందని, భారతదేశపు మొత్తం ఎగుమతుల్లో సుమారు 14 శాతం అమెరికా నుంచి లభిస్తున్నాయని ఆయన చెప్పారు. పోటీకి ''అసమ'' అవకాశాలున్న రంగాన్ని సృష్టించడం ద్వారా భారతీయ సబ్సిడీ కార్యక్రమాలు అమెరికా వర్కర్లకు హాని చేస్తున్నాయని అమెరికా వాదిస్తోంది. అది అభ్యంతరం తెలుపుతున్న కార్యక్రమాలివి: మెర్కండైజ్ ఎక్స్‌పోర్ట్స్ ఫ్రం ఇండియా స్కీమ్, ఎక్స్‌పోర్ట్ ఓరియంటెడ్ యూనిట్స్ స్కీమ్, ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ స్కీమ్, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ క్యాపిటల్ గూడ్స్ స్కీమ్, డ్యూటీ ఫ్రీ ఇంపోర్ట్స్ ఫర్ ఎక్స్‌పోర్టర్స్ ప్రోగ్రామ్‌తో సహా సెక్టార్ స్పెసిఫిక్ స్కీములు.

డబ్ల్యు.టి.ఓ ఆధ్వర్యంలో అమెరికా సంప్రదింపులను కోరడమంటే, వివాద పరిష్కార ప్రక్రియలో మొదటి అడుగు వేయడమే. సంప్రదింపుల ద్వారా రెండు దేశాలు పరస్పర అంగీకార యోగ్య పరిష్కారానికి రాలేకపోతే, అమెరికా ఈ అంశాన్ని సమీక్షించవలసిందిగా డబ్ల్యు.టి.ఓ వివాద పరిష్కార ప్యానెల్‌ను కోరవచ్చు. పౌల్ట్రీ, సౌర శక్తి రంగంతో సహా రెండు కేసులలో డబ్ల్యు.టి.ఓ వద్ద ఇండియా ఇదివరకు ఓటమిని చవి చూసింది. పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో ఎనిమిది అమెరికా రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అమెరికాను 2016లో ఇండియా కూడా డబ్ల్యు.టి.ఓకు లాగింది. అక్కడి కంటెంట్ అవసర నియమాలు, అంతర్జాతీయ వర్తక నిబంధనలకు అనుగుణంగా స్థిరమైనవిగా లేవని భారతదేశం ఆరోపించింది. తాత్కాలిక వర్కింగ్ వీసాలపై అధిక ఫీజు విధించాలన్న అమెరికా నిర్ణయానికి వ్యతిరేకంగా కూడా భారతదేశం ఫిర్యాదు దాఖలు చేసింది. అమెరికాకు 2016-17 ఆర్థిక సంవత్సరంలో భారతదేశపు ఎగుమతులు 42.21 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నాయి. అదే ఆర్థిక సంవత్సరంలో దిగుమతులు సగటున 22.30 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నాయి.


టాటా టెలీని ఉద్యోగులకు అప్పగించేందుకు విముఖత

చెన్నై: ప్రైవేటు ఈక్విటీ ఫండు టి.పి.జి అండతో ఉద్యోగుల బృందం ఒకటి 100 కోట్ల డాలర్లకు పైగా మొత్తంతో టాటా టెలీసర్వీసెస్ లిమిటెడ్ మేనేజ్‌మెంట్ కొనుగోలుకు చేసిన యత్నం ముందుకు సాగని స్థితికి చేరుకుంది. గ్రూప్ కంపెనీ టాటా కమ్యూనికేషన్స్ లిమిటెడ్‌తో కలసి ఒక ''కాంబినేషన్''ను ప్రయత్నించి చూసేందుకు టాటా సన్స్ సుముఖంగా ఉన్నట్లు తేలింది. స్పెక్ట్రమ్‌తో కలిపి మొబైల్ వ్యాపారాన్ని ఎయిర్‌టెల్‌కు విక్రయించేందుకు గత ఏడాది అక్టోబరులో టాటా సన్స్ అంగీకరించిన తర్వాత, టాటా టెలీ వద్ద మిగిసిన ఎంటర్‌ప్రైజ్, ఫైబర్ వ్యాపారాలను తమ చేతిలోకి తెచ్చుకునేందుకు ఉద్యోగులు డిసెంబర్ మొదట్లో ప్రయత్నించారు. ఎంటర్‌ప్రైజ్ వ్యాపారాన్ని టాటా కమ్యూనికేషన్స్‌తో కలసి నిర్వహించడానికి ఉన్న అవకాశాన్ని టాటా సన్స్ ఇప్పటికీ అన్వేషిస్తోందని మేం తెలియజేయదలచుకున్నాం. టాటా గ్రూప్, దాని స్టేక్‌హోల్డర్లకు అత్యంత సర్వోత్తమ పరిష్కారంలో ఇది భాగం అవుతుందని మేం భావిస్తున్నాం. మా దీర్ఘకాలిక కస్టమర్లకు, ఉద్యోగులకు సరైన ఆవాసాన్ని కనుగొనడాన్ని (బాధ్యతగా) భావిస్తున్నాం'' అని టాటా సన్స్ ప్రతినిధి ప్రదీప్త బాగ్చీ చెప్పారు. అసలు ఉద్యోగుల బిడ్‌ను టాటా సన్స్ బోర్డు పరిశీలించిందా అనే ప్రశ్నకు ఆ ప్రతినిధి నేరుగా జవాబు ఇవ్వలేదు. నష్టాలతో నడుస్తున్న ఆ కంపెనీలో, తమ ఉద్యోగాలను సురక్షితం చేసుకునేందుకు టాటా టెలీ ఉద్యోగులు సంస్థను స్వాధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నించాలని అనుకున్నారు. వారి మాజీ మేనేజింగ్ డైరెక్టర్ (2008-10) ముకుంద్ గోవింద్ రాజన్‌ను ఈ ప్రయత్నానికి నేతృత్వం వహించవలసిందిగా కోరారు. టి.పి.జి నుంచి నిధులందే ఏర్పాటు చేసుకున్నారు. కాగా, టాటా కమ్యూనికేషన్స్‌లో కేంద్రానికి 26.12 శాతం వాటా ఉంది. టాటాలతో సంతకాలు చేసిన షేర్ హోల్డర్ల ఒప్పందం ప్రకారం, ప్రధాన నిర్ణయాలు తీసుకునేటప్పుడు కేంద్రంతో సంప్రదించాల్సిన అవసరం ఉంది. టాటా టెలీకి చెందిన ఎంటర్‌ప్రైజ్ వ్యాపారాన్ని చేజిక్కించుకునేందుకు టాటా కమ్యూనికేషన్స్ చేస్తున్న బిడ్‌కు మద్దతు ఇవ్వాలో లేదో కేంద్రం ఒక నిశ్చయానికి వచ్చినట్లు కనిపించడం లేదు. కేసును పరిశీలిస్తున్నామని, బంతి ప్రస్తుతం మంత్రి మనోజ్ సిన్హా కోర్టులో ఉందని టెలికాం మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. కేంద్రం దీన్ని ''సంకుచిత దృష్టితో కాక, సమగ్ర దృష్టితో'' చూస్తుందని ఆయన అన్నారు. టాటా టెలీని స్వాధీనం చేసుకునేందుకు 100 కోట్ల డాలర్లను వెచ్చించే శక్తి టాటా కమ్యూనికేషన్స్‌కు ఉందా అన్న ప్రశ్నకు, ''డబ్బును వెచ్చించాలో లేదో పరిశీలించేముందు మేం మొదట మా జేబును చూసుకోవాలి'' అని ఆ అధికారి జవాబిచ్చారు.

'సంప్రదింపులు త్వరలో పూర్తవుతాయి'

న్యూఢిల్లీ: స్పెక్ట్రమ్ ధరలు, డాటా గోప్యత నియమావళి చట్రం వంటి ముఖ్యమైన అంశాలపై చర్చలు జరుపుతున్న 'ట్రాయ్' చాలా భాగం సంప్రదింపులపై తన సిఫార్సులను రెండు మూడు నెలల్లో ఖరారు చేయగలననే ఆశాభావంతో ఉంది. ''ప్రస్తుతం కొనసాగుతున్న సంప్రదింపులు రెండు నెలల్లో ముగుస్తాయి...ఈ బహిరంగ చర్చల సంప్రదింపుల ప్రక్రియ 2-3 నెలల్లో పూర్తవుతుంది'' అని టెలికాం నియంత్రణ సంస్థ 'ట్రాయ్' చైర్మన్ ఆర్.ఎస్. శర్మ చెప్పారు. ఓవర్-ద-టాప్ (ఓ.టి.టి) సర్వీసులకు సంబంధించి ''అవశేష అంశాల'' పై నియంత్రణ సంస్థ చర్చా పత్రం మరో నెలలో జారీ చేయనున్నట్లు శర్మ వెల్లడించారు. ఇంటర్‌నెట్‌లో అందుబాటులో ఉండి, సామాజిక నెట్‌వర్క్‌లు, సెర్చ్ ఇంజన్లు, వీడియో యాగ్రిగేషన్ సైట్లు వంటి ఇంటర్‌నెట్ యాక్సెస్ సర్వీసులను ఇవ్వజూపే ఆపరేటర్ నెట్‌వర్కులపై పనిచేసే అప్లికేషన్లు, సర్వీసులను ఓ.టి.టి సర్వీసులంటారు. వాయిస్ టెలిఫోనీ లేదా టెలికాం సంస్థలు కల్పించే లాంటి మెసేజింగ్ సర్వీసులను ఆఫరు చేసే ఓ.టి.టి కమ్యూనికేషన్స్ ప్రొవైడర్లతో సహా స్టేక్‌హోల్డర్లు అందరికీ 'ఒకే సర్వీసు ఒకే నిబంధనలు' సూత్రాన్ని వర్తింపజేయాలని పెద్ద టెలికాం సంస్థలు, వాటి సంఘం సి.ఓ.ఏ.ఐ కోరుతూ వస్తున్నాయి. తమకు వర్తించే కఠినమైన డాటా సంరక్షణ నిబంధనలు 'సమానంగా, ఉమ్మడిగా' ఓ.టి.టి యాప్స్ వంటి ఇతర సంస్థలకూ వర్తింపజేయాలని టెలికాం సంస్థలు వాదిస్తున్నాయి. ఓ.టి.టిపై సంప్రదింపుల పత్రం ఇంకా వెలువడవలసి ఉంది. ఈలోగా గోప్యత, భద్రత, టెలికాం రంగంలో డాటా యాజమాన్యం వంటి అంశాలపై నియంత్రణ సంస్థ ప్రస్తుతం సంప్రదింపులు జరుపుతోంది. సమీక్షిస్తోంది. వాటిపై 'ట్రాయ్' సిఫార్సుల కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. స్థానికంగా టెలికాం పరికరాల తయారీని ప్రోత్సహించడం, అవాంఛనీయ కమర్షియల్ కమ్యూనికేషన్ (యు.సి.సి) యంత్రాంగాన్ని సమీక్షించడం వంటి ఇతర అంశాలను కూడా 'ట్రాయ్' పరిశీలించనుంది. లాంగ్ టెరమ్ ఎవల్యూషన్ (ఎల్.టి.ఇ)పై వాయిస్ కాల్స్‌కి సర్వీసు క్వాలిటీ విధానాలను నిర్ణయించడం, దివ్యాంగులకు టెలికాం, ప్రసార సర్వీసులను మరింతగా అందుబాటులోకి తీసుకురావడం కూడా చర్చకు వచ్చిన ఇతర అంశాల్లో ఉన్నాయి. వ్యక్తిగత డాటా నిర్వచనం, దానికి యజమానిగా ఎవరు వ్యవహరించాలి, చందాదార్లకు సర్వీసులు సమర్పించడానికి డాటాను నిల్వ చేసే లేదా నియంత్రించే సంస్థల బాధ్యతలు, వాడకందార్లకు వారి డిజిటల్ డాటాపై మరింత నియంత్రణ ఇవ్వడం వంటివి గోప్యత, భద్రత, డాటా యాజమాన్య చర్చా పత్రంలో ఉన్నాయి. స్పెక్ట్రమ్ వేలంపై టెలికాం కంపెనీలతో 'ట్రాయ్' జనవరిలో విస్తృతంగా చర్చలు జరిపింది.

పెరిగిన భయాలతో తగ్గిన మార్కెట్లు



ముంబయి: తీవ్ర హెచ్చు, తగ్గుల ట్రేడింగ్‌లో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' గురువారంనాడు 150 పాయింట్లు కోల్పోయి 33,685.54 పాయింట్ల వద్ద ముగిసింది. వరుసగా మూడవ రోజు కూడా స్టాక్ మార్కెట్లలో నష్టాలు కొనసాగాయి. లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ (ఎల్‌వోయూ)కి సంబంధించి తాజా మోసం రేకెత్తించిన భయం, తీవ్రమైన వాణిజ్య యుద్ధ కలవరంతో బ్యాంకింగ్, ఎఫ్.ఎం.సి.జి, ఐ.టి షేర్లు పతనమయ్యాయి.

చంద్రి పేపర్స్ అండ్ ఎలైడ్ ప్రాడక్ట్స్‌కి ముంబయిలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి) బ్రాడీ హౌస్ శాఖ రూ. 9 కోట్లను ''మోసపూరితంగా'' జారీ చేయడానికి సంబంధించి కేంద్ర నేర పరిశోధక సంస్థ (సి.బి.ఐ) కొత్త కేసు నమోదు చేయడంతో బ్యాంకింగ్ షేర్లు, ముఖ్యంగా యస్ బ్యాంక్, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్.బి.ఐ స్క్రిప్‌లు భారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విస్తృతమైన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి (ఎన్.ఎస్.ఇ) 50 షేర్ల సూచి 'నిఫ్టీ' కీలకమైన 10,400 స్థాయి దిగువకు పడిపోయింది. అది 10,346.20 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసి, చివరకు 50.75 పాయింట్ల నష్టంతో 10,360.15 పాయింట్ల వద్ద ముగిసింది. గురువారం ఉదయం 33,843.47 పాయింట్ల వద్ద సానుకూల ధోరణిలో ప్రారంభమైన తర్వాత 'సెన్సెక్స్' 33,866.28 పాయింట్ల గరిష్ఠ స్థితిని చూసింది. తర్వాత, బ్యాంకింగ్ షేర్లు క్షీణించడంతో లాభాలు వదులుకుని 33,637.28 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసింది. ''ప్రపంచ మార్కెట్లలోని మిశ్రమ ధోరణితో మార్కెట్ తక్కువ శ్రేణిలో ఏకీకృతం కావడాన్ని కొనసాగిస్తోంది. భారతదేశం 2019 ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం వృద్ధిని సాధిస్తుందనే ప్రపంచ బ్యాంక్ అంచనా సానుకూల దీర్ఘకాలిక సెంటిమెంట్‌ను ఇస్తుంది. కానీ, ప్రపంచ వాణిజ్య ఆందోళనలు, రానున్న రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై సందేహాలు మార్కెట్ నిర్ణయాత్మకంగా ఎగువకు పోకుండా నిగ్రహం పాటించేట్లు చేస్తున్నాయి'' అని జియోజీత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ అన్నారు.

పెట్రేగిన భయాలు

భారతదేశపు ఎగుమతి సబ్సిడీ పథకాలను డబ్ల్యు.టి.ఓలో అమెరికా సవాల్ చేయడంతో వాణిజ్య యుద్ధ భయాలు మళ్లీ రేకెత్తాయి. చైనా ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు చర్య తీసుకోవచ్చనే వార్తలు వాటికి మరింత ఆజ్యం పోశాయి. చైనా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అమెరికా తీవ్ర సుంకాలు విధించవచ్చని, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వచ్చే వారం మొదట్లోనే వడ్డీ రేట్లు పెంచడానికి అవకాశం ఉందనే ఆందోళనల మధ్య వాల్ స్ట్రీట్ క్షీణించింది. దాంతో ఆసియాలో ఇతర మార్కెట్లు కూడా మిశ్రమ స్థితిలో ముగిశాయి.

నష్టాన్ని నిలువరించిన అంచనాలు

భారతదేశపు స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి) వృద్ధి వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతంగా ఉండి, 2019-20 సంవత్సరంలో ఇంకా పెరిగి 7.5 శాతంగా ఉండగలదని ప్రపంచ బ్యాంక్, ఫిచ్ ఏజన్సీలు వెల్లడించిన అంచనాలు మార్కెట్ మరింత పతనం కాకుండా నిరోధించడంలో సహాయపడ్డాయి.

ఎరువుల కంపెనీల్లో జోష్

యూరియా సబ్సిడీని 2020 వరకు పొడిగించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించడంతో ఎరువుల కంపెనీల షేర్లు వెలుగులోకి వచ్చాయి. నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ (9.82 శాతం) నేషనల్ ఫెర్టిలైజర్స్ (5.15 శాతం), రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ (4.11 శాతం), కోరమాండల్ ఇంటర్నేషనల్ (5.37 శాతం), చంబల్ ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ (2.13 శాతం) పెరిగాయి. ఇది కూడా మార్కెట్ మరింత పతనం కాకుండా నిరోధించగలిగింది. బోనస్ అంశాన్ని పరిశీలించేందుకు మార్చి 19న సమావేశం కానున్నట్లు ప్రకటించిన వెంటనే ప్రభుత్వ యాజమాన్యంలోని ఎం.ఎం.టి.సి షేర్ ధర గురువారం 20 శాతం పెరిగింది. దక్షిణ కొరియా సంస్థ ఒకదానితో ఒప్పందంపై సంతకాలు చేయడంతో హావెల్స్ ఇండియా షేర్ 0.72 శాతం లాభపడింది.



క్వార్టర్ ఫైనల్లో సింధు

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ



ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆశాకిరణం సింధు జైత్రయాత్ర కొనసాగుతోంది. అంచనాలకు తగ్గరీతిలో ఆడుతూ సంచలన విజయాలతో టైటిల్ దిశగా దూసుకెళుతోంది

బర్మింగ్‌హామ్ : ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో సెన్సేషనల్ స్టార్ పి.వి. సింధు క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. థాయిలాండ్ ప్లేయర్ జిందాపోల్‌తో జరిగిన హోరా హోరీ రెండో రౌండ్ మ్యాచ్‌లో ఒలింపిక్ రజతపతక విజేత సింధు 21-13, 13-21, 21-18 స్కోరుతో గెలుపొంది క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. 66 నిమిషాలు సాగిన ఈ మ్యాచ్‌లో సింధు తొలి గేమ్ నుంచే దూకుడుగా ఆడి జిందాపోల్‌కు చెమటలు పట్టించింది. ప్రపంచ 11వ ర్యాంక్ క్రీడాకారిణి జిందాపోల్‌పై ఇంతకు ముందు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు గెలిచిన అనుభవం సింధుకు ఉంది. ఈ మ్యాచ్ చివర్లో సింధుకు అదే అనుకూలమైంది. స్మాష్‌లు, కార్నర్ షాట్లతో ప్రత్యర్థిని బెంబెలెత్తించి మ్యాచ్ ఆరంభంలోనే 7-3 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన సింధు ఆ తర్వాత ఏమాత్రం వెనుదిరగలేదు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా ఆడుతూ 20-13 పాయింట్లతో తొలి గేమ్ గెలుచుకుంది. అయితే రెండో గేమ్‌లో సింధుకు జిందాపోల్ నుంచి ఊహించని రీతిలో ప్రతిఘటన మొదలైంది. ఎటాకింగ్ గేమ్ మొదలుపెట్టిన జిందాపోల్ 7-3 ఆధిక్యంలోకి వెళ్లింది.

ఆ తర్వాతా పూర్తి ఆధిక్యతను కనబరచి 11-3 పాయింట్ల లీడ్‌లోకి వెళ్లింది. ఈ దశలో అనూహ్యంగా పుంజుకున్న సింధు ప్రత్యర్థి దూకుడుకు కాస్త బ్రేక్ వేసినా గేమ్‌ను చేజార్చుకోక తప్పలేదు. కీలకమైన మూడో గేమ్‌లో ప్రత్యర్థి బలహీనతలను సొమ్ము చేసుకుని పాయింట్లు సాధిస్తూ సింధు ఆధిక్యంలోకి దూసుకుపోయింది. ఎదురులేదనుకున్న తరుణంలో అనూహ్యంగా పుంజుకుని ఆడి 18 పాయింట్ల దాకా వచ్చినా ఆ తర్వాత సింధుదే పై చేయి అయింది.

చాంపియన్స్ ట్రోఫీ హాకీలో
దాయాదుల తొలి పోరు

న్యూఢిల్లీ : జూన్‌లో నెదర్లాండ్స్‌లో జరిగే చాంపియన్ షిప్ హాకీ టోర్నీలో చిరకాల ప్రత్యర్థులు భారత్-పాక్ జట్లు తొలి మ్యాచ్‌లో తలపడనున్నాయి. జూన్ 23 నుంచి జూలై 1 వరకు నెదర్లాండ్స్‌లోని బ్రెడాలో జరిగే ఈ టోర్నీ షెడ్యూల్‌ను అంతర్జాతీయ హాకీ సమాఖ్య విడుదల చేసింది. మొదటి రోజు జరిగే మ్యాచ్‌లో భారత్ - పాక్‌లతో పాటు యూరోపియన్ చాంపియన్ నెదర్లాండ్స్ జట్టు ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ అర్జెంటీనాతో తలపడుతుంది. అదే రోజు జరిగే మూడో మ్యాచ్‌లో ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియా రియో ఒలింపిక్ రజత పతక విజేత బెల్జియంతో పోటీపడుతుంది. పాకిస్తాన్‌తో పోటీ తర్వాత భారత జట్టు అర్జెంటీనాతో రెండో మ్యాచ్‌ను జూన్ 24న ఆడుతుంది. జూన్ 27న ఆస్ట్రేలియాతో మూడో మ్యాచ్, జూన్ 28న బెల్జియంతో చివరి మ్యాచ్‌ను ఆడుతుంది.

భారత జూనియర్లకు ఈజీ డ్రా

న్యూఢిల్లీ : బ్యాంకాక్‌లో ఏప్రిల్ 25 నుంచి జరిగే ఆసియా యూత్ ఒలింపిక్ క్వాలిఫైయింగ్ హాకీ-2018 పోటీల్లో భారత జట్లకు సులువైన డ్రా ఎదురైంది. ఈ పోటీల్లో భారత యువ జట్టు కొరియా, జపాన్, హాంకాంగ్, చైనా, కంబోడియాలతో పూల్ ఏలో ఆడుతుంది. ఇక బాలికల హాకీ జట్టు పూల్ బిలో కొరియా, థాయిలాండ్‌లోతో ఆడుతుంది.

కోహ్లీ జోకర్: హారిస్

డర్బన్ : ఆస్ట్రేలియా క్రికెటర్ స్టీవ్ స్మిత్, దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కగిసో రబాడ మధ్య జరుగుతున్న వివాదంలోకి.. టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీని లాగాడు దక్షిణాఫ్రికా స్పిన్నర్ పాల్ హారిస్. దక్షిణాఫ్రికా టూర్లో భాగంగా కోహ్లీ ఓ జోకర్‌లా పవర్తించాడని, అయినా అతడిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఎలాంటి చర్యలూ తీసుకోలేదని అతడు అన్నాడు. 'దక్షిణాఫ్రికాతో ఆడిన మూడు టెస్టుల్లోనూ కోహ్లీ చిల్లరగా, ఓ జోకర్లా వ్యవహరించాడు. కానీ, ఆ విషయంలో మాత్రం ఎలాంటి చర్యలూ లేవు. రబడాతో ఐసీసీకి ఏదో ఇబ్బంది ఉందని నాకు అనిపిస్తోంది. లేదంటే దక్షిణాఫ్రికాతోనైనా ఏదైనా ఇబ్బంది ఉందేమో' అని హారిస్ ట్వీట్ చేశాడు. రబడాపై ఐసీసీ రెండు మ్యాచ్‌ల నిషేధంతో పాటు మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత పెట్టిన సంగతి తెలిసిందే. దాంతో పాటు మూడు డీమెరిట్ పాయింట్లను అతడి ఖాతాలో వేసింది. దీంతో రబడా ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్‌లో రెండు టెస్టలకుదూరమయ్యాడు.

శ్రీలంకలో ఇంగ్లండ్ టూర్

కొలంబో : ఆరేళ్ల విరామం తర్వాత ఇంగ్లండ్ క్రికెట్ జట్టు ఈ ఏడాది అక్టోబర్‌లో శ్రీలంకలో పర్యటిస్తుంది. అక్టోబర్ 10న ప్రారంభమయ్యే ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ జట్టు మూడు టెస్టులు, ఐదు వన్డేలు, ఒక టి20 మ్యాచ్ ఆడుతుంది. మూడు వన్డేలు, ఒక టి ట్వంటీ మ్యాచ్ ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరుగుతాయి. తొలి టెస్ట్ గాలే స్టేడియంలో జరుగుతుంది. కాండీ స్టేడియంలో రెండో టెస్ట్, కొలంబోలో మూడో టెస్ట్ రెండు జట్లూ ఆడతాయి. 2012లో చివరి సారిగా శ్రీలంకలో పర్యటించిన ఇంగ్లండ్ జట్టు రెండు టెస్టల సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకుంది. 2016లో ఇంగ్లండ్‌లో ఆడిన శ్రీలంక జట్టు మూడు టెస్టులు, ఐదు వన్డేలు, ఒక టి ట్వంటీ మ్యాచ్ ఆడింది.

భారత ఫుట్‌బాల్ జట్టుకు 99వ ర్యాంక్

న్యూఢిల్లీ : భారత ఫుట్‌బాల్ జట్టుకు మళ్లీ టాప్ 100 ర్యాంక్‌లో చోటు దక్కింది. ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫీఫా) ప్రకటించిన తాజా ర్యాంకుల్లో భారత జట్టుకు 99వ స్థానం దక్కింది. తాజా ర్యాంకులు ప్రకటించిన కాలంలో భారత జట్టు ఎలాంటి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడకపోయినప్పటికీ మూడు స్థానాలు ఎగబాకి ఈ ఏడాది తొలి సారి 339 పాయింట్లతో మొదటి వంద జట్ల జాబితాలో చోటు దక్కించుకుంది. ఆసియా జట్ల జాబితాలో భారత్ తాజా ర్యాంకుల్లో ఖతార్, ఒమన్, జోర్డాన్, బహ్రెయిన్, ఉత్తరకొరియాల కంటే మెరుగ్గా 13వ స్థానంలో ఉంది. ఆసియా జట్ల జాబితాలో ఇరాన్ మొదటి స్థానంలో ఉండగా, ప్రపంచ చాంపియన్ జర్మనీ ప్రపంచ జట్ల జాబితాలో అగ్రస్థానంలో ఉంది.

క్వార్టర్ ఫైనల్లో ఫెదరర్

ఇండియన్ వెల్స్ : ఇండియన్ వెల్స్ ఏటిపీ టోర్నీలో వరల్డ్ నంబర్ వన్ రోజర్ ఫెదరర్ క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టాడు. మూడో రౌండ్ మ్యాచ్‌లో ఫెదరర్ 7-5, 6-4 స్కోరుతో జెర్మీచార్డీని ఓడించాడు. ఇప్పటికే ఇండియన్ వెల్స్ టోర్నీని ఐదు సార్లు గెలుచుకున్న ఫెదరర్ తదుపరి మ్యాచ్‌లో చెంగ్ హెయాన్‌తో పోటీపడతాడు.

మైదానంలో పాక్ క్రికెటర్ల గొడవ

కరాచీ : దుబాయ్ వేదికగా జరుగుతున్న పాకిస్తాన్ ప్రీమియర్‌లీగ్‌లో ఇద్దరు క్రికెటర్లు మైదానంలో గొడవ పడ్డారు.లాహోర్ జట్టుకు ఆడుతున్న బౌలర్ సొహైల్ ఖాన్, ఫీల్డర్ యాసిర్‌ల మధ్య జరిగిన వివాదం ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. 187 రన్స్ టార్గెట్‌ను ఛేజ్ చేసేందుకు బరిలోకి దిగిన గ్లాడియేటర్స్ జట్టు విజయానికి చేరువగా వచ్చింది. 9 బాల్స్‌లో 30 పరుగులు చేయాల్సి ఉంది. ఈ తరుణంలో 19వ ఓవర్ బౌలింగ్ చేస్తున్న సొహైల్ ఖాన్... థర్డ్‌మ్యాన్ పొజిషన్‌లో ఫీల్డింగ్ చేస్తున్న యాసిర్ షాను పక్కకు జరగాలని సూచించాడు. అయితే ప్రేక్షకుల గోల మధ్యలో మాటలు అర్థం కాక యాసిర్ కదల్లేదు. దీంతో సహనం కోల్పోయిన సొహైల్ ఖాన్ చేతిలో ఉన్నబంతిని యాసిర్‌పైకి విసిరేశాడు. దీనికి యాసిర్ కూడా అదే రీతిలో సమాధానం చెప్పాడు. కోపంగా బంతిని బౌలర్‌పై విసిరేశాడు.

సూపర్.. సుందర్



కొలంబో : బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ చేసిన మణికట్టు మాయాజాలంపై ప్రశంసల వర్షం కురుస్తోంది. బుధవారం నాటి మ్యాచ్‌లో సుందర్ నాలుగు ఓవర్లు వేసి 22 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. కెరీర్‌లో ఐదో టీ ట్వంటీ మ్యాచ్ ఆడుతున్న సుందర్ ఆరంభంలోనే బంగ్లా టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చి ఆ జట్టును ఒత్తిడిలోకి నెట్టేశాడు. భారత విజయంలో కీలక పాత్ర పోషించిన సుందర్‌పై ఇప్పుడు ప్రశంసల వర్షం కురుస్తోంది. వైవిధ్యమైన బంతులతో బంగ్లా బ్యాట్స్‌మెన్‌ను బోల్తాకొట్టించిన సుందర్‌కు ఉజ్వల భవిష్యత్ ఉందని క్రీడా ప్రముఖులు అభినందిస్తున్నారు. బ్యాట్‌పై దూసుకొస్తున్న బంతి ఎటు నుంచి ఎటు తిరుగుతుందో అర్థం కాక బంగ్లా బ్యాట్స్‌మెన్‌కు దిమ్మతిరిగిపోయాయి. ఒక దశలో 18 ఏళ్ల సుందర్ వేసిన బంతులు ఎదుర్కొనేందుకు బంగ్లాబ్యాట్స్‌మెన్‌కు చెమటలు పట్టాయి.

ఈ మ్యాచ్ సుందర్‌దే : రోహిత్

బుధవారం నాటి మ్యాచ్‌లో భారత జట్టు విజయంలో సుందర్‌దే కీలక పాత్ర అని కెప్టెన్ రోహిత్ శర్మ ప్రశంసల వర్షం కురిపించాడు. 'బంతితో మాయ చేసిన సుందర్‌మాకు అద్భుతమైన విజయాన్నందించాడు' అని మ్యాచ్ ముగిశాక రోహిత్ ఆకాశానికెత్తేశాడు. కొత్త బంతితో బౌలింగ్ చేయటం అంతసులువు కాకపోయినప్పటికీ అప్పగించిన బాధ్యతను అద్భుతంగా ముగించిన సుందర్‌కు మొదట బౌలింగ్ ఇచ్చేందుకు రోహిత్ కాస్త సందేహించినా మొదటి ఓవర్‌లోనే తన మ్యాజిక్‌ను ప్రదర్శించాడు. ఆ తర్వాత కావలసిన విధంగా ఫీల్డింగ్ సెట్ చేసుకుని వికెట్లు పడగొడుతూ.. పరుగులు నియంత్రిస్తూ బౌలింగ్ చేశాడు. ఒక్క మ్యాచ్‌తో సుందర్ ప్రతిభను మాజీలు ప్రశంసిస్తున్నారు. వన్డేలకు, టి ట్వంటీలకు భారత్‌కు మరో స్పిన్నర్ అందుబాటులోకొచ్చాడని విశ్లేషిస్తున్నారు. ఊరించే బంతులతో బ్యాట్స్‌మెన్‌ను బోల్తా కొట్టించే తీరు అద్భుతమని అభినందిస్తు_న్నారు. చాహల్, కుల్‌దీప్‌లకంటే మెరుగ్గా రాణిస్తున్న ఈ తమిళనాడు స్పిన్నర్‌కు భారత్ జట్టులో ఇక సుస్థిర స్థానం సంపాదించుకున్నట్టే.

పవర్‌ప్లేలో బౌలింగ్ సవాల్ : సుందర్

ఈటోర్నీలో అతి తక్కువ పరుగులిచ్చిన బౌలర్‌గా రికార్డుల్లో ఉన్న సుందర్ పవర్ ప్లేలో బౌలింగ్ చేయటం స్పిన్నర్లకు సవాల్ లాంటిదంటున్నాడు. అటువంటి ఛాలెంజ్‌ను ఎదుర్కొని సత్తా చూపెట్టినప్పుడే విజయం అందుతుందన్నాడు. 'క్రికెట్‌లో ఇలాంటి సవాళ్లు సహజం, వాటిని ఎదుర్కొని నిలబడగలగాలి, అప్పుడే ప్రతిఫలం దక్కుతుంది' అని సుందర్ అంటున్నాడు. ఫాస్ట్ బౌలర్లకు ఆదరణ పెరుగుతున్నప్పటికీ ఆఫ్ స్పిన్నర్లకు ఎప్పుడూ ఢోకా లేదని సుందర్ చెబుతున్నాడు.



ట్రై సిరీస్ ఫైనల్ చేరాలంటే రెండు జట్లకూ సవాలే. బంగ్లాదేశ్‌తో శుక్రవారం జరిగే కీలక పోరులో సొంత గడ్డపై శ్రీలంక సత్తా చాటుతుందా.. సంచలనాలకు మారుపేరైన బంగ్లా మరో సారి మెరుస్తుందా..సెమీస్ లాంటి సెమీస్‌లో విజేత ఎవరో?

డూ ఆర్ డై...

శ్రీలంక-బంగ్లాదేశ్ కీలక పోరు నేడు

కొలంబో : నిదహాస్ కప్ -2018 ట్రై సిరీస్ టి-20 పోరులో నేడు ఆసక్తికరమైన మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో ఫైనల్ ప్లేస్ కోసం చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ -శ్రీలంక జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇప్పటికే భారత జట్టు ఈ టోర్నీ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. శ్రీలంక తొలి మ్యాచ్‌లో భారత్‌ను ఓడించి 2 పాయింట్లు సొంతం చేసుకుంటే, శ్రీలంకతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో సంచలన విజయం సాధించిన బంగ్లా జట్టు రెండు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. దీంతో రెండు జట్లకూ ఈ మ్యాచ్ కీలకం కానుంది. ఒక వేళ మ్యాచ్ రద్దయితే రన్‌రేట్‌లో బంగ్లాదేశ్ కంటే కాస్త మెరుగ్గా ఉన్న శ్రీలంకకు అనుకూలమవుతుంది. రెండు మ్యాచ్‌ల నిషేధం కారణంగా ఈ పోటీకి కెప్టెన్ దినేశ్ చండిమాల్ దూరమయ్యాడు. దీంతో తిసారా పెరీరా ఈ మ్యాచ్‌లో లంక జట్టును ముందుకు నడిపించబోతున్నాడు. ఇక భారత్‌తో బుధవారం జరిగినమ్యాచ్‌లో మెరుగ్గా ఆడిన బంగ్లా జట్టు ఆ ఓటమిని మరచిపోయి తమ వ్యూహానికి పదును పెట్టాలని భావిస్తోంది. భారత్‌పై ముషాఫికర్ రహీమ్ అద్భుతంగా ఆడటం ఆ జట్టుకు కొత్త ఉత్సాహా న్నిచ్చింది. దీంతో పాటు గాయం నుంచి కోలుకుని జట్టులో చేరిన ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్ రాణిస్తే ఈ డూ ఆర్ డై మ్యాచ్‌లో శ్రీలంకను ఓడించటం కష్టమేమీ కాదని ఆ జట్టు ఆత్మవిశ్వాసంతో ఉంది.



జట్ల వివరాలు:

శ్రీలంక : తిసారా పెరీరా (కెప్టెన్), సురంగ లక్మల్ (వికెట్ కీపర్), ఉపుల్ తరంగ, గుణతిలక, కుశాల్ మెండిస్, దుషాన్ షణక, కుశాల్ పెరీరా, జీవన్ మెండిస్, ఇసురు ఉదానా, అకిల ధనంజయ, అమిలో అపోన్సో, నువాన్ ప్రదీప్, దుషమంతా చమీరా, ధనంజయ డి సిల్వా.

బంగ్లాదేశ్ : మహ్మదుల్లా (కెప్టెన్), తమిమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, ఇమ్రుల్ కయాస్, ముషాఫికర్ రహీమ్ (వికెట్ కీపర్), షబ్బీర్ రెహ్మాన్, ముస్తాఫి జుర్ రెహ్మాన్, రుబెల్ హుస్సేన్, తస్కిన్ అహ్మద్, అబు హైదర్, అబు జయేద్, అరిఫుల్ హక్, నజముల్ ఇస్లామ్, నూరుల్ హసన్, మెహిదీ హసన్, లిటోన్ దాస్.

సాయంత్రం 7 గంటల నుంచి డి. స్పోర్ట్స్, డి.డి. స్పోర్ట్స్ చానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం.

జాఫర్ డబుల్



వడోదర:ఒకప్పుడు టీమిండియాకు ఆడిన క్రికెటర్ వసీం జాఫర్ దేశవాళీ క్రికెట్‌లో రికార్డులు తిరగరాస్తున్నాడు 40 ఏళ్ల వయసులోనూ జోరుతగ్గని ఆటతో సత్తా తగ్గలే దని నిరూపిస్తున్నాడు. గతంలో భారత్ తరపున 31 టెస్టులు ఆడిన జాఫర్ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై చాలాకాలమైంది. అయితే ప్రస్తుతం జాఫర్ దేశవాళీ క్రికెట్‌లో పరుగుల యంత్రంలా ఆడుతున్నాడు. నాగ్‌పూర్‌లో విదర్భ జట్టు తరపున ఆడుతున్న జాఫర్ సూపర్ ఇన్నింగ్స్‌తో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆజట్టు మూడు వికెట్లు నష్టపోయి 598 పరుగుల భారీ స్కోరు చేసింది. మొదటి రోజు సెంచరీ చేసిన జాఫర్ రెండో రోజూ కూడా దూకుడు కొనసాగించాడు. చూడచక్కటి ఆటతో 285 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మొత్తం 425 బాల్స్ ఆడిన జాఫర్ 34 ఫోర్లు, ఒక సిక్స్‌తో ట్రిపుల్ సెంచరీకి చేరువయ్యాడు. జాఫర్‌తో పాటు గణేశ్ (102), ఫయిాజ్ ఫజల్ (89), రామస్వామి (53), అపూర్వ (44నాటౌట్)లు రాణించి విదర్భ భారీ స్కోరుకు కృషి చేశారు. ఈ సూపర్ ఇన్నింగ్స్‌తో ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో జాఫర్ పలు రికార్డులు సొంతం చేసుకున్నాడు. 40 ఏళ్ల వయసులో డబుల్ సెంచరీ చేసిన ఐదో క్రికెటర్ అయ్యాడు. దీంతో పాటు ఇరానీ కప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును కూడా సొంతం చేసుకున్నాడు. ఇప్పటి వరకూ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 242 మ్యాచ్‌లు ఆడిన జాఫర్ 18,109 పరుగులు చేశాడు. ఇందులో 86 హాఫ్ సెంచరీలు, 53 సెంచరీలున్నాయి. జాఫర్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధికంగా 315 పరుగులు చేశాడు. ప్రస్తుతం 285 పరుగులతో అజేయంగా ఉన్న జాఫర్ మూడో రోజు ట్రిపుల్ సెంచరీ చేసేందుకు రెడీ అవుతున్నాడు.

తప్పు చేస్తే ఉరిశిక్షకైనా సిద్ధం : షమీ

కోల్‌కతా : భారత క్రికెట్ బోర్డు చేపట్టిన విచారణలో తనది తప్పు అని తేలితే ఉరితీయచ్చని టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ షమీ చెబుతున్నాడు. షమీ ఒక మ్యాచ్ ఫిక్స్ చేసేందుకు పాకి స్తాన్ యువతి ద్వారా డబ్బు తీసుకున్నట్లు భార్య హసీన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలపై విచారణ జరిపి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం చీఫ్ నీరజ్ కుమార్‌ను పాలక కమిటీ ఆదేశించింది.

ముందే పెళ్లయిందని చెప్పలేదు ...

తనకు ముందే పెళ్లయిందన్న విషయం భార్య హసీన్ దాచి పెట్టిందని షమీ ఆరోపించాడు. హసీన్‌తో తనకు పెళ్లయ్యేప్పటికే వేరొకరితో పెళ్లయిందని ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని షమీ చెప్పాడు. ఆ ఇద్దరు పిల్లలు చనిపోయిన తన అక్క పిల్లలని హసీన్ చెప్పిందని గుడ్డిగా నమ్మి మోసపోయానని అన్నాడు. కొంత కాలం తర్వాత అసలు విషయం తెలిసి షాక్‌కు గురయ్యానని చెప్పాడు.

భారత్‌కు ఆస్ట్రేలియా షాక్

2-0 తేడాతో సిరీస్ కైవసం

వడోదర: సొంతగడ్డపై భారత మహిళా క్రికెట్ జట్టుకు ఆస్ట్రేలియా జట్టు షాకిచ్చింది. గురువారం జరిగిన రెండో వన్డేలో 60 పరుగుల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌ను ఇంకో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో చెత్తగా ఆడిన భారత్ ఈ మ్యాచ్‌లోనూ ఆటతీరును మెరుగుపరచు కోలేకపోయింది. 288 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియా జట్టులో స్మృతి మంధన(67) మాత్రమే అర్ధశతకంతో రాణించింది. మిగతా వాళ్లంతా నిరాశపరిచారు. జెస్ జొనాసెన్(3), వెల్లింగ్టన్(2) బౌలింగ్ ధాటికి ఇంకా 4 బంతులు మిగిలి ఉండగానే భారత్ 227 పరుగులకే కుప్పకూలింది. తొలి మ్యాచ్‌కు దూరమై రెండో వన్డేలోకి వచ్చిన కెప్టెన్ మిథాలీ రాజ్ సైతం నిరాశగా ఆడింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాకు మంచి శుభారంభం లభించింది. ఆ జట్టులో ముగ్గురు క్రికెటర్లు నికోలా బోల్టన్(84), ఎల్సీ పెర్రీ(70 నాటౌట్), బెత్ మూనీ(56) అర్ధశతకాలతో విజృంభించి జట్టుకు భారీ స్కోరు అందించారు. టీమిండియా బౌలర్లు వికెట్లు తీసినప్పటికీ భారీగా పరుగులిచ్చేశారు. కీలక సమయంలో టాపార్డర్‌ను నిలువరించలేక పోయారు. శిఖా పాండే 3, పూనమ్ యాదవ్ 2 వికెట్లు పడగొట్టగా ఏక్తా, హర్మన్ ప్రీత్ కౌర్ చెరో వికెట్ తీశారు.

సంక్షిప్త స్కోర్

ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 287/9 (బోల్టన్ 84, పెర్రా 70, మూనీ 56), భారత్ 49.2 ఓవర్లలో 227 ఆలౌట్ (మంధన 67, దీప్తి శర్మ 26, పూనమ్ రౌత్ 27, జాన్సన్ 3/51, పెర్రీ 2/41).



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.